




www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

# నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 05 శనివారం | జులై 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 290

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur







## చిన్న ద్వీపదేశంలో 45 శాతం మంది భారత సంతతి



5 ప్రధాని మోదీకి సొహారీ ఆకులో సంప్రదాయ భోజనం


## కంద్రం సంచలన నిర్ణయం..



- అలాంటి కంటెంట్ చేస్తే జైలుకే..
- యాంటీ నేషనల్ కంటెంట్‌పై కేంద్రం ఉక్కుపాదం

2

## జర్నలిస్టులకు చంద్రబాబు గుడ్‌న్యూస్



రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని అధికారులకు చంద్రబాబు ఆదేశం

2

## ఆసుపత్రి నుంచే కేసీఆర్ రాజకీయ సమీక్ష



2 పరామర్శకు వచ్చిన నేతలతో ప్రజా సమస్యలపై చర్చ

## బంగారం స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావుకు ఈడీ షాక్



2 రూ.34 కోట్ల ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ!

## అమెరికాలో కుక్క కాటుకు రూ.15 లక్షల పరిహారం



2 అమెరికాలో కుక్క కాటు.. రూ.15.73 లక్షల పరిహారం

# తేల్చుకుందాం!

- ఢిల్లీలో ఉండే మోడీ అయినా.. గల్లీలో ఉండే కేడీ
- అయినా రండీ తేల్చుకుందాం..సీఎం రేవంత్ సవాల్
- రైతుల కోసం ఏ ప్రభుత్వం చేసిందో చర్చకు రావాలి
- బీఆర్ఎస్, బీజేపీ నేతలకు సీఎం రేవంత్ సవాల్



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రావాలంటూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో రూ.9వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా చెప్పుకొచ్చారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణ మాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు.

**చర్చకు సిద్ధమా..?**

ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు సీఎం. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**రైస్ ఉత్పత్తి, కొనుగోలు..**

ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు

# భారత్‌కు మరో ముప్పు





- భారత్‌ను ఎదుర్కొనేందుకు ఏకమైన పాక్, చైనా, టర్కీ
- సంచలన విషయాలు వెల్లడించిన ఆర్మీ డిప్యూటీ చీఫ్
- భారత్ తక్షణమే వైమానిక సామర్థ్యాన్ని పెంచుకోవాలి
- భారత్ సమస్యలను అధిగమించేందుకు సమాయత్తం కావాలి

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** సరిహద్దులో పాకిస్థాన్, చైనాలతో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఆర్మీ డిప్యూటీ చీఫ్ రాహుల్ ఆర్. సింగ్ కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్, చైనా, టర్కీల మధ్య మిలిటరీ భాగస్వామ్యం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ తక్షణమే వైమానిక సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలి పారు. అత్యాధునిక ఆయుధాల కొరతతో ఆపరేషన్ సింధూర్ సమయంలో కొంత ఇబ్బంది ఎదురైందని భారత్ వెంటనే ఇలాంటి సమస్యలను అధిగమించేం దుకు సమాయత్తం కావాలని సూచించారు. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాకిస్థాన్ హస్తం ఉన్న కారణంగా భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఆ సమయంలో పాకిస్థాన్‌కు చైనా, టర్కీలు ఆయుధాలు సరఫరా చేసి సపోర్ట్‌గా నిలిచాయని భారత ఆర్మీ డిప్యూటీ చీఫ్ రాహుల్ ఆర్. సింగ్ తెలిపారు. బోర్డర్ లో పాకిస్థాన్, చైనా, టర్కీల మైత్రి చూస్తుంటే ఆందోళనకరంగా ఉందని తెలిపారు. భారత్ వెంటనే అత్యాధునిక ఆయుధ సంపత్తిని పెంచుకోవాలని సూచనలు చేశారు. "ఆపరేషన్ సింధూర్ సమయంలో పాకిస్థాన్ కు చైనా లైవ్ లో ఇంటెలిజెన్స్ రిపోర్టు అందించింది. భారత ఆయుధ సంపత్తి విషయాలు మొత్తం పాక్‌కు చైనా చేరవేసింది. పాకిస్థాన్‌లో ఏఏ ప్రాంతాల్లో భారత్ దాడులు

# చతుర్ముఖ పోటీ?

- ఇప్పటికే జూబ్లీహిల్స్ అసెంబ్లీ సీటు ఖాళీ
- గోషామహల్‌కు రాజాసింగ్ రాజీనామా
- రాజీనామా ఆమోదిస్తే ఇక్కడా ఉప ఎన్నిక
- బీజేపీ,బీఆర్ఎస్,కాంగ్రెస్‌తో పాటే టీడీపీ పోటీ
- 3 పార్టీలు కలిసే పోటీ చేస్తాయన్న సీఎం రేవంత్

2



**గెలుపు సాధించాలని ఖర్గే దిశానిర్దేశం**

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** రాష్ట్రంలో రెండు ఉప ఎన్నికల్లో గెలుపు సాధించేందుకు ప్రధాన పార్టీలు వ్యూహాలు రచిస్తున్నాయి. నిన్నటి వరకు ఈ స్థానాల్లో త్రిముఖ పోటీ జరుగుతుందని అందరూ భావించారు. అయితే ఈ సారి టీడీపీ రంగంలోకి దిగబోతోంది. ఇప్పటికే జూబ్లీహిల్స్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. గోషామహల్ అసెంబ్లీ సీటుకు బీజేపీ ఎమ్మెల్యే రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ఇంకా స్పీకర్ ఆమోదించలేదు. ఆతర్వాత ఈసీటు కూడా ఖాళీ అయితే రెండు సీట్లకు ఉప ఎన్నికలు జరుగుతాయి. ఈ సీట్లల్లో గెలుపు సాధించే లక్ష్యంతో అధికార కాంగ్రెస్ ఉంది. సానుభూతి ఓట్లపైనే బీఆర్ఎస్ ఆధారపడి ఉంది. ఈ సీటు గెలిస్తే కాస్త ఊరట కలుగుతుందనే భావనలో ఉంది. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో గెలుపు సాధించి అధికారాన్ని చేపట్టాలన్న బీజేపీ పటిష్టమైన వ్యూహంతో ముందుకు వెళ్లనుంది. ఈ మేరకు అవసరమైతే టీడీపీ,జనసేన పార్టీలను కలుపుకొని వెళ్లబోతోంది. ఇక ఎంఐఎం పార్టీ మద్దతు తమకే ఉందని కాంగ్రెస్ భావిస్తోంది. టీడీపీ మాత్రం స్వతంత్రంగానే పోటీ చేసే యోచనలోఉంది. దాంతో జూబ్లీహిల్స్,గోషామహల్‌లోచతుర్ముఖ పోటీ జరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంలో ముఖ్యమంత్రి రేవంత్ కీలక వ్యాఖ్యలు చేసారు. జూబ్లీహిల్స్ బై పోల్ ఇప్పుడు ప్రధాన పార్టీలకు ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. సిట్టింగ్ సీటు కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టింది. హైదరాబాద్ వచ్చిన ఏఐసీసీ చీఫ్ ఖర్గే సైతం జూబ్లీహిల్స్ బై పోల్ లో గెలిచి తీరాలని నిర్దేశించారు. అటు టీడీపీ ఎన్డీఏ కూటమి నుంచి అభ్యర్థిని బరిలోకి దించుతుందని ప్రచారం సాగుతోంది. ఇదే సమయంలో రేవంత్ మూడు పార్టీలు కలిసి జూబ్లీహిల్స్ లో పోటీకి దిగుతున్నాయని చేసిన కామెంట్స్ సంచలనంగా మారాయి.

ఏఐసీసీ చీఫ్ ఖర్గే జూబ్లీహిల్స్ బై పోల్ పైన ఆరా తీసారు. బై పోల్ లో పోటీ చేయాలని.. గెలవాలని పార్టీ నేతలకు నిర్దేశించారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని పార్టీ నేతలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి ఎన్నికలకు దిగుతాయిని చెప్పు కొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవంతంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. ఇన్‌చార్జ్ మంత్రులు ప్రతి అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని మార్గనిర్దేశం చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని సూచించారు. పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలని కోరారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని అన్నారు.

**మూడు పార్టీలు కలిసి..**

టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం లో రేవంత్

# సైకిలెక్కనున్న ధర్మాన?

- జగన్‌కు మరో సీనియర్ నేత గుడ్ బై..!?
- వైసీపీ ఓటమి తర్వాత పార్టీకి ధర్మానా దూరం
- జనసేనలోకి వెళ్తారని కొద్దిరోజులుగా ప్రచారం
- టీడీపీలోకి వెళ్తారని ధర్మాన అనుచరుల భావన



2

**శ్రీకాకుళం-నవభూమిబ్యూరో:** ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి పార్టీల్లోనూ కొత్త లెక్కలు మొదలయ్యాయి. ఏడాది పాలన పైన టీడీపీ శ్రేణులు ప్రజల మధ్యలోకి వెళుతున్నాయి. జనసేన, బీజేపీ నేతలు ఈ కార్యక్రమా నికి దూరంగా ఉన్నారు. ఇటు జగన్.. కూటమి హామీల విస్మరణ పైన తన పార్టీ నేతలను జనంలోకి పంపారు. కాగా.. జగన్ జిల్లాల పర్యటనలకు సిద్దం అవుతున్న వేళ ఉత్తరాంధ్ర పార్టీ సీనియర్ నేత గుడ్ బై చెప్పేందుకు సిద్ధమవటం సంచలనంగా మారుతోంది. పార్టీకి దూరంగా వైసీపీ 2024 ఎన్నికల్లో ఓడిన తరువాత పలువురు ముఖ్య నేతలు పార్టీ వీడారు. ఆ తరువాత వైసీపీ నుంచి వలసలు ఆగాయి. తాజాగా రాయలసీమకు చెందిన టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాల సుబ్రహ్మణ్యం వైసీపీ కండువా కప్పుకున్నారు. ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం పైన ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని జగన్ చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో సాధించిన విజయాల పైన వివరించేందుకు టీడీపీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లారు. దీనికి కౌంటర్ గా వైసీపీ సైతం హామీలను అమలు చేయలేదంటూ సీఎం చంద్రబాబు లక్ష్యంగా మరో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కాగా, ఇదే సమయంలో ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ నేత పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటం ఇప్పుడు వైసీపీలో భిన్నాభిప్రాయాలకు కారణమవుతోంది. ధర్మాన నిర్ణయం వెనుక మాజీ మంత్రి.. శ్రీకాకుళం సీనియర్ నేత ధర్మాన ప్రసాదరావు నిర్ణయం ఏంటనేది ఇప్పుడు ఆసక్తి

# తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలి



2

- ఏపీలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని జగన్ ఆరోపణ
- గుంటూరు జిల్లా దళిత సర్పంచ్‌పై దాడిని ప్రస్తావించిన జగన్
- వైసీపీ శ్రేణులపై పథకం ప్రకారమే దాడులు.. జగన్ వ్యాఖ్య
- సీఎం చంద్రబాబుకు పదవిలో కొనసాగే అర్హత లేదంటూ విమర్శ

**తాడేపల్లి-నవభూమిబ్యూరో**

ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, తక్షణమే రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాజకీయ నాయకులకు, సాధారణ పౌరులకు రక్షణ కరువైందని, ఈ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని కాపాడలేని

# జాతీయ బీజేపీ పగ్గాలు ఈసారి మహిళకే..

- పోటీలో నిర్మలా సీతారామన్,దగ్గుపాటి పురందేశ్వరి,వాసతి శ్రీనివాసన్
- పార్టీలో అన్ని వర్గాల నుంచి నిర్మలా సీతారామన్‌కు మద్దతు
- దక్షిణాదిన పాగా వేసేందుకు బీజేపీ వ్యూహాత్మక కదలికలు
- మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడం ద్వారా మహిళల ఓట్లపై కన్ను

2

**న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో:** కేంద్రంలో వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవడంతోపాటు దేశంలో సగానికిపైగా రాష్ట్రాల్లో అధికారం చేలాయిస్తున్న బీజేపీ. పార్టీని మరింతగా విస్తరించేందుకు సిద్ధమవుతున్నది. మరోసారి ఢీల్లీ పీఠాన్ని దక్కించుకోవడం, విపక్షాల ఏలుబడిలో ఉన్న ఆ ఐదారు రాష్ట్రాలను తన ఖాతాలో వేసుకోవడానికి కాషాయ దళం ప్రణాళికలు రచిస్తున్నది. గత ఎన్నికల్లో పార్టీ విజయాల్లో కీలకపాత్ర పోషించిన మహిళలను చేజార్చుకోకూడదని కమలం పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఇందులో భాగంగా పార్టీ జాతీయ అధ్యక్ష పీఠంపై మహిళను కూర్చోబెట్టాలని తీవ్రంగా ఆలోచిస్తున్నది. దీనికి ఆర్ఎస్ఎస్ కూడా పచ్చజెండా ఊపినట్లు సమాచారం. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, తమిళనాడు ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్, ఏపీ బీజేపీ మాజీ



# పనిచేసే వారికే పదవులు

- మంత్రివర్గ విస్తరణ, కొత్తగా ఛాన్స్‌పై తేల్చేసిన ఖర్గే
- రెడ్డి సామాజిక వర్గానికి మంత్రివర్గంలో నోఛాన్స్
- అందరి అభిప్రాయాలను సేకరించిన పార్టీ ఛీఫ్ ఖర్గే
- పాలనాపరమైన పదవులు సాధ్యం కాకపోతే పార్టీ పదవులు



2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** ఏఐసీసీ చీఫ్ ఖర్గే తెలంగాణ నేతలకు తమ వైఖరి తేల్చి చెప్పారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి పైన ఆరా తీసారు. ముఖ్య నేతలకు కీలక సూచనలు చేసారు. రాష్ట్రంలో పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాల గురించి వాకబు చేసారు. ఇదే సమయంలో మంత్రివర్గంలో స్థానం కోసం పోటీ పడిన పలువురు నేతలు ఖర్గేను కలిసారు. సామాజిక - ప్రాంతీయ సమీకరణా లను వివరించారు. తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. అందరి అభిప్రాయాలు విన్న ఖర్గే పదవుల విషయంలో పార్టీ వైఖరి ఏంటో తేల్చి చెప్పారు. కీలక

# బ్యాంక్ స్కాంలో అల్లు అరవింద్!

- అల్లు అర్జున్‌కి బిగ్ షాక్..చిక్కుల్లో అల్లు ఫ్యామిలి
- రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ బ్యాంక్ స్కామ్ విషయంలో అల్లు అరవింద్ పేరు తెరపైకి..
- 3 గంటల పాటు అరవింద్‌ను ప్రశ్నించిన ఈసీ




2

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** చిత్రపరిశ్రమలో తమకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అల్లు ఫ్యామిలీ మరోసారి చిక్కుల్లో పడింది. రీసెంట్ గానే సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో అల్లు అర్జున్ జైలుకు వెళ్లొచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ బ్యాంక్ స్కామ్ విషయంలో అల్లు అరవింద్ పేరు తెరపైకి రావడం సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయానికి సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌ను రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ బ్యాంక్ స్కామ్‌కు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ప్రశ్నించారు. సుమారు మూడు గంటల అధికారులు ఆయనను విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. వచ్చే వారం మరోసారి విచారణకు హాజరు కావాలని అల్లు అరవింద్‌ను అధికారులు ఆదేశించినట్లు సమాచారం.



# ఆసుపత్రి నుంచే కేసీఆర్ రాజకీయ సమీక్ష

## నవ వార్త



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రిలో చేరినప్పటికీ రాష్ట్ర రాజకీయాలు, ప్రజా సమస్యలపై దృష్టి సారించారు. సోమాజిగూడలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం తనను పరామర్శించేందుకు వచ్చిన పార్టీ ముఖ్య నేతలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిస్థితులపై ఆయన ఆసుపత్రిలోనే సుదీర్ఘంగా చర్చించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

.ఆయనను పరామర్శించేందుకు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నాయకులు ఆసుపత్రికి తరలివచ్చారు. ఈ సందర్భంగా వారితో ముచ్చటించిన కేసీఆర్, రాష్ట్రంలోని రైతుల ఇబ్బందులు, వ్యవసాయ రంగంలోని సంక్షోభం, సాగునీటి సమస్యలు వంటి అంశాలపై ఆరా తీశారు. ముఖ్యంగా, రైతులకు యూరియా కొరత తీవ్రంగా వేధిస్తోందని, బనకచర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి సరిగ్గా లేదని పలువురు నేతలు కేసీఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలుస్తోంది. నేతలు వెల్లడించిన క్షేత్రస్థాయి వివరాలను కేసీఆర్ ఓపికగా విన్నారు. ప్రస్తుత పరిణామాలపై వారి నుంచి అభిప్రాయాలు, ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు.

## కేంద్రం సంచలన నిర్ణయం.. అలాంటి కంటెంట్ చేస్తే జైలుకే..



'తల్లి పాలు తాగి రొమ్ము గుద్దే' వారు దేశంలో ఎక్కువై పోయారు. ఈ దేశంలో ఉంటూ.. ఈ దేశం తిండి తింటూ.. ఇక్కడ సౌకర్యాలు అనుభవిస్తూ.. పక్క దేశాలకు సపోర్టు చేస్తున్న వారు చాలా మందే ఉన్నారు. సోషల్ మీడియాలో సొంత దేశానికి వ్యతిరేకంగా పోస్టులు సైతం పెడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అలాంటి వారికి బుద్ధి చెప్పడానికి సిద్ధమైంది. కేంద్ర హెూం శాఖ కొత్త పాలసీ తేబోతోంది. ఈ పాలసీ గనుక అమలైతే దేశానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టే వారికి చుక్కలు కనిపించనున్నాయి.

ఈ పాలసీలో భాగంగా దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పెట్టే వీడియో, ఇతర కంటెంట్‌ను గుర్తించనున్నారు. వాటిని బ్లాక్ చేయనున్నారు. ఆ కంటెంట్ పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. దేశానికి వ్యతిరేకంగా కంటెంట్ ఉండే వెబ్ సైట్లపై కూడా చర్యలు ఉండనున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఇంటెలిజెన్స్ ఏజెన్సీలోని అత్యున్నతాధికారులు యాంటీ నేషనల్ పోస్టుల గురించి హెూమ్ మినిస్ట్రీకి చెప్పారట. ఈ నేపథ్యంలోనే కేంద్ర కొత్త పాలసీ తేవాలని చూస్తోందట.

రంగంలోకి స్పెషల్ టీం..దేశానికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే వారిని, వ్యతిరేకంగా పని చేసే వారిని గుర్తించడానికి కేంద్రం ఓ టీమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ టీమ్ దేశ వ్యతిరేక కార్యాకలాపాలపై దృష్టి పెడుతుంది. ఖలిస్తానీ టెర్రరిస్ట్ గురుపత్వంత్ సింగ్ పన్నులాంటి వారి ఖాతాలు కూడా ఇండియాలో బ్యాన్ అవ్వనున్నాయి. ఈ కొత్త పాలసీ కోసం సోషల్ మీడియా కంపెనీలతో పాటు అమెరికా ప్రభుత్వంతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

## అమెరికాలో కుక్క కాటుకు రూ.15 లక్షల పరిహారం

### బాధితుడు తెలంగాణ ప్రాంతానికి చెందిన వాడే



**వాషింగ్టన్ డీసీ-నవభూమి:** అమెరికాలో కుక్క కాటుకు గురైన తెలంగాణ వ్యక్తికి రూ. 15 లక్షల పరిహారం అందింది. పెంపుడు కుక్క అకారణంగా కరిచినందుకు గాను బాధితుడికి 10, 359 డాలర్లు ఇవ్వాలని కోర్టు ఆదేశించడంతో కుక్క యజమాని ఆ మొత్తాన్ని బాధితుడి అకౌంట్ కు పంపించాడు. అయితే ఈ ఘటన జరిగింది 2010లో కావడం గమనార్హం. అయితే మొదట ఆ కుక్క యజమాని పరిహారం, వైద్య ఖర్చులకు డబ్బులు ఇచ్చేందుకు నో చెప్పడంతో కోర్టు జోక్యం చేసుకుంది. అమెరికాలో కుక్క కాటుకు గురైన తెలంగాణ వ్యక్తికి అక్కడి కోర్టు న్యాయం చేసింది. అయితే ఈ ఘటన 2010లో జరిగింది. చాలా సంవత్సరాల పాటు వాదోపవాదాల అనంతరం అక్కడి కోర్టు వైద్య ఖర్చులు, పరిహారం, వడ్డీ కలిపి 10,359 డాలర్లు బాధితుడికి ఇవ్వాలని యజమానిని ఆదేశించింది. ఉమ్మడి నల్గొండ జిల్లా చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెంకు చెందిన వెలమకన్ని కిశోర్‌కు 15 ఏళ్ల సుదీర్ఘకాలం తర్వాత న్యాయం జరిగింది. కిశోర్.. 2010లో ఉద్యోగం కోసం అమెరికా వెళ్లారు. అయితే రోడ్ ఐలాండ్‌లో ఆయన టూ లెట్ కోసం వెతుకుతున్న క్రమంలో కార్లా అనే ఓ మహిళ ఇంట్లోకి వెళ్లగా.. ఆ ఇంట్లోని పెంపుడు కుక్క కిశోర్‌పై దాడి చేసి అతడ్ని కరిచింది. అయితే ఆ సమయంలో వైద్య ఖర్చులకు 600 డాలర్లు ఇస్తానని కార్లా చెప్పింది. కానీ ఆ తర్వాత ఇవ్వకుండా మొండికేసింది. దీంతో కిశోర్ వాషింగ్టన్ డీసీలోని కోర్టును ఆశ్రయించారు. అయితే ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం కిశోర్ కు వైద్య, న్యాయ ఖర్చులు, పరిహారం, వడ్డీ కింద 10,359 డాలర్లు బాధితుడికి ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అయితే అదే సమయంలో కార్లా ఐపీ పెట్టింది. ఇల్లు తనాఖా ఉండటం కారణంగా పరిహారం అందలేదు. అయితే ఇటీవల కార్లా ఇల్లు అమ్మగా కోర్టు ఆదేశాల మేరకు కొనుగోలుదారుడు ఆ పరిహారాన్ని వడ్డీతో కలిపి అందజేశాడు. మొత్తం 18,429 డాలర్లు(రూ.15.73 లక్షలు) ఇటీవల అందినట్లు కిశోర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన కెనడాలో నివాసం ఉంటున్నారు.

## సైకిలెక్కనున్న ధర్మాన?

**(1వపేజీ తరువాయి)**కరంగా మారుతోంది. జిల్లాలో సీనియర్ పొలిటీషియన్ గా ఉన్నారు. కాంగ్రెస్.. ఆ తరువాత వైసీపీ లోనూ పెద్ద దిక్కుగా వ్యవహరించారు. 1989 లో, 2004-2014 వరకు మంత్రిగా పని చేసిన ధర్మానకు 2019లో జగన్ కేబినెట్ లోనూ అవకాశం వచ్చింది. ధర్మాన సోదరుడు క్రిష్ణదాస్ మాత్రం పార్టీలో క్రియాశీలకంగానే ఉన్నారు. ధర్మాన సోదరులు ఇద్దరూ జగన్ మంత్రివర్గంలో పని చేసారు. కాగా.. పార్టీ ఓడిన తరువాత ధర్మాన పూర్తిగా వైసీపీ వ్యవహారాలకు దూరం అయ్యారు. ధర్మాన జనసేనలో చేరుతారని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే, ఆయన ఇప్పటి వరకు అధికారికంగా ఆ ప్రచారం పైన స్పష్టత ఇవ్వలేదు.కుమారుడు కోసం అయితే, ధర్మాన 2024 ఎన్నికలకు ముందే జగన్ ను కలిసి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని.. తన కుమారుడికి అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే, 2024 ఎన్నికల వరకు పోటీ చేయాలని జగన్ సూచన మేరకు బరిలో నిలిచారు. ఎన్నికల్లో ఓడిన తరువాత రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా శ్రీకాకుళంలో నిర్వహించిన వైసీపీ జిల్లా సమావేశానికి ధర్మాన ప్రసాదరావు డుమ్మా కొట్టారు. ఏడాదిగా పార్టీ కార్యక్రమాలకు హాజరుకావడం లేదు. గురువారం కూడా శ్రీకాకుళంలోనే అందుబాటులో ఉన్నప్పటికీ జిల్లాస్థాయి సమావేశానికి ముఖం చాటేశారని చెబుతున్నారు. అయితే.. తన కుమారుడికి రాజకీయ భవిష్యత్ కోసం తాను తప్పుకోవాలని ధర్మాన భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా ధర్మాన వైసీపీకి దూరం అవుతున్నారా.. లేక, పూర్తిగా రాజకీయాలకే గుడ్ బై చెబుతారా అనేది స్పష్టత రావాల్సి ఉంది. వచ్చే ఎన్నికల్లో ధర్మాన కుమారుడు పోటీ చేస్తారని చెబుతున్నా, ఏ పార్టీ అనేది సస్పెన్స్ గా మారుతోంది.

# పనిచేసే వారికే పదవులు

**(1వపేజీ తరువాయి)** మంత్రాంగం ఏఐసీసీ చీఫ్ ఖర్గే హైదరాబాద్‌కు చేరుకున్నారు. పార్టీ కార్య క్రమాల్లో పాల్గొంటున్నారు. పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు ఖర్గేను కలిసారు. మంత్రి పదవులు ఆశిస్తున్న పలువురు నేతలు ఖర్గే ను కలిసి తమకు అవకాశం ఇవ్వాలని కోరారు. తమకు ఉన్న అర్హతలను వివరించడంతోపాటు పార్టీకి చేసిన సేవలను గుర్తుచేశారు. ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగా రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలూ నాయక్.. ఖర్గేతో ముఖాముఖి భేటీ అయ్యారు. అందరి అభిప్రాయాల ను ఖర్గే సావధానంగా విన్నారు. పార్టీ కోసం తాను ఎంతో శ్రమ చేయాల్సి వచ్చిందని.. పార్టీ కోసం దగ్గరి బంధువులతోనూ శత్రుత్వం పెంచుకోవాల్సి వచ్చిందని ఖర్గే దృష్టికి తెచ్చారు. రేవంత్‌రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు.. ఇంద్రవెల్లి సభ సందర్భంగా తనకు హామీ కూడా ఇచ్చారని చెప్పినట్లు సమాచారం. చోటు కల్పించండి తనకు కాకుండా ఎన్నికల ముందు పార్టీలోకి వచ్చిన వారికి మంత్రివర్గంలో చోటు కల్పించారంటూ అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఉంటే.. రెండు జిల్లాలకు కలిపి ఒక్క మంత్రి పదవి కూడా లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రజల్లోకి తప్పుడు సంకేతాలను పంపుతుందని ఖర్గే దృష్టికి తెచ్చారు. అర్బన్ ప్రాంతాల్లో బీజేపీ బలం పుంజుకుంటోందని వివరించారు. పార్టీలో సీనియర్‌గా తనకు అవకాశం కల్పించాలని సుదర్శన్‌రెడ్డి కోరారు. మంత్రివర్గంలో బంజారాలకు అన్యాయం జరిగిందంటూ ఖర్గేకు బాలూ నాయక్ ఫిర్యాదు చేశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి.. తాను మంత్రి పదవికి ఏ విధంగా అర్హుడినో వివరిస్తూ ఖర్గేకు నివేదికను అందించారు. ఖర్గే ఆరా అందరి అభిప్రాయలు విన్న తరువాత ఖర్గే ప్రస్తుత కేబినెట్ లో సామాజిక కూర్పు గురించి ముఖ్య నేతలతో ఆరా తీసారు. ఏ నేతకు ప్రత్యేకంగా ఎలాంటి హామీ ఇవ్వని ఖర్గే.. బీఆర్ఎస్, బీజేపీ అమలు చేస్తున్న సామాజిక సమీకరణాల గురించి తెలుసుకున్నట్లు సమాచారం. ఎక్కువగా రెడ్డి సామాజిక వర్గ నేతలు మంత్రి పదవి కోసం ఖర్గేను కలిసారు. కేబినెట్ లో ఆ వర్గానికి ఇప్పుడున్న పదవుల సంఖ్య గురించి ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇక, ఆ వర్గానికి అవకాశం ఇవ్వటం సాధ్యపడదనే అభిప్రాయం వ్యక్తం అయినట్లు పార్టీ నేతల సమాచారం. మంత్రివర్గంలో మరో మూడు ఖాళీలు మాత్రమే ఉన్నాయి. కాగా, మంత్రి

# జాతీయ బీజేపీ పగ్గాలు ఈసారి మహిళకే..

**(1వపేజీ తరువాయి)**అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్లను పార్టీ అగ్రనాయకత్వం పరిశీలిస్తున్నది. ఈ ముగ్గురిలో ఎవరినో ఒకరిని అధ్యక్ష పదవి వరించనుంది. ఒకవేళ అదే జరిగితే కషాయ దళానికి తొలిసారిగా ఓ మహిళ సారథి కానున్నది. అయితే ఈ రేసులో ప్రధాని మోదీ కేబినెట్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్న కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ముందంజలో ఉన్నట్లు తెలుస్తున్నది.

**నిర్మలా సీతారామన్..**

పార్టీ అధ్యక్ష రేసులో నిర్మలా సీతారామ న్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. ఇటీవలే జేపీ నడ్డా, పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎస్ సంతోశ్‌లు నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో సీతారామన్ పేరునే చర్చించినట్లు తెలుస్తున్నది. కేంద్ర ఆర్థిక మంత్రిగా, రక్షణమంత్రిగా తానేంటో నిరూపించుకున్న ఆమెకు పార్టీలో సుదీర్ఘమైన అనుభవం ఉంది. అలాగే నాయకత్వ సామర్థ్యం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఆమె నియామకంతో దక్షిణాదిలో పాగా వేయాలన్న లక్ష్యం కూడా నెరవేరే అవకాశం ఉందని భావిస్తున్నారు. త్వరలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కలిసొచ్చే అవకాశం ఉంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని భావిస్తున్న మోదీ సర్కార్.. త్వరలోనే ఈ బిల్లును కూడా ఆమోదించాలని ఆలోచిస్తున్నది. ఈ నేపథ్యంలో నిర్మలమ్మ అయితేనే సరైనవారని పార్టీ అగ్రనాయకత్వం ఆలోచనగా ఉన్నది. ఆమెకు ఆర్ఎస్ఎస్ కూడా సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నట్లు తెలుస్తున్నది.

వనతి శ్రీనివాసన్..తమిళనాడుకు చెందిన వానతి శ్రీనివాసన్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తున్నది. న్యాయవాది వృత్తి నుంచి రాజకీయ నాయకురాలిగా ఎదిగిన ఆమె ప్రస్తుతం కోయంబత్తూర్ సౌత్ ఎమ్మెల్యేగా ఉన్నారు. 1993లో బీజేపీలో చేరిన ఆమె అంచలంచలుగా ఎదుగుతూ.. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా, ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. 2020లో ప్రమోషన్ పొందిన ఆమె.. బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అనంతరం 2022లో బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా నియమితురాలై.. తమిళనాడు నుంచి ఈ పదవి పొందిన మొదటి మహిళగా నిలిచారు.

పురందేశ్వరి..బహుభాషా కోవిధురాలైన రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ మాజీ ప్రెసిడెంట్ పురందేశ్వరి (%ాబతీుఅఎవంఘుతీఱ%) కూడా పార్టీ జాతీయ అధ్యక్ష రేసులో నిలిచారు. కేంద్రమంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న ఆమె నాయకత్వంలోనే ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ పుంజుకున్నది. ఆపరేషన్ సిందూర్‌పై వివిధ దేశాల్లో పర్యటించిన ప్రజాప్రతినిధుల బృందంలో పురందేశ్వరి కూడా ఉన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్ష పదవి చేపట్టాలంటే ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఉండాల్సిందే. అధ్యక్ష ఎంపికలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర ప్రధానమైనది. ఇటీవల పలు రాష్ట్రాల్లో నియమితులైన పార్టీ అధ్యక్షుల్లో ఆర్ఎస్ఎస్ ముద్ర స్పష్టంగా కనిపిస్తున్న విషయం తెలిసిందే. పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న వారికే పదవుల్లో ప్రియార్టీ ఇస్తున్నది. ఈ నేపథ్యంలో పురందేశ్వరికి ఈ విషయం ప్రతిబంధకంగా మారే అవకాశం ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన ఆమె.. కొన్నేండ్ల క్రితమే బీజేపీలో చేరిన విషయం తెలిసిందే.

# జర్నలిస్టులకు గుడ్ న్యూస్ చెప్పిన చంద్రబాబు

**అమరావతి-నవభూమి:** సీఎం అయిన ఈ కాలంలో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న హామీ పెద్దగా అమలుకు నోచుకోలేదు అని విమర్శలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీలోని జర్నలిస్టులకు గుడ్ న్యూస్ చెప్పారు. వారి దీర్ఘకాల డిమాండ్‌కి ఆయన ఓకే చెప్పారు. దాంతో పాత్రికేయ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది. ఇంతకీ బాబు చెప్పిన ఆ శుభవార్త ఏమిటి అంటే పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలను ఇస్తామని. దాని కోసం ఆయన అమరావతిలో శుక్రవారం జరిగిన రెవిన్యూ శాఖ సమీక్షా సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని అధికారులకు చంద్రబాబు ఆదేశం ఇచ్చారు. ఇందుకోసం ముగ్గురు మంత్రులతో మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు కూడా చేశారు. ఈ మంత్రివర్గ ఉప సంఘంలో రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, సమాచార శాఖ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, పురపాలక శాఖ మంత్రి పి నారాయణ సభ్యులుగా ఉంటారు. సాధ్యమైనంత త్వరలోనే ఉపసంఘం భేటీ అయి జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాల కోసం ఏ విధంగా చేయాలి అన్నది పరిశీలించి విధి విధానాలను ఖరారు చేస్తుందని చెబుతున్నారు. చంద్రబాబు ఉమ్మడి ఏపీలో రెండు సార్లు విభజన ఏపీలో రెండు సార్లు సీఎం అయ్యారు. ఆయన సీఎం అయిన ఈ కాలంలో జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తామన్న హామీ పెద్దగా అమలుకు నోచుకోలేదు అని విమర్శలు ఉన్నాయి. 2004లో ఉమ్మడి ఏపీలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ మాత్రం జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఇక 2014లో అధికారంలోకి వచ్చిన బాబు తాను కూడా ఇళ్ల స్థలాలను ఇస్తామని చెప్పారు. అయితే దాని కోసం దరఖాస్తులను ఆహ్వానించారు. ఒక విధంగా తీవ్ర స్థాయిలో కసరత్తు జరిగింది. పాత్రికేయులకు ప్రత్యేకంగా గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇళ్ళు కట్టించి ఇవ్వాలని వారికి రుణాలు కూడా ఇచ్చి సొంతింటి వారిగా చూడాలని ఆనాటి టీడీపీ ప్రభుత్వం ఆలోచించింది. కానీ అది మాత్రం నెరవేరలేదు.ఇపుడు మళ్ళీ బాబు అధికారంలోకి వచ్చారు. దాంతో ఆనాటి ప్రయత్నాలను ప్రతిపాదనలను పలుమార్లు జర్నలిస్టు సంఘాలు బాబు దృష్టిలో పెట్టాయి. మొత్తానికి చంద్రబాబు జర్నలిస్టులకు గుడ్ న్యూస్ వినిపించారు. ఇక తొందరలోనే సమావేశం అయ్యే మంత్రి వర్గ ఉప సంఘం జర్నలిస్టులకు అనుకూలంగా సమంజసమైన ప్రతిపాదనలు విధి విధానాలను రూపొందించాలని సంఘాల నేతలు కోరుతున్నారు. అంతే కాదు సాధ్యమైనంత తొందరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు వినతి చేస్తున్నారు. మొత్తానికి పాత్రికేయ లోకానికి బాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని సంఘాల నేతలు భావిస్తున్నారు.

## చతుర్ముఖ పోటీ?

**(1వపేజీ తరువాయి)**జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక గురించి ప్రస్తావన చేసారు. రేవంత్ చెప్పిన మూడు పార్టీల గురించి పార్టీలో చర్చ జరుగుతోంది. అటు బీజేపీ ఈ ఎన్నికల్లో పోటీకి సమాయత్తం అవుతోంది. కాగా.. ఏపీలో కొనసాగుతున్న ఎన్డీఏ కూటమి ఇక్కడ ఈ బై పోల్ ద్వారా కొత్త ప్రయోగం చేసేందుకు సిద్దం అవుతున్నారని ప్రచారం సాగుతోంది. ఈ సమయంలో రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇక, పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీపీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని రేవంత్ ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు.

# బంగారం స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావుకు ఈడీ షాక్

- **నటి రన్యారావుకు చెందిన రూ.34 కోట్ల ఆస్తులను అటాచ్ చేసిన ఈడీ!**
- **బెంగళూరు, తుమకూరు, అనేకల్‌లోని నివాస, వ్యవసాయ భూములు అటాచ్**

**బెంగుళూరు-నవభూమిబ్యూరో**

బంగారం స్మగ్లింగ్‌తో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో కన్నడ నటి రన్యా రావుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. ఆమెకు చెందిన రూ. 34.12 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈడీ ఈ చర్యలు చేపట్టింది. జప్తు చేసిన ఆస్తులలో బెంగళూరులోని విక్టోరియా లేఅవుట్‌లో ఉన్న ఒక నివాస గృహం, అర్కావతి లేఅవుట్‌లోని నివాస స్థలం, తుమకూరులోని పారిశ్రామిక భూమి, అనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమి ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ సుమారు రూ. 34.12 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. గతంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), సీబీఐ నమోదు చేసిన బంగారం స్మగ్లింగ్ కేసుల ఆధారంగా ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో భాగంగానే నటి రన్యా రావుపై దృష్టి సారించింది. ఆమె అసలు పేరు హర్షవర్ధిని రన్యా అయిన ఈ నటిని మార్చి 3న దుబాయ్ నుంచి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాగానే అధికారులు అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారంతో జరిపిన తనిఖీలలో ఆమె వద్ద నుంచి రూ. 12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు.అక్రమ నగదు లావాదేవీలలో రన్యా రావు ప్రమే యాన్ని నిర్ధారించేందుకు ఆమె డిజిటల్ ఆధారా లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆమె ఫోన్‌లోని ఇన్ వాయిస్‌లు, ఎగుమతి పత్రాలు, విదేశీ లావాదేవీల రికార్డులు, రికార్డ్ చేసిన చాట్‌లను విశ్లేషించారు. ఈ బంగారం స్మగ్లింగ్ సిండికేట్‌లో ఆమె క్రియాశీలక పాత్ర పోషించినట్లు ఈ ఆధారాల ద్వారా రుజువైందని అధికారులు వివరించారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

## భారత్‌కు మరో ముప్పు

**(1వపేజీ తరువాయి)**చేపట్టనుంది అనే కీలక విషయాలు చైనా ఇంటెలిజెన్స్ పాక్ కు ఇచ్చింది. ఈ విషయాన్ని పాకిస్థాన్ స్వయంగా ఒప్పుకుంది. ఈ ఉదాహరణ చాలు. ఉద్రిక్త పరిస్థితుల్లో చైనా-పాకిస్థాన్ ఎలా కలిసిపోతున్నాయో. ఇది వ్యూహాత్మకంగా భారత్ కు పెను సవాల్ లాంటిది" అని భారత ఆర్మీ డిప్యూటీ చీఫ్ రాహుల్ ఆర్. సింగ్ పేర్కొన్నారు.

## బ్యాంక్ స్కాంలో అల్లు అరవింద్!

**(1వపేజీ తరువాయి)**బ్యాంక్ స్కామ్ వివరాలు.. రామకృష్ణ ఎలక్ట్రానిక్స్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి రూ. 101.48 కోట్ల రుణాన్ని తీసుకుని తిరిగి చెల్లించకపోవడంతో ఈ స్కాం వెలుగులోకి వచ్చింది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ, సీబీఐ నమోదు చేసిన కేసు ఆధారంగా ఈసీఐఆర్ ఫైల్ చేసి విచారణ ప్రారంభించింది. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లలో సోదాలు నిర్వహించిన ఈడీ దాదాపు రూ. కోటి 45 లక్షల మేర నగదు సీజ్ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా బ్యాంక్ అధికారులు పెద్ద మొత్తంలో రుణాలు మంజూరు చేశారని, ఆర్‌బీఐ గైడ్‌లైన్స్‌ను ఉల్లంఘించి నిధులు మళ్లించినట్లు ఆరోపణలు ఉన్నాయని సమాచారం. కాగా ఈ కేసుకు సంబంధించి అల్లు అరవింద్ పేరు ఆ సంస్థ లావాదేవీల్లో ప్రస్తావించబడటంతో ఈడీ విచారణకు పిలిపించింది. వాస్తవంగా ఆయనకు ఆ సంస్థతో ప్రత్యక్ష సంబంధం ఉందా? లేదా? అనే అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. దీనిపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

## తేల్చుకుందాం!

**(1వపేజీ తరువాయి)**చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ.9వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చామని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరుగుతున్న సామాజిక న్యాయ విజయ భేరి సభలో సీఎం ఈ మేరకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు, 15 ఎంపీలు గెలుస్తాం: సీఎం రేవంత్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా పాలనలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టామని.. ఆత్మగౌరవంతో బ్రతికేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ వేదికగా మహిళలకు పిలుపునిస్తున్ననని.. స్వయం సహాయక సంఘాలలో చేరి.. ఆర్థికంగా నిలబడండని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మొదటి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని తెలిపారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన సామాజిక న్యాయ సమరభేరి సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. "తెలంగాణలో మాకు తిరుగులేదని అహంకారంతో విర్రవీగుతున్న కల్వకుంట్ల గడీలను బద్దలు కొట్టి మూడు రంగుల జెండా ఎగరేశాం. ఇక్కడే ప్రజా పాలనకు నాంది పలికాం. ఈ ప్రభుత్వం మూన్నాళ్ల ముచ్చట అని, సంక్షేమపథకాలు అమలు చేయరని, కలిసి ఉండరని చాలా మంది ప్రచారం చేశారు. కానీ నవ్విన వాళ్ల ముందు తలెత్తుకుని నిలబడి.. సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెట్టాం. తెలంగాణ మోడల్ ను దేశం అనుసరించేలా తీర్చిదిద్దాం. కులగణనను పూర్తి చేసి బీసీల లెక్క తేల్చాం. దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకు వెళుతున్నాం. 18 నెలల్లో రైతు భరోసా, సన్న వడ్లకు బోనస్, పేదలకు సన్న బియ్యం, రైతు రుణమాఫీ చేసి రైతుల రుణ విముక్తులని చేశాం. వరి వేస్తే ఉరే అని ఆనాటి ప్రభుత్వం చెప్పింది. కానీ వరి వేయండి సన్న వడ్లకు బోనస్ ఇస్తామని మేం చెప్పాం.దేశంలోనే అత్యధిక వరి పండించి తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలబెట్టాం. ఒంటె పెదవుల కోసం నక్క ఎదురు చూసినట్లు రైతు భరోసా వేయొద్దని గోతికాడి నక్కలా ఎదురు చూసారు.కానీ 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించిన ఘనత ప్రజా ప్రభుత్వానిది" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు."ఈ వేదికగా సవాల్ విసురుతున్నా. మోదీ వస్తాడో, కిషన్ రెడ్డి వస్తాడో, కెసీఆర్ వస్తాడో రండి. రైతులకు మేలు చేసింది ఎవరో అసెంబ్లీలో చర్చిద్దాం రండి. పేదలకు రూ. 5 భోజనం పెట్టే కార్యక్రమానికి ఇందిరమ్మ పేరు పెడితే. కొందరు సన్నాసులు విమర్శలు చేస్తున్నారు. పేదల సంక్షేమం అంటేనే ఇందిరమ్మ.. ఇందిరమ్మ అంటేనే పేదల సంక్షేమం. ఆడబిడ్డలకు ఆర్టీసీలో బస్సులు అద్దెకు అందించి లాభాలు గడించేలా ప్రోత్సహిస్తాం. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ లను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టాం. ఆత్మగౌరవంతో బ్రతికేలా చర్యలు తీసుకున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా పాలనలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఈ వేదికగా మహిళలకు పిలుపునిస్తున్నా.. స్వయం సహాయక సంఘాలలో చేరండి. ఆర్థికంగా నిలబడండి" అని సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పిలుపునిచ్చారు.

## మధుర కృష్ణ జన్మభూమి -షాహీ మసీదు వివాదంలో బిగ్ టర్న్..!

**అలహాబాద్-నవభూమి:** ఉత్తర్ ప్రదేశ్ లోని మధురలో ఉన్న శ్రీకృష్ణ జన్మభూమి, దాన్ని ఆనుకుని ఉన్న షాహీ ఈద్గా మసీదు యాజమాన్య హక్కుల విషయంలో జరుగుతున్న పోరులో ఇవాళ మరో ట్విస్ట్ చోటు చేసుకుంది. ఇప్పటికే షాహీ మసీదును శ్రీకృష్ణ జన్మభూమిని ఆక్రమించి నిర్మించారంటూ హిందూ వర్గాలు కోర్టును ఆశ్రయించడం, ఆ తర్వాత సుప్రీంకోర్టు 1991 నాటి ప్రార్ధనా స్థలాల చట్టాన్ని అతిక్రమించి ఎలాంటి నిర్ణయాలు ప్రకటించవద్దని కోర్టుల్ని ఆదేశించడం జరిగాయి. ఈ నేపథ్యంలో మధురలోని శ్రీకృష్ణ జన్మభూమి పక్కనే షాహీ ఈద్గా మసీదు ఉన్న సముదాయాన్ని వివాదాస్పద కట్టడంగా ప్రకటించాలని కోరుతూ అలహాబాద్ హైకోర్టులో హిందూ వర్గం పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు.. పిటిషనర్ల విజ్ఞప్తిని తోసిపుచ్చింది.

# కెమెడియన్ పిష్ వెంకటేశ్‌ను ఆదుకున్న రెబల్‌స్టార్ ప్రభాస్

**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** సీనియర్ నటుడు, కమెడియన్ ఫిష్ వెంకట్ గురించి మనందరికీ తెలిసిందే. ఆయన ఏ సినిమాలో ఉన్నా తనదైన శైలిలో డైలాగులు చెప్తూ నవ్వులు పూయిస్తారు. అయితే గత కొంత కాలంగా ఆయన తీవ్ర అనారోగ్యానికి గురవుతూ వస్తున్నారు. గత కొద్దిరోజులుగా ఆయన కిడ్నీలు పాడై వెంటిలేటర్ పైనే చికిత్స పొందుతున్నారు. అయితే తాజాగా ఫిష్ వెంకట్ ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆదుకున్నారు. అటు ఇండస్ట్రీ అయినా ఇటు ఫ్యాన్స్ అయినా కష్టం వచ్చిందంటే ముందుంటే నటుల్లో ప్రభాస్ ఒకరు. తాజాగా మరోసారి ఆయన తన గొప్ప మనసును చాటుకున్నారు. గత కొద్దిరోజులుగా ఆయన కిడ్నీలు పాడై వెంటిలేటర్ పైనే చికిత్స పొందుతున్న టాలీవుడ్ సీనియర్ నటుడు ఫిష్ వెంకట్ కు అండగా నిలిచారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఫిష్ వెంకట్ కు ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చారు. కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ కు డోనర్ ఉంటే సిద్ధం చేసుకోమని.. ఆపరేషన్ కి అవసరమైన ఖర్చంతా ప్రభాస్ అందిస్తారని ఆయన టీమ్ ఫిష్ వెంకట్ ఫ్యామిలీకి వివరించారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్
శనివారం
05 । జులై । 2025

# మోదీ రాసిన కవితను వినిపించిన ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని





**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన కొనసాగుతోంది. ఐదు దేశాల పర్యటనలో భాగంగా ప్రస్తుతం ట్రినిడాడ్ అండ్ టొబాగో లో పర్యటిస్తున్నారు. టొబాగో చేరుకున్న మోదీకి ఆ దేశ ప్రధాని ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గుజరాతీలో రాసిన కవితను ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాని కమ్లా ప్రసాద్ బిసెస్సార్ ) చదవి వినిపించారు.గుజరాతీ భాషలో 'ఆంఖ్ ఆ ధన్య ఛే' పేరిట మోదీ రాసిన పుస్తకం లోని కవితను వినిపించిం అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. 'గడిచిపోయిన రోజుల్లోకి మనసుతో ప్రయాణించినప్పుడు ఎన్నో జ్ఞాపకాలు కళ్లముందు కదలాడతాయి. కష్టకాలంలో మనతో నడిచిన వారిని ఎప్పటికీ మర్చిపోలేం. ఆ జ్ఞాపకాలే మన ప్రయాణంలో భాగమవుతాయి' అని అర్థం వచ్చే కవితను అందరి సమక్షంలో చదవి వినిపించారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.కరేబియన్ దేశమైన ట్రినిడాడ్ అండ్ టొబాగో జనాభాలో దాదాపు 40 శాతం మంది భారత సంతతికి చెందినవారే. భారత విదేశాంగ శాఖ లెక్కల ప్రకారం, ఈ దేశంలో సుమారు 5.56 లక్షల మంది భారతీయ మూలాలున్న ప్రజలు నివసిస్తున్నారు. ఇక ఆ దేశ ప్రధాని కమ్లా కూడా భారత మూలాలున్న వ్యక్తే కావడం విశేషం. ఈ సందర్భంగా కమ్లాను బీహార్ ముద్దుబిడ్డగా ప్రధాని పేర్కొన్నారు. ఆమె పూర్వీకులు బీహార్ బక్సర్‌కు చెందిన వారని తెలిపారు. అందుకే కమ్లాను బీహార్ ఆడబిడ్డగా భావిస్తారన్నారు.

## కాలేజీ అమ్మాయి గొంతు కోసి..
### బ్లాంకెట్‌లో బాడీని చుట్టి.. దాబాలో పడేసిన బాయ్‌ఫ్రెండ్



**వారణాసి-నవభూమి:** ఉత్తర ప్రదేశ్‌లోని వారణాసిలో ఓ కాలేజీ విద్యార్థిని మర్డర్‌కు గురైంది. ఆమె భాయ్‌ఫ్రెండ్ ఆ హత్య చేశాడు. పదేపదే డబ్బులు ఇవ్వాలని వత్తిడి చేయడం వల్లే ఆమెను చంపినట్లు నిందితుడు తెలిపాడు. బాధిత అమ్మాయిని అల్కా బింద్‌గా గుర్తించారు. ఆమె గొంతు కోసి ఉంది. ఆమె శరీరాన్ని ఓ బ్లాంకెట్‌లో చుట్టు ఓ రూమ్‌లో వేశాడు. మిర్జామురాద్ ఏరియాలోని రూపాపుర్‌లో ఉన్న విధాన్ బసేరా దాబాలో ఆమె బాడీని గుర్తించారు. 22 ఏళ్ల అల్కా బింద్ ఎంస్సీ చదువుతున్నది. బుధవారం కాలేజీకి వెళ్లిన ఆమె మిస్సింగ్ అయినట్లు పోలీసులకు సమాచారం రావడంతో కేసు బయటపడింది. నిందితుడు సాహబ్ బింద్‌ను తన సోదరి ఇంట్లో ఉండగా అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి పిస్తోల్ స్వాధీనం చేసుకున్నారు. మీర్జాపూర్‌కు చెందిన అతని కాలులో షూట్ చేశారు. ప్రస్తుతం సాహబ్‌కు చికిత్స అందిస్తున్నట్లు వారణాసి డీసీపీ ఆకాశ్ పటేల్ తెలిపారు.పోలీసులు కథనం ప్రకారం.. అల్కా బింద్.. ఉదయం 9.30 నిమిషాలకు ఇంటి నుంచి కాలేజీకి వెళ్లింది. కానీ ఆమె సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేశాడు. ఆ రోజు రాత్రి దాబాలోని ఓ రూమ్‌లో ఆమె శరీరాన్ని గుర్తించారు. ఆమె కాల్ రికార్డింగ్‌లు, సీసీటీవీ కెమెరా ఆధారంగా బాయ్‌ఫ్రెండ్ సాహబ్ బింద్‌ను పట్టుకున్నారు. పెళ్లి చేసుకోవాలని, డబ్బులు కావాలని అల్కా పదేపదే వత్తిడి చేసిందని, దాంతో విసిగిపోయి హత్య చేసినట్లు సాహెబ్ పోలీసు విచారణలో తెలిపాడు. దాబా వద్దకు రమ్మని ఫోన్ చేసిన అతను .. అల్కా రాగానే గొంతు కోసి చంపి, ఆమె మొబైల్ ఫోన్, అడ్మిట్ కార్డుతో పరారీ అయ్యాడు.దాబా ఉద్యోగి క్లీనింగ్ కోసం రూమ్‌లోకి వెళ్లడంతో అల్కా మృతదేహం కనిపించింది. పోస్టు మార్టమ్ కోసం ఆమె మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబం గురువారం ధర్నా చేసింది.

## భారీ వర్షాలకు అతలాకుతలమైన హిమాచల్.. రూ.400 కోట్ల మేర నష్టం



**సిమ్లా-నవభూమి:** హిల్‌స్టేట్ హిమాచల్ ప్రదేశ్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆకస్మిక వరదలు సంభవించాయి. అనేకచోట్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. వంతెనలు కొట్టుకుపోయాయి. విద్యుత్, నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇక ఈ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో ముందు జాగ్రత్తగా రహదారులను అధికారులు మూసివేశారు వారం రోజులుగా కురుస్తున్న ఈ వర్షాలకు భారీగా ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది.ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి 63 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 40 మంది గల్లంతయ్యారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నా యి. రాష్ట్రవ్యాప్తంగా 100 మందికిపైగా గాయపడ్డారు. వందలాది ఇళ్ళు ధ్వంసమయ్యాయి. 14 వంతెనలు కొట్టుకుపోయాయి. సుమారు 500కిపైగా రోడ్లను అధికారులు మూసివేశారు. వర్షాల కారణంగా దాదాపు 500కిపైగా విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయడం లేదు. దీంతో పదివేల మంది ప్రజలు అంధకారంలోనే మగ్గుతున్నారు. నీటి సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాలకు రూ.400 కోట్లకుపైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు ప్రభుత్వం అంచనా వేసింది. అయితే, అంతకంటే ఎక్కువే నష్టం ఉంటుందని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ, రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి డీసీ రాణా తెలిపారు.

## పార్టీలో పాట పాడి.. ఎంజాయ్ చేసిన లలిత్ మోదీ, విజయ్ మాల్యా..



**న్యూఢిల్లీ-నవభూమి:** బిలియనీర్లు లలిత్ మోదీ విజయ్ మాల్యాలు.. ఫుల్ ఎంజాయ్ చేశారు. ఆ ఇద్దరు కలిసి పార్టీలో పాట పాడారు. లండన్‌లో చాలా విలాసవంతంగా ఆ వేడుకను నిర్వహించారు. లలిత్ మోదీ తమ పార్టీకి చెందిన వీడియోను ఇన్‌స్టాలో పోస్టు చేశారు. వార్షిక సమ్మర్ పార్టీని ఆర్గనైజ్ చేసినట్ల మోదీ చెప్పారు. సుమారు 310 మంది ఫ్రెండ్స్, అతిథులు ఆ వేడుకకు హాజరయ్యారు. బ్రిటన్ రాజధానిలో ఉన్న మోదీ నివాసంలోనే ఆ పార్టీ జరిగింది. మాజీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ కమీషనర్ లలిత్ మోదీ, లిక్కర్ టైకూన్ విజయ్ మాల్యా ఆ పార్టీలో స్టెప్పులేశారు. దేశవిదేశాల నుంచి అతిథులు .. ఆ పార్టీ కోసం లలిత్ మోదీ నివాసానికి చేరుకున్నారు.ఆర్సీబీ మాజీ ప్లేయర్ క్రిస్ గేల్ కూడా ఆ పార్టీకి వెళ్లాడు. లలిత్ మోదీ, మాల్యాతో దిగిన ఫోటోను గేల్ తన ఇన్‌స్టా స్టోరీలో పోస్టు చేశాడు. ఐపీఎల్ వ్యవస్థాపక ఛైర్మెన్‌గా ఉన్న లలిత్ మోదీ.. ఆ తర్వాత ఈడీ కేసులు నమోదు కావడం దేశం విడిచి వెళ్లారు. ఫెమా, మనీల్యాండరింగ్ కేసుల్లో అతను విచారణ ఎదుర్కొంటున్నారు. అతన్ని అప్పగించాలని భారత్ అనేక సందర్భాల్లో బ్రిటన్‌ను కోరింది. కానీ అతను బ్రిటీష్ రెసిడెంట్‌గానే కొనసాగుతున్నారు.రాజకీయ దురుద్దేశంతో తనపై కేసులు నమోదు చేశారని లలిత్ మోదీ ఆరోపిస్తున్నారు. యునైటెడ్ బివరీస్ వ్యవస్థాపక ఛైర్మెన్ విజయ్ మాల్యా 2016లో దేశాన్ని విడిచి వెళ్లారు. భారత ప్రభుత్వం అతన్ని ఆర్థిక నేరస్థుడిగా ప్రకటించింది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ దివాళా కేసులో భారత ప్రభుత్వం సుమారు 14వేల కోట్ల ఆస్తులను సీజ్ చేసిందని నిరుడు ఓ పోస్టులో విజయ్ మాల్యా పేర్కొన్నారు. తాను ఇంకా ఆర్థిక నేరస్థుడిగా ఉన్నానని, చేసిన అప్పు కన్నా రెండింతలు ఎక్కువ తన వద్ద తీసుకున్నారని తన పోస్టులో రాశారు.

## ప్రతిపక్ష నేత ఎద్దేవా.. మరో మూడేళ్లు సీఎంగా సిద్ధరామయ్య.. అదే ఆరో గ్యారెంటీ


**బెంగళూరు-నవభూమి:** ఇదే ఏడాది అక్టోబరు లేదా నవంబరులో ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని కానీ మరో మూడేళ్లు సిద్ధరామయ్య సీఎంగా కొనసాగుతారంటే ఇది గ్యారెంటీగా ప్రతిపక్షనేత అశోక్ ఎద్దేవా చేశారు. గురువారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతలకు భయం వేస్తోందన్నారు. ప్రస్తుతం ఆపార్టీ రాష్ట్ర పరిస్థితి ఇల్లు ఒక్కటే కానీ తలుపులు మూడు అనేలా మారిందన్నారు.అందరూ సీఎం కావాలని భావిస్తున్నారని అదే సమస్యగా మారిందన్నారు. సిద్ధరామయ్య మరో మూడేళ్లు కొనసాగుతారని అధిష్ఠానం చెప్పాలి కానీ ఎందుకో ఇటీవల పదేపదే సిద్ధరామయ్య అదే విషయాన్ని ప్రస్తావిస్తున్నారన్నారు. ఇక డీసీఎం డీకే శివకుమార్ కూడా నేను సీఎం సిద్ధరామయ్యకు అండగా ఉంటానని బహిరంగంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష బీభత్సం.. 69 మంది మృతి



**సిమ్లా-నవభూమి:** హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాల బీభత్సం కొనసాగుతోంది. జూన్ 20వ తేదీ నుంచి జులై 3వ తేదీ వరకు కేవలం పదిహేను రోజుల్లోనే కురిసిన భారీ వర్షాలు, మేఘాల విస్ఫోటనం, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తుల కారణంగా 69 మంది ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో ప్రజలు గల్లంతవగా.. అనేక మంది గాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 250 రహదారులు మూసుకుపోగా, రూ.400 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.700 తాగునీటి సరఫరా పథకాలు..! ముఖ్యంగా మండి జిల్లాలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ధాటికి ఇళ్లు మొత్తం నేలమట్టం అయ్యాయి. వాహనాలు సైతం కొట్టుకుపోయాయి. నదులు, వాగులు పొంగిపొర్లడంతో అనేక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. 500కు పైగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పని చేయకుండా పోయాయి. సుమారు 700 తాగునీటి సరఫరా పథకాలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక, రెస్క్యూ ఆపరేషన్లను చేపట్టింది. భారత సైన్యం, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం సిబ్బంది, స్థానిక పోలీసులు, ఇతర కేంద్ర ఏజెన్సీలు గల్లంతైన వారి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. వరదల్లో చిక్కుకున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. రహదారులను పునరుద్ధరించడం, విద్యుత్, తాగునీటి సరఫరాను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడం అత్యంత ప్రాధాన్యతగా అధికారులు పెట్టుకున్నారు. భారత వాతావరణ శాఖ హిమాచల్ ప్రదేశ్‌కు జులై 7వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. భారీ వానలతో పాటు కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ విపత్తుకు కారణం ప్రపంచ వాతావరణ మార్పులే అని అధికారులు పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్ సున్నితమైన పర్యావరణ వ్యవస్థపై వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా ఉందని వివరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు వెళ్లకూడదని సూచించింది. వీలు అయినంత వరకు ఇళ్లల్లోనే ఉండాలని పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో సహాయక బృందాలకు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. ఈ విపత్తు నుంచి రాష్ట్రం కోలుకోవడానికి మరింత సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## నష్ట పరిహారానికి ముందు ఆర్థిక వివరాలేమిటి?



**న్యూఢిల్లీ-నవభూమి:** గతంలో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద బాధితుల కుటుంబాలు విమానయాన సంస్థపై తీవ్ర ఆరోపణలు చేశాయి. నష్ట పరిహారం చెల్లించడానికి ముందు తమ ఆర్థిక వివరాలను బలవంతంగా వెల్లడించాలని ఎయిర్ ఇండియా ఒత్తిడి చేస్తోందని.. ఇది తమను తీవ్రంగా అవమాన పరుస్తోందని ఆ కుటుంబాలు వాపోతున్నాయి. అయితే ఈ ఆరోపణలను ఎయిర్ ఇండియా తీవ్రంగా ఖండించింది. తాము ఈ ప్రక్రియను పారదర్శకంగా, మానవత్వంతో నిర్వహిస్తున్నామని పేర్కొంది.అహ్మదాబాద్‌లో జరిగిన ఏఐ-171 విమాన ప్రమాదంలో 274 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం అందరికీ తెలిసిందే. అయితే ల్యాండ్ అయిన కాసేపటికే ఈ విమానం కుప్పకూలగా ఘోర ప్రమాదం సంభవించింది. ముఖ్యంగా విమానం జనావాసాలపై పడగా.. విమానంలో ఉన్న వారు సహా స్థానిక ప్రజలు సైతం చనిపోయారు. పదలు సంఖ్యలో ప్రజలు తీవ్రంగా గాయపడ్డారు. అయితే తాజాగా బాధితుల కుటుంబాలకు న్యాయపరమైన సహాయం అందిస్తున్న యూకేకు చెందిన 'స్టీవర్ట్స్ లా' సంస్థ.. ఎయిర్ ఇండియా తీరును తీవ్రంగా తప్పు పట్టింది. 40 మందికి పైగా బాధితుల కుటుంబాల తరపున వాదిస్తున్న ఈ సంస్థ.. ఎయిర్ ఇండియా "బలవంతం, బెదిరింపులు, ఒత్తిడి"కి పాల్పడుతోందని ఆరోపించింది.నష్ట పరిహారాన్ని తగ్గించడం లేదా పూర్తిగా నిలిపివేస్తామని బెదిరించి కొన్ని పత్రాలపై సంతకాలు చేయించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కుటుంబాలు ఫిర్యాదు చేసినట్లు స్టీవర్ట్స్ లా వెల్లడించింది. ఇప్పటికే ప్రియమైన వారిని కోల్పోయి దుఃఖంలో ఉన్న కుటుంబాలను ఈ విధంగా వేధించడం అమానవీయమని బాధితుల తరపు న్యాయవాదులు పేర్కొంటున్నారు. మరోవైపు ఎయిర్ ఇండియా ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. విమానయాన సంస్థ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. తాము పరిహారం ప్రక్రియను అత్యంత సున్నితంగా, మానవతా దృక్పథంతో నిర్వహిస్తున్నామని స్పష్టం చేసింది. అన్ని చట్టపరమైన, నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉన్నామని పేర్కొంది. బాధిత కుటుంబాలకు పూర్తి మద్దతు ఇస్తున్నామని వెల్లడించింది. ఆర్థిక వివరాలను అడగడం అనేది సాధారణ ప్రక్రియలో భాగమే తప్ప.. బలవంతంగా అడగడం లేదని ఎయిర్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. ఇప్పటికే చాలా మందికి మధ్యంతర నష్ట పరిహారం చెల్లించబడిందని కూడా సంస్థ పేర్కొంది.విమాన ప్రమాద బాధితులకు నష్ట పరిహారం అనేది ఎల్లప్పుడూ ఒక సున్నితమైన అంశమని చెప్పింది. ప్రియమైన వారిని కోల్పోయిన బాధలో ఉన్నప్పుడు.. ఆర్థిక వివరాలను వెల్లడించమని అడగడం, దానిపై వివాదం తలెత్తడం అనేది బాధిత కుటుంబాలకు మరింత మానసిక క్షోభను కలిగించే అంశమని పేర్కొంది. ఈ ఆరోపణలు వాటిపై ఎయిర్ ఇండియా ఖండనతో ఈ పరిహారం ప్రక్రియ మరింత వివాదాస్పదంగా మారింది. భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో చూడాలి.

## పాత వాహనాలకు పెట్రోల్, డీజిల్ నిషేధంపై తీవ్ర ఆగ్రహం



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో పాత వాహనాలపై నిషేధం విధించిన ప్రభుత్వం... ఎండ్ ఆఫ్ లైఫ్ కింద డీజిల్ వాహనాల జీవితకాలాన్ని 10 ఏళ్లుగా, పెట్రోల్ వాహనాలకు 15 ఏళ్లుగా నిర్ణయించింది. ఈ వాహనాలకు ఇంధనం నింపరాదని వివాదాస్పద ఉత్తర్వులు జారీచేసింది. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తడంతో ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సాంకేతికంగా ఈ నిబంధనలు అమలు కష్టసాధ్యమని ప్రకటించింది. ఈ మేరకు ఢిల్లీ పర్యావరణ మంత్రి మంజీందర్ సింగ్ సిర్సా వెల్లడించారు. మంత్రి మీడియాతో మాట్లాడుతూ... "సాంకేతిక పరిమితుల వల్ల ఇలాంటి ఇంధన నిషేధాన్ని అమలు చేయడం చాలా కష్టతరమైన పని.. వాహనాలను నిర్వహణ సక్రమంగా ఉంటేవారిని శిక్షించకూడదు. దెబ్బతిన్న, మరమ్మతులకు గురైన వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకునే విధానంపై మేం పనిచేస్తున్నాం" అని తెలిపారు.జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (%జూూవీ%) ఉత్తర్వుల ప్రకారం.. 15 ఏళ్లు పైబడిన పెట్రోల్ వాహనాలు., 10 ఏళ్లకు పైబడిన డీజిల్ వాహనాలు 'ఎండ్ ఆఫ్ లైఫ్ వెహికల్స్" గా పరిగణించి స్క్రాప్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని వెనుక ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించడం ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 62 లక్షల వాహనాలు (కార్లు, ద్విచక్ర వాహనాలు, ట్రక్కులు, వింటేజ్ వాహనాలు) ప్రభావితమవుతున్నాయి.నంబర్ ప్లేట్ గుర్తింపు కెమెరాలు కాలం చెల్లిన వాహనాలను గుర్తించేందుకు ఢిల్లీ ప్రాంతంలోని 498 ఫ్యూయల్ స్టేషన్లలో కెమెరాలు ఏర్పాటు చేసి, వాహన నంబర్లను స్కాన్ చేయాలని నిర్ణయించారు. అయితే, ఇవి ఏప్రిల్ 2019 తర్వాత జారీ చేసిన హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను సరిగా గుర్తించలేవని ప్రభుత్వమే అంగీకరించింది. ఢిల్లీలో కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమవుతోంది.తమ వాహనాల నిర్వహణ సక్రమంగా ఉన్నా.. కేవలం జవయసు కారణంగా వాటిని 'స్క్రాప్'గా పరిగణించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓ నెటిజన్ "'16 ఏళ్ల కిందట కొనుగోలు చేసిన తన %వీవతీఖవసవం-దీవఅఓ జు280 ఎ%6 కండిషన్ చాలా బాగుంది.. కాలుష్యం తక్కువ. అయినా ఇది ఇప్పుడు 'వింటేజ్ స్క్రాప్'గా మారిపోయింది" అని ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే, మరొకరు ఎనిమిదేళ్ల కిందట కొన్న తన రేంజ్ రోవర్‌ను చాలా తక్కువ వాడాను.. కానీ ఇప్పుడు దాన్ని తక్కువ ధరకే అమ్మాల్సి వచ్చింది' అని వాపోయాడు. వాహనం వయస్సు ఆధారంగా కాకుండా, వాస్తవ కాలుష్య ఉత్సర్గాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్ ఉన్న వాహనాలను నిషేధించకూడదని డిమాండ్ చేస్తున్నారు. కొత్త వాహనం కొనాలంటే జీఎస్టీ, సెస్‌తో కలిసి సామాన్యుడికి తడిపిమోపుడవుతోంది. ఢిల్లీ తరువాత గురుగ్రామ్, నవంబర్ 1 నుంచి ఇదే విధానాన్ని అమలు చేయడానికి సిద్ధమైంది. అయితే ఢిల్లీ పునరాలోచించడంతో ఇతర నగరాలు కూడా వెనక్కి తగ్గే అవకాశం ఉంది.

## సీఎం నన్ను అవమానించారు, వెంటనే నా స్వచ్ఛంద పదవీ విరమణను అంగీకరించండి..: పోలీస్ ఆఫీసర్ సంచలనం



**బెంగులూరు-నవభూమి:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈమధ్య కాలంలో అనేక వివాదాల పాలవుతున్నారు. తెలిసో, తెలియకనో చేసే చిన్న చిన్న తప్పులతో అనేక గొడవల్లో ఇరుక్కుంటున్నారు. ఇటీవలే బహిరంగ సభలోనే ఓ పోలీసు అధికారిణి స్టేజీపైకి పిలిచి మరీ చెంప పగులగొట్టేందుకు చెయ్యి ఎత్తారు. ఈ ఘటన జరిగిన మూడు నెలలు కావొస్తుండగా.. అప్పట్లో ఈ వీడియో నెట్టింట తెగ వైరల్ అయింది. అయితే తాజాగా సదరు పోలీస్ అధికారి ముఖ్యమంత్రి తనను అవమానించినందకు గాను స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. సీఎం నన్ను తీవ్రంగా అవమానించారు, వెంటనే నా స్వచ్ఛంద పదవీ విరమణను అంగీరించమంటూ ఆయన డిమాండ్ చేశారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళ్తే.. ఏప్రిల్ 28వ తేదీన కర్ణాటకలోని బెలగావిలో జరిగిన ఓ ర్యాలీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముఖ్య అతిథిగా వెళ్లారు. అయితే అప్పటికే ఈయన పహల్గాం ఉగ్రదాడిపై షాకింగ్ కామెంట్లు చేశారు. ముఖ్యంగా పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సిన అవసరం లేదంటూ చెప్పుకొచ్చారు. ఈ కామెంట్లపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలు చేసిన కొన్ని రోజులకే ర్యాలీకి వెళ్లగా.. సీఎంను చూసిన బీజేపీ నాయకులు.. గో టు పాకిస్థాన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో తీవ్ర అసహనానికి గురైన సీఎం.. అక్కడ ఏర్పాట్లు చూసుకుంటున్న అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నారాయణ్ బరమణి స్టేజీపైకి పిలిచారు. అంతా చూస్తుండగానే.. ఆయన చెంప పగులగొట్టేందుకు చెయ్యి లేపారు. అప్పట్లో ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవగా.. అంతా షాక్ అయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఘటన సంచలనం రేపింది. ముఖ్యమంత్రి పదవిలో ఉండి.. ఓ పోలీసు అధికారిపైకి చెయ్యెత్తడాన్ని అందరూ తప్పుబట్టారు. అయితే ఇదంతా జరిగి రెండు నెలలు పూర్తయ్యే సమయంలో.. సదరు పోలీస్ అధికారి అవమాన భారాన్ని తట్టుకోలేకపోతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జూన్ 12న ఏఎస్పీ బరమణి తన స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. తన లేఖలో.. తాను "తీవ్రంగా అవమానానికి గురయ్యానని" ఈ ఘటన వల్ల "తీవ్ర మానసిక క్షోభను" అనుభవించానని పేర్కొన్నారు. జాతీయ, సామాజిక మాధ్యమాలలో ఈ విషయం విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో తన పరువుకు భంగం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వెంటనే తన స్వచ్ఛంద పదవీ విరమణను అంగీకరించాలని కోరారు. అయితే తాజాగా దీనిపై బీజేపీ స్పందించింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీరును తీవ్రంగా ఖండించింది. సీఎం అహంకారానికి ఈ ఘటన నిలువెత్తు నిదర్శనమని బీజేపీ నాయకులు విమర్శించారు. సిద్ధరామయ్య వెంటనే బరమణికి, పోలీసు విభాగానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీతో పాటు జనతా దళ్ (సెక్యులర్) కూడా ముఖ్యమంత్రి ప్రవర్తనను అత్యంత సిగ్గుచేటు, అగౌరవ ప్రదర్శనగా అభివర్ణించింది. బరమణి తన నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని కూడా బీజేపీ కోరింది.ఈ ఘటన పోలీసుల మనోస్థైర్యంపై ప్రభావం చూపుతుందని, ఉన్నతాధికారులు కింది స్థాయి ఉద్యోగులను గౌరవించడం చాలా ముఖ్యమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## విమానంలో గొడవపడ్డ భారత సంతతి వ్యక్తి.. అమెరికాలో అరెస్టు




**ఫిలడెల్ఫియా-నవభూమి:** అమెరికాలో భారతీయ సంతతి వ్యక్తిని అరెస్టు చేశారు. ఫిలడెల్ఫియా నుంచి మియామికి విమానంలో వెళ్తున్న ఆ వ్యక్తి తోటి ప్రయాణికుడిపై చేయి చేసుకున్నాడు. ఈ ఘటనకు చెందిన వీడియో ఒకటి వైరల్ అవుతున్నది. నివార్క్ నివాసితుడు, 21 ఏళ్ల ఇషాన్ శర్మ.. కీన్ ఇవాన్స్ మధ్య గొడవ జరిగింది. జూన్ 30వ తేదీన ఫ్రంటర్ ఎయిర్‌లైన్స్ విమానంలో ఈ ఘటన జరిగింది. ఒకర్ని ఒకరు గొంతు పట్టుకుని కొట్టుకున్నారు. తోటి ప్రయాణికులు వద్దని వేడుకుంటున్నా.. ఆ ఇద్దరూ ఒకరిపై ఒకరు విరుచుకుపడ్డారు.
దాడి గురించి పోలీసులకు ఇవాన్స్ ఫిర్యాదు చేశాడు. తనను చూసి ఇషాన్ నవ్వాడని, చంపేస్తానని బెదిరించాడని, తనను సవాల్ చేస్తే, చావు తప్పదని హెచ్చరించాడని అతను పోలీసులకు చెప్పాడు. వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో.. శర్మ గురించి ఫ్లయిట్ అటెండెంట్స్‌కు చెప్పినట్లు వెల్లడించాడు. అయితే పదేపదే శర్మ బెదిరించడంతో.. అసిస్టెన్స్ బటన్ నొక్కినట్లు అతను చెప్పాడు. ఆ తర్వాత పరిస్థితి మరింత జఠిలంగా మారిందన్నాడు.విమానం ల్యాండ్ అయిన తర్వాత శర్మను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. కోర్టులో శర్మ తరపున లాయర్ వాదించారు. శర్మ తన సీటులో ధ్యానం చేస్తుంటే పక్క సీటులో ఉన్న వ్యక్తికి అది నచ్చలేదని, దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తినట్లు చెప్పారు.

## నేషనల్ మెడికల్ స్కామ్.. ఎఫ్ఐఆర్‌లో 36 మంది పేర్లు



**హైదరాబాద్-నవభూమి:** నేషనల్ మెడికల్ కమిషన్ స్కామ్ కేసులో కీలక విషయాలు వెలుగు చూశాయి. దేశవ్యాప్తంగా 36 మంది పేర్లను సీబీఐ ఎఫ్ఐఆర్‌లో చేర్చింది. ఎన్ఎంసీ సభ్యులు, కేంద్ర ఆరోగ్యశాఖ అధికారులపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో ఏపీ, తెలంగాణకు చెందిన డాక్టర్ల పేర్లు కూడా ఉన్నాయి. వరంగల్, విశాఖకు చెందిన కాలేజీల డైరెక్టర్లపైనా కేసులు పెట్టారు. మెడికల్ కాలేజీల్లో తనిఖీల సమాచారాన్ని ముందుగానే కాలేజీలకు పలువురు ఎన్ఎంసీ సభ్యులు చేరవేస్తున్నారని... సమాచారం ఇచ్చినందుకు ఎన్ఎంసీ సభ్యులకు లంచాలు ఇస్తున్నారని సీబీఐ దర్యాప్తులో వెల్లడించింది. అటు తనిఖీల సమాచారంతో అప్రమత్తమవుతున్న కాలేజీలు... అద్దె ఫ్యాకల్టీతో ఎన్ఎంసీని ఏమార్చుతున్నాయని విచారణలో బయటపడింది.జూన్ 30న ఆధారాలన్నీ సేకరించిన తర్వాత సీబీఐ విచారణలో వచ్చిన సమాచారం ఆధారంగా మొత్తం 36 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐదు మందిపై కేసు నమోదు అయ్యింది. ఏపీకి చెందిన డాక్టర్ హరిప్రసాద్‌పై కేసు నమోదు అయ్యింది. విశాఖపట్నం అక్కయ్యపాలెంకు చెందిన డాక్టర్ కిషోర్ కుమార్‌పై కూడా కేసు ఫైల్ చేశారు. అటు విశాఖపట్నం గాయత్రి మెడికల్ కళాశాల డైరెక్టర్‌గా ఉన్న వెంకట్, తెలంగాణలో వరంగల్‌కు చెందిన జోసెఫ్ కొమ్మిరెడ్డిపై కూడా సీబీఐ కేసు నమోదు చేసింది.

## ఆ.. రైతును అల్లనేరేడు ఆదుకుంది..



**బెలుగుప్ప(బెంగళూరు)-నవభూమి:** మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన రైతు హరిదాస్ చౌదరి అల్లనేరేడు పంటతో అధిక లాభాలు గడిస్తున్నాడు. పుష్కర కాలం కిందట ఆర్డీటీ పంపిణీ చేసిన బహు డోలి రకం అల్లనేరేడు మొక్కలు ఒక్కోటి రూ.40లతో కొనుగోలు చేశాడు. మూడు ఎకరాలలో 140 మొక్కలను 20-20 దూరంలో నాటి బోరుబావి నీటితో సంరక్షించాడు. ఐదేళ్లకు పంట చేతికొచ్చింది. పూత, కాయలకు పురుగు ఆశించకుండా క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్నట్లు తెలిపాడు.మూడు ఎకరాలకు పురుగుమందులు, ఎరువులు, కూలీ ఖర్చు అన్నీ కలిపి ప్రతి ఏటా రూ. 80 వేల నుంచి రూ.90 వేలు పెట్టుబడి వస్తుందని రైతు తెలిపారు. దిగుబడి, మార్కెట్‌లో ధరను బట్టి ఏడాదికి ఐదారు లక్షల రూపాయాల ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. ఈ యేడాది తోటలోనే రూ.ఆరు లక్షలకు వ్యాపారులకే విక్రయించినట్లు తెలిపారు. పంట దిగుబడిని బట్టి ధరలో మార్పు ఉంటుందన్నారు. నేరేడు పండ్లు మధుమేహం, జీర్ణక్రియ, మెదడు, గుండెకు ఔషధంగా పని చేస్తాయన్న నమ్మకంతో మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోందన్నారు. ఉద్యాన పంటలే మేలు..మెట్ట భూముల్లో వర్షాధార పంటలు సాగు చేసి అప్పులపాలయ్యాం. కష్టాల్లో ఉన్న రైతులకు ఉద్యాన పంటలు ఎంతో ఆదాయాన్నిస్తున్నాయి. నా కుమారుడు శశిధర్ సహకారంతో 15 ఎకరాలలో మామిడి, అల్లనేరేడు, అరటి పంట సాగు చేస్తున్నాం. గిట్టుబాటు ధరతో పాటు మార్కెటింగ్ సౌకర్యం ఉంటే ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకం.


నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 హైదరాబాద్ శనివారం 05 । జులై । 2025






## తుంగభద్రకు భారీగా వరద..

**బళ్లారి(బెంగళూరు):నవభూమి:** తుంగభద్ర పైభాగం పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద పోటెత్తుతోంది. అధిక ప్రమాణంలో జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నిండుకుండలా మారింది. ప్రస్తుతం జలాశయానికి 30వేల క్యూసెక్కులకుపైగా నీరు వచ్చి చేరుతుండగా జలాశయం భద్రత దృష్ట్యా 80 టీఎంసీల సామర్థ్యం దాటగానే వచ్చిన నీటిని అలేగా దిగువకు అధికారులు వదులుతున్నారు. నదిలో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇప్పటికే నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలను బోర్డు అధికారులు అప్రమత్తం చేస్తూ హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం జలాశయం నుంచి 20 క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 2.5 అడుగులు ఎత్తి ఒక్కో గేటు నుంచి 2,913 క్యూసెక్కుల చొప్పు మొత్తం 58,260 క్యూ సెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. జలాశయంలో వరద నీరు పెరిగేకొద్దీ మరిన్ని గేట్ల ద్వారా నీటిని వదిలే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు. జలాశయం ఎత్తు 1633 అడుగులు ఉండగా, ప్రస్తుతం డ్యామ్‌లో 1625.3 అడుగులకు నీరు చేరిం ది. జలాశయంలోకి 30వేల క్యూసెక్కుల మేర వరద నీరు వచ్చి చేరుతుండగా, సాగునీటి కాలువలతో కలిపి మొత్తం 62,268 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. ప్రస్తుతం డ్యామ్‌లో 79 టీఎంసీల నీ రు నిల్వ ఉన్నట్లు బోర్డు అధికారులు తెలిపారు. గత ఏడాది ఇదే స మయానికి 1587 అడుగులకు నీరు చేరుకోగా, 10,503 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 16.32 టీఎంసీల నీరు నిలువ ఉన్నట్లు వారు తెలిపారు.



## పాశమైలారం పేలుడు ప్రాణహానికి బాధ్యులు ఎవరు?

పాశమైలారం ప్రాంతంలో ఇటీవల చోటుచేసుకున్న ఘోర ఫార్మాస్యూటికల్ పేలుడు ఘటన మరచిపోలేని విపత్తుగా మిగిలిపోయింది. ఇది కేవలం ఒక ఫ్యాక్టరీ ప్రమాదం కాదు. ఇది సంకీర్ణమైన రాష్ట్ర నైతిక వైఫల్యం, భద్రతా ప్రమాణాల నిర్వాకం, అధికార యంత్రాంగాల నిర్లక్ష్యం, కార్మికుల జీవితాల పట్ల యాజమాన్యాల నిర్లజ్జ తీరుల మేళవింపు. ఏ ఒక్క పాయింటును వదిలిపెట్టినా ఈ విధ్వంసాన్ని అర్థం చేసుకోవడం అసాధ్యమే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగిపోతూ ఉండడం, అనేకమంది గాయపడడం, శవాలు గుర్తించలేని స్థితికి చేరడం ఈ వ్యవస్థ ఎంతగా ప్రజావ్యతిరేకంగా తయారైందో మనకి తెలియజేస్తుంది.

ఇదెక్కడో ఓ కార్బన్ మానోక్సైడ్ లీకేజీ కాదు. ఇది రియాక్టర్ పేలుడు అని అనుమానం కలిగించే స్థాయిలో భవనం అంతా ఉడి పోయే విధంగా పేలడం, అంతటా శిథిలాలు, మంటలు, మానవ శరీరాలు మాంసపు ముద్దలుగా మారిపోవడం, కార్మికులు ఖాకీ దుస్తుల్లో పనికి వెళ్లి డీఎన్ఏ టెస్టుతో మాత్రమే గుర్తించగలిగిన దుస్థితికి నెట్టబడటం.

సిగాచీ ఫార్మా యాజమాన్యం ఘటనకు స్పందిస్తూ, ఇది రియాక్టర్ పేలుడు కాదని, కేవలం నలభైమంది మాత్రమే మరణించారని ప్రకటించడంలో బాగానే చూసిన ప్రచార యంత్రాంగాన్ని ఆటపట్టించే ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. స్టాక్ మార్కెట్‌కు లేఖ రాసేంతలోనే యాజమాన్యం మీడియా ముందర క్షమాపణ చెప్పకుండా మృతుల సంఖ్యను తగ్గించి చెప్పడం బలమైన సంకేతం. ఇది బాధ్యతారాహిత్యం కాదుబీ ఇది చట్టాలను లెక్కచేయని ధోరణి. నాలుగు దశాబ్దాలుగా నడుస్తున్న ఈ ఫ్యాక్టరీలో ఇప్పటికి పాత మిషనరీలు పని చేస్తున్నాయంటే అది యాజమాన్య మతి భ్రంశమే కాదు, అది వ్యవస్థ పరంగా పుట్టిన అవినీతితో కూడిన భద్రతా ప్రమాణాల హీనత్వం. ఆధునికీకరణకు కష్టపడకుండా, రిక్షింగ్ తీసుకుంటూ, నిబంధనల్ని కాలరాసి, పరిశ్రమను కేవలం లాభాల యంత్రంగా వాడుకోవడమే అసలు మూలకారణం. రోజూ ఓ గ్లాసు పాలు కోసం వచ్చిన కార్మికులు క్షణాల్లో గాలిలో కలసిపోవడం వంటి దారుణానికి ఎలాంటి పేరు పెట్టాలి? ఈ సంఘటనపై విచారణకు నలుగురు నిపుణులతో కమిటీ ఏర్పాటు చేయడం ప్రభుత్వ నైతిక బాధ్యతను పూర్తిగా తేలికపరచదు. ఆ కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పేలా ఇప్పటికే పదే పదే వినిపిస్తున్న ప్రభుత్వ భాష్యతను ప్రజలు ఎంతవరకూ నమ్మగలుగుతారు? దర్యాప్తు జరగాలనే కోరిక కంటే దర్యాప్తును వాయిదా వేయడం వల్ల చల్లబడే కల్లోలం కోసమే ఆయా కమిటీల ఏర్పాటు జరుగుతున్నాయని అనిపిస్తోంది. నివేదికలు రాస్తారు, అవి బయటపడతాయి, కొంతకాలానికి మర్చిపోతాం. కానీ ప్రాణాలు పోయిన వారికీ, వారి కుటుంబ సభ్యులకూ ఆ నివేదికలు ఏమీ మానసిక ఓదార్పు ఇవ్వలేవు. నిబంధనల మేరకు ఈ పరిశ్రమను పర్యవేక్షించే ప్రభుత్వ యంత్రాంగం ఎక్కడుందో, ఎందుకు అది అప్రమత్తం కాలేదో అనే ప్రశ్నలు ప్రభుత్వాలపై నిందల్ని మోపే స్థాయికి వచ్చాయి. పరిశ్రమలకు తాము నిబంధనలకు లోబడి నడుస్తున్నామని ఆన్‌లైన్‌లో 'స్వీయ ధృవీకరణ' చెబితే చాలనే మూర?త్వం కొనసాగుతుండడం ఈ ప్రమాదానికి దారితీసింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో పరిశ్రమలకు సడలింపులు, మినహాయింపులు ఇస్తూ, వాస్తవంగా ప్రజల ప్రాణాలను బెట్టేసే విధంగా వ్యవస్థను మలచిన పాలక వ్యవస్థల పుణ్యమా అని ఈ దురదృష్టకర దశకు చేరుకున్నాం. పరిశ్రమల అభివృద్ధి పేరుతో భద్రతా ప్రమాణాలను తేలికపర్చడమే ప్రధాన బాధ్యతా రాహిత్యానికి మూలం. అట్టడుగు వర్గాల కార్మికులు తమ పనులకే పరిమితమై, తమ హక్కులపై పోరాటం చేయలేని స్థితికి నెట్టబడ్డారు. యాజమాన్యాన్ని నిలదీయలేని విధంగా కార్మికులను అణచివేసే మౌలిక సామర్థ్యం సమాజం నుంచి తీయబడ్డది. ఇప్పటికైనా ప్రభుత్వం జాగృతం కావాలంటే ఇదే తగిన గుణపాఠం. కార్మికులకు కనీసమైన భద్రతా హామీలు లేకుండా పరిశ్రమల అనుమతులు ఇచ్చే విధానమే మార్చాలి. నిబంధనలు అమలుచేయని యాజమాన్యాలను కేవలం జరిమానాలతో వదిలిపెట్టడం కాదుబీ వారి మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పరిశ్రమలో ఏ ఒక్క పర్మిషన్ మినహాయించబడకుండా స్పష్టమైన తనిఖీ వ్యవస్థను మళ్లీ నెలకొల్పాలి. ఫ్యాక్టరీ యాజమాన్యంపై క్రిమినల్ బాధ్యత లాగలేకపోతే ఇటువంటి సంఘటనలు ఆగవు. కేవలం పశ్చాత్తాపంతో పరిమితమైతే బాధితులకీ, సమాజానికీ న్యాయం జరగదు. ఈ ప్రమాదంలో మరణించినవారు కేవలం కార్మికులు కాదు, వారు కుటుంబాల ఆశలు, భవిష్యత్ కలలు. వారి ప్రాణం వెనుక ఉన్న సామాజిక విలువను మనం గుర్తించాల్సిన అవసరం ఉంది. ఈ దేశంలో ఓ కార్మికుడు ప్రాణం కోల్పోతే, అంతర్జాతీయ స్థాయిలో కంపెనీకి నష్టం వాటిల్లాలన్న విధంగా చట్టాలు ఉండాలి. ప్రమాదాలపై సమగ్ర విచారణలు జరిపి, బాధ్యులను జైలుకు పంపే చర్యలు తీసుకున్నప్పుడే సంస్థలు మారతాయి. ప్రమాదాలపై కాలుష్య నియంత్రణ మండలి, ఫ్యాక్టరీ ఇన్స్పెక్టరేట్ వంటి సంస్థల పాత్రను సమగ్రంగా సమీక్షించాల్సిన సమయం ఇది. ఏ సంఘటనకైనా విచారణలూ, నివేదికలూ, పునరావృత హామీలూ కొత్తేమీ కావు. కొత్తగా ఉండాల్సింది చర్య. ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని కేవలం ఒక్క ఫిర్యాదుతో అరెస్ట్ చేసి, మరొక కంపెనీ యజమానికి హెచ్చరికగా నిలబడేలా చేస్తే తప్ప మిగిలినవారు వణకరు. ప్రమాదం జరిగిన తర్వాత బాధిత కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయల పరిహారం ప్రకటించడం తీరని ఆలోచన. ప్రాణానికి ధర లాంటిదే లేకపోవడమే నిజం అయినా, ఈ చెల్లింపులు బాధ్యులపై ఆధారపడకుండా భయపడే స్థితిని తీసుకురావాలి. అదే సమాజానికి, కార్మికులకు నిజమైన న్యాయం. చివరికి ఒక ముఖ్యమైన విషయం: ప్రమాదాలు అఘటనలు కావు. అవి మన వ్యవస్థల వైఫల్యాల ఫలితం.

పాశమైలారం పేలుడు ఈ దేశంలోని ప్రతి పరిశ్రమ యాజమాన్యానికి ఒక హెచ్చరిక కావాలి. అధికారులకు ఒక బోధ కావాలి. రాజకీయ నాయకులకు ప్రజల భద్రతపై బాధ్యతను గుర్తుచేసే గొంతు కావాలి. లేకపోతే మరో పాశమైలారం ఎంతో దూరంలో కాదు. ఇది ప్రశ్నించాల్సిన సమయం. ఎవరు బాధ్యులు అనే ప్రశ్నలో మళ్లీ ప్రజలే మోసపోవకూడదు. సమాధానం మాత్రం నిర్దిష్టంగా ఉండాలి. బాధ్యులు శిక్షితులవ్వాలి. అప్పుడే మృతుల ఆత్మలకు శాంతి. అప్పుడే సమాజానికి భరోసా.

# ప్రపంచ శాంతి తక్షణ ఆవశ్యకత

## తక్షణం ట్రూస్ - కాల్పులు విరమణ పాటించాలి



నేడు కాల్పుల విరమణ, సంధి, ట్రూస్ అనే పదాలు యుద్ధం జరిగే దేశాల్లో ఎక్కువగా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా 56 వార్ లేదా కాన్ ఫ్లిక్ట్స్ జరుగుతున్నవి. ఒక అకాడమీ అధ్యయనం ప్రకారం ఈ కాన్ ఫ్లిక్ట్స్ వలన సుమారు 110 దేశాలపై ప్రభావం కలిగింది. భారతదేశంలో మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, కాల్పుల విరమణ పాటించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో వార్ లేదా కాన్ ఫ్లిక్ట్స్ లో సీజ్ ఫైర్ ల ప్రభావం గురించి సంక్షిప్త విశ్లేషణ.

ఆధునిక కాలంలో కాల్పులు విరమణ భావన మొదటి ప్రపంచం యుద్ధంలో క్రిస్మస్ వేడుకలు సమయంలో అధికారికంగా వచ్చిందని చెప్పవచ్చును. కాల్పులు విరమణ ని ట్రూస్ సంధి అని కూడా పిలుస్తారు. కాల్పులు విరమణ అనే పదం ఓపెన్ ఫైర్ అనే పదానికి వ్యతిరేక పదం అంటే యుద్ధాన్ని నిలిపి వేయడం. రెండు వైపులా దూకుడు చర్యలను నిలుపుదల చేయడానికి అంగీకరించడం. ఎక్కువగా మూడవ పక్షం మధ్య వర్తిత్వం వహించడం వలన జరుగుతుంది. సంధి లేదా కాల్పులు విరమణ అనేది రాజీ కాదు. యుద్ధం లేదా పోరాటంలో జరుగుతున్న భారీ పౌర లేదా సామాజిక నష్టాన్ని తాత్కాలికంగా లేదా శాశ్వతంగా పరిష్కరించేందుకు వారి యుద్ధ ప్రకటనలు నుండి మర్యాదగా విరమించుకోవాలని పెద్ద మనుషులు చేసే ప్రయత్నం.

కాల్పుల విరమణ, శాంతి చర్చలు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలి నిభంధనలు, దేశాలు ప్రభుత్వాలు నియమాలు ప్రకారం జరుగుతాయి. ప్రపంచంలో అన్ని దేశాలు మానవ హక్కుల ప్రకటన అమలు పరిచాలి పౌర స్వేచ్ఛ,శాంతి, సంక్షేమ, జీవించే హక్కులు కి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలి. యుద్ధములు వలన మానవులు జీవించే హక్కులు కోల్పోతారు. అందుకే యుద్ధములు నివారణకు ప్రపంచ ప్రజలు ముందుకు రావాలి. యూఎన్ఓ సెక్యూరిటీ కౌన్సిల్ (భద్రత మండలి) చాప్టర్



%జఱఱ% ప్రకారం రెండు దేశాల మధ్య యుద్ధం జరిగేటప్పుడు యూఎన్ఓ శాంతి కోసం జోక్యం చేసుకునె హక్కు ఉంది. ప్రపంచ మానవ హక్కుల ప్రకటన అమలు చేయాలని అడిగే హక్కు అమలుకు ఉద్యమించె హక్కు ప్రజలకు ఉన్నది.

ఉదాహరణకు భారత దేశంలో ప్రభుత్వానికి మావోయిస్టులకి జరుగుతున్న అంతర్యుద్ధంలో జస్టిస్ చంద్ర కుమార్ శాంతి చర్చలు కమిటీ భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 21, 19, 14 ప్రకారం మధ్య వర్తిత్వ ప్రతిపాదనలు లాంటివి. అవి ప్రపంచ మానవ హక్కుల ప్రకటన కు చెందినవి.

కాల్పుల విరమణలను అధికారిక ఒప్పందంలో భాగంగా ప్రకటించవచ్చును. ప్రత్యర్థి శక్తుల మధ్య అనధికారిక అవగాహనలో భాగంగా కూడా ప్రకటించవచ్చు ను. అవి మధ్యవర్తిత్వం ద్వారా లేదా శాంతి ప్రక్రియలో భాగంగా జరగవచ్చును మరియు ఐక్యరాజ్యసమితి చార్టర్ యొక్క %ఎ××% అధ్యాయం ద్వారా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాల ద్వారా విధించబడవచ్చును. కాల్పుల విరమణ అనేది ఉద్దేశించిన ముగింపు తేదీతో తాత్కాలికంగా ఉండవచ్చును. లేదా నిరవధికంగా కొనసాగడానికి ఉద్దేశించబడవచ్చును. కాల్పుల విరమణ అనేది యుద్ధ విరమణ నుండి భిన్నంగా ఉంటుంది. దీనిలో యుద్ధ విరమణ అనేది యుద్ధానికి అధికారిక ముగింపు అయితే కాల్పుల విరమణ అనేది తాత్కాలిక విరమణ కావచ్చును. కాల్పుల విరమణ యొక్క తక్షణ లక్ష్యం హింసను ఆపడం. కానీ కాల్పుల విరమణల యొక్క అంతర్లీన ప్రయోజనాలు మారుతూ ఉంటాయి. అవి

1. స్వల్పకాలిక పరిమిత అవసరాలను తీర్చడం
2. మానవతా సహాయం వైద్యం, ఆహారం, బట్టలు తదిత రాలు అందించడం కోసం
3 సంఘర్షణను తక్కువ వినాశకరమైనదిగా చేయడానికి
4 వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించడానికి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లడానికి కాల్పుల విరమణలు ఉద్దేశించబడవచ్చును.

ఒక ప్రత్యర్థి ఎల్లప్పుడూ వివాదానికి శాంతియుత పరిష్కారాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కాల్పుల విరమణను ఉద్దేశించకపోవచ్చును. కానీ దానికి బదులుగా ప్రత్యర్థి సంఘర్షణలో పైచేయి అవ్వవచ్చును. ఉదాహరణకు, దళాలను తిరిగి ఆయుధాలు సమకూర్చడం మరియు తిరిగి స్థానాలను మార్చడం లేదా అనుమానం లేని ప్రత్యర్థిపై దాడి చేయడం. ఈ అవకాశాన్ని ప్రత్యర్థులు ఇరువురు కి ఉపయోగించు కుంటారు. ఇది బేరసారాల సమస్యలను సృష్టిస్తుంది. దీని వలన కాల్పుల విరమణలు అమలు చేయబడే అవకాశం తక్కువగా ఉంటుంది. మరియు అమలు చేయబడితే అవి చిత్తశుద్ధితో ఉండే అవకాశం కూడా తక్కువగా నే ఉంటుంది. కాల్పుల విరమణ ఒప్పందాల చిత్తశుద్ధితో, సైనికరహిత మండలాలు, దళాల ఉపసంహరణ మరియు మూడవ పక్ష హామీలు మరియు పర్యవేక్షణ ఉదా. శాంతి పరిరక్షణ వంటి అనేక అంశాల ద్వారా ప్రభావితమవుతుంది. కాల్పుల విరమణ ఒప్పందాలు దాడికి ప్రోత్సాహకాలను, అవార్డులు తగ్గించినప్పుడు, శత్రువు ఉద్దేశాల గురించి అనిశ్చితిని తగ్గించినప్పుడు మరియు ప్రమాదాలు సంఘర్షణలోకి వెళ్లకుండా నిరోధించడానికి యంత్రాంగాలను ఏర్పాటు చేసినప్పుడు అవి చిత్తశుద్ధితో ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మార్క్సిస్టు అవగాహన కాల్పులు విరమణ అంటే ఒక అడుగు వెనక్కి 2 అడుగులు ముందుకు వేయడం. సమాజాన్ని ముందుకు నడిపించు కోవడం కోసమే అని అర్థం. ప్రపంచం లో యుద్ధం కాలంలో ప్రజల సంక్షేమం కోసం లెనిన్ ఎత్తుగడలు పాటించడం జరిగింది. అవి ఇప్పటికీ ఆచరణీయం. రాజరిక కాలంలో రెండు రాజ్యాల మధ్య యుద్ధవిరమణ ఒప్పందం రాజప్రభువుల మధ్య అధికారికంగా జరిగేది. యుద్ధం లో రాజ నీతి పాటించేవారు. శత్రు రాజు ప్రాణాలతో దొరికితే ఖైదు చేసేవారు. బానిసలను కూడా చంపే వారు కాదు. బానిస సేవకులుగా పని చేయించు కునే వారు. నేటి ఆధునిక కాలంలో భగత్సింగ్, ఫ్లఅల్లూరి నుండి సద్దాం హుస్సేన్ వరకు నేటి వరకు పట్టు బడిన వారదరిని ఆయా దేశాల రాజ్యాధి నేతలు వారికి లొంగి ఉండక పోతే చంపేశారు. భారత దేశంలో నేటి కార్పొరేట్ కాలంలో రాజ్యం అమానుషత్వం గా చిత్ర హింస లు పెట్టి మరీ చంపుతున్నది. బహుళ ధృవ ప్రపంచంలో ఆయుధ రాజ్యం అమెరికా మార్కెట్ ఆధిపత్యం కోసం ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-గాజా, ఇజ్రాయిల్-ఇరాన్, పాకిస్తాన్- భారత్ తదితర దేశాల్లో యుద్ధములు సృష్టించింది. సృష్టిస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాలు బయట,లోపల జరుగుతున్న యుద్ధములు ఆపాలి. యుద్ధములు నుండి మానవాళి ని కాపాడాల్సిన బాధ్యత ఆయా దేశాల ప్రభుత్వాలది. కానీ కార్పొరేట్ లకు అనుగుణంగా ప్రభుత్వాలు పని చేస్తున్నవి. అందుకే బుద్ధి జీవులు, మేధావులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజా స్వామిక వ్యవస్థ లు, సంస్థలు యుద్ధములు నివారణకు కృషి చేయాలి. ముందుగా ట్రూస్-కాల్పులు విరమణ పాటించాలి. అన్నిటి కంటే ప్రజలు ముందు కు వచ్చి ఆయా దేశాల ప్రభుత్వాలు జరిపే అమానవీయ యుద్ధము లకు వ్యతిరేకంగా పౌర స్వేచ్ఛ,సంక్షేమం,అభివృద్ధి కోసం ఒక కర్తవ్యం గా ఉద్యమించాలి.

**నంభూరి శ్రీమన్నారాయణ,**
పౌర హక్కుల కార్యకర్త,
హైకోర్టు న్యాయవాది - ఆంధ్రప్రదేశ్

# ఉపాధ్యాయులూ.., ఊపిరితిత్తులు జాగ్రత్త!



చాక్ అనేది విద్యా రంగంలో ప్రతిరోజూ ఉపయోగించే ఒక సాధనంగా మారింది. పాఠశాలల్లో, కాలేజీలల్లో, కోచింగ్ కేంద్రాలలో చాలా చోట్ల బోర్డుపై రాయడానికి దీనినే ఉపయోగిస్తారు. సాంకేతికతను అనుసరించే కొన్ని చోట్ల తప్ప మిగిలిన అన్ని చోట్ల చాక్ మీదే ఆధారపడుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా డిజిటల్ బోర్డులు, వైట్ బోర్డులు మరియు వాటి మీద రాయడానికి మార్కర్లు ఉన్నా చాలా మంది చాక్ నే నమ్ముకున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ విద్యా వ్యవస్థలలో ఇంకా చాక్ నే ఉపయోగిస్తున్నారు. సాంకేతికత అందుబాటులో లేనపుడు చాక్ ని ఉపయోగించక తప్పలేదు. ఇంత అభివృద్ధి చెందాకా కూడా ఇంకా అదే బాటలో నడవడం సమర్థించదగినది కాదు. చాక్ కి బదులు అందుబాటులో ఉన్న ఇతర సాధనాలు ఉపయోగించడం బోధించే వాళ్ళకి మరియు విద్యార్థులకు శ్రేయస్కరం. చాక్ పొడి కారణంగా ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు కూడా అనేక ఆరోగ్యపరమైన ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధ వ్యాధులుతో చాలా ఇబ్బంది పడుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్ర పరమైన ప్రయోగాలు చేసి, ఫలితాలను సైన్స్ కి చెందిన జర్నల్స్ లో అందుబాటులో ఉంచారు.

**చాక్ తయారీ:**

చాక్ తయారీకి ఉపయోగించే ముఖ్య పదార్థం కాల్షియం కార్బొనేట్. ఇది భూమిలో దొరికే సహజ సిద్ధమైన మూలకం. దీనిని తవ్వి తీసి, ఫైన్ పౌడర్ రూపంలో తయారు చేస్తారు. తర్వాత దీనిలో కొద్దిగా రంగు ఇచ్చే కారకాన్ని, దగ్గరకి అతికి ఉండేలా జిగురు లాంటి పదార్థాలు కలిపి మిశ్రమాన్ని మోల్డుల్లో వేసి, ఆరబెట్టి పెద్ద సైజు బలపంలా చాక్ ని తయారు చేస్తారు. ఇంకొంతమంది తయారీదారులు ప్లాస్టర్ ఆఫ్



పారిస్ అనే పదార్థాన్ని ఉపయోగించి సింథటిక్ చాక్ తయారు చేస్తారు. దీనిలో ఉండేది కాల్షియం సల్ఫేట్. వీటిని వేగంగా తయారు చేయడం సులభం అయినప్పటికీ, దీర్ఘకాలిక ఉపయోగంలో ఆరోగ్యపరంగా ఇవి చాలా ప్రమాద కరమైన శ్వాసకోశ సంబంధ వ్యాధులను కలిగిస్తాయి.

**చాక్ పొడి వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు:**

చాక్ వాడే వారిలో ముఖ్యంగా ఉపాధ్యాయులు. వీళ్ళు వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు గురవుతారు. బోర్డుకి దగ్గరగా నిల్చుని ఉండటం వల్ల ఉపాధ్యాయులు చాక్ పొడి పీల్చే అవకాశం ఎక్కువ. బోధించేటపుడు ఎక్కువ సార్లు నోరు తెరవడం వల్ల నోటి ద్వారా మరియు శ్వాస ద్వారా ఈ పొడి ఊపిరితిత్తులలోకి వెళ్తుంది. లోపలికి వెళ్ళిన పొడి రేణువులు శ్వాస నాళాలు మరియు ఊపిరతిత్తుల్లో శ్లేష్మంకి అంటుకుపోతాయి. ఊపిరితత్తుల్లోని చిన్న చిన్న శ్వాస నాళాలు ఉబ్బడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కలిగే ఆస్తమా మరియు బ్రాంకైటిస్ లాంటి దీర్ఘకాలిక వ్యాధులు కలుగుతాయి. దీని వల్ల శ్వాస నాళాల్లో శ్లేష్మం స్థాయి ఇంకొంచం పెరిగి దగ్గు మరియు ఇతర గొంతు సమస్యలు కలిగుతాయి. చాక్ పొడి కంట్లో కూడా ఎక్కువగా చేరడం వల్ల కళ్ళు నీరు కారడం, దురద, మంట, ఎర్రబడటం లాంటి సమస్యలు వస్తాయి. చాక్ దుమ్ము చర్మంపై చేరడం వల్ల కొంతమందికి చర్మంపై దద్దుర్లు, పొడి గడ్డలు ఏర్పడవచ్చు. అలెర్జీ ఉన్న వాళ్ళలో ఈ సమస్యలు తొందరగా రావడమే కాక తీవ్రంగా ఉంటాయి. విద్యార్థులకు కూడా దాదాపు పైన చెప్పిన సమస్యలే ఉంటాయి. చిన్న పిల్లల్లో సమస్య కొంచం ఎక్కువ. ఎందుకంటే వారి శ్వాస వ్యవస్థ ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందదు. ముక్కు, గొంతు, కళ్ళు సంబంధిత అలర్జీలు వచ్చే అవకాశాలు ఉంటాయి. పొడి చేరడం వల్ల గదిలో గాలి నాణ్యతా తగ్గి అది పీల్చిన పిల్లల్లో మూర్ఛ, తలనొప్పి వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ముందు వరుసలలో కూర్చునే పిల్లలకే ఎక్కువ సమస్య. బోర్డు తుడిచినపుడు రాలే చాక్ పొడి రేణువులు ముందు వరుసలో ఉన్న వారి మీద పడతాయి. ఆసక్తిగా ఉండటం కోసం రంగు రంగుల చాక్ లు ఉపయోగిస్తున్నారు. ఆ రంగుల్లో ఉండే వర్ణద్రవ్యాలు కూడా శ్వాసకోశ సంబంధ వ్యాదులతో పాటు కాన్సర్ ను కూడా కలిగిస్తాయి.


తీసుకోవలసిన జాగ్రత్తలు:

వైట్ బోర్డ్ మరియు మార్కర్లు లేదా డిజిటల్ బోర్డ్ వాడటం ద్వారా చాక్ వల్ల కలిగే సమస్యలను పూర్తిగా నివారించవచ్చు. వీటి వల్ల పైన చెప్పిన సమస్యలు వచ్చే అవకాశమే లేదు. కొన్ని పెద్ద విద్యా వ్యవస్థలలో ప్రస్తుతం వీటినే అనుసరిస్తున్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలు సహ ఇంకా చాలా చోట్ల వీటిని ఉపయోగించడం అవసరం. పొడి రాని చాక్ వాడటం ద్వారా పొడి విడుదల తక్కువగా ఉంటుంది. పొడి పరిమాణం తగ్గితే అది గాలిలో కలిసే పరిమాణం కూడా తగ్గి శ్వాసకోశాల్లోకి వెళ్ళే అంత రాక పోవచ్చు. గాలి సరిగా ప్రవహించే తరగతి గదుల నుంచి చాక్ దుమ్ము బయటికి వెళ్ళిపోతుంది. దీని వల్ల దుమ్ముకి బహిర్గతం అయ్యే అవకాశం కొంత తగ్గుతుంది. బోర్డు వాడిన తర్వాత ధూళి గాలిలో కలవకుండా గదిని శుభ్ర పరుస్తూ జాగ్రత్తలు తీసుకోవాలి. చాక్ వాడే సమయంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మాస్కులు ధరించడం. చాక్ ధూళిని తొలగించేందుకు చర్మాన్ని, కళ్ళను తరచూ కడగాలి. ఇవన్నీ సరిగా పాటించినా ఎంతో కొంత దుమ్ము శ్వాసలో కలిసిపోతుంది. దీన్ని పూర్తిగా నివారించలంటే వైట్ బోర్డ్ లేదా డిజిటల్ బోర్డ్ వాడటం ఒక్కటే మార్గం. చాక్ వినియోగం విద్యా సంస్థల్లో సాధారణమైనా, దీని ప్రభావాలు గమనించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆరోగ్యం మీద దీర్ఘకాలిక ప్రభావాలు చూపే అవకాశముండటంతో వైట్ లేదా డిజిటల్ బోర్డ్‌లు వంటి ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలను అనుసరించాలి. ప్రభుత్వం చొరవ తీసుకుంటే తప్ప దీన్ని ఆపలేము. ముందు ప్రభుత్వ విద్యా వ్యవస్థలలో అమలుపరిచి, మిగిలిన ప్రయివేటు ఇతరత్రా వ్యవస్థలకి కూడా వర్తించేలా చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల తల్లి దండ్రులు కూడా పిల్లల్ని విద్యా వ్యస్థలకి పంపేటపుడు వాళ్ళు ఎలాంటి బోర్డులు ఉపయోగిస్తున్నారని తెలుసుకోవడం ఉత్తమం. ఒకవేళ చాక్ మరియు నల్ల బోర్డులే ఉంటే అవి మార్చమని మనవి చేయడంలో తప్పేం లేదు. విద్యకి మాత్రమే ప్రాధాన్యత ఇస్తే సరిపోదు, ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి.

**రామ్ సంకుల, రీసెర్చ్ అనలిస్ట్**
**సెల్: 9603939033**

భక్తి

# వారే గురువులు



మాతృదేవోభవ, పితృ దేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ... 'లోకంలో ప్రత్యక్ష దేవతలు నలుగురు. వారు తల్లి, తండ్రి, గురువు, అతిథి' అంటోంది భారతీయ సంస్కృతి. "తొలి గురువైన వేదమాత, తల్లి మన జన్మభూమి, తండ్రి వేదప్రతిపాద్యుడైన భగవంతుడు, దైవానికి ప్రతీకలైన మిగిలినవారు... ఈ నలుగురే ప్రత్యక్ష దైవాలు" అనే వివరణ కూడా ఉంది. గురువులను భగవంతుడిగా భావించి, ఆరాధించడం భారతీయుల సంస్కృతి, సంప్రదాయం, సభ్యత. అందుకే ఆషాఢ శుద్ధ పౌర్ణమిని 'గురుపౌర్ణమి'గా నిర్వహించుకుంటున్నాం. ఈ సందర్భంగా శిష్యులు తమ గురువులను, గురు పరంపరను ఆరాధించడం అనాదిగా వస్తున్నదే.

గురువు ఎవరు? అతని మహిమ ఎలాంటిది? గురువు వద్ద ఎలా మసలుకోవాలి? ఎలా తరించాలి?... ఈ ప్రశ్నలన్నిటికీ సరైన సమాధానం చెప్పే గ్రంథం 'గురుగీత'. ఇది 'స్కాంద పురాణం'లో... మూడు అధ్యాయాలలో, 351 శ్లోకాలలో... పార్వతీ పరమేశ్వరుల మధ్య సంవాద రూపంలో ఉంటుంది. 'సనత్కుమార సంహిత'గా పేర్కొనే ఈ గ్రంథం... "గురువు అనుగ్రహానికి దూరమైన దేనికీ ఈ ప్రపంచంలో మనుగడ లేదు" అని స్పష్టంగా చెప్పింది. కఠోపనిషత్తులో 'ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత' అనే ఒక విశిష్టమైన సూక్తి ఉంది. అంటే "లేవండి, మేలుకొనండి, మీ కర్తవ్య నిష్ఠతో గమ్యం చేరుకోండి" అని భావం. తెల్లవారుతోంది. రామాయణ గాథలో... రోజంతా గురువు విశ్వామిత్రుడి వెంట నడిచి, అలసిపోయిన రామ లక్ష్మణులు ఒళ్ళు మరచి నిద్రపోయారు. అది గమనించి శ్రీరాముణ్ణి ఉద్దేశించి "కౌసల్యా సుప్రజా రామా! పూర్వాసంధ్యా ప్రవర్తతే" అంటూ విశ్వామిత్రుడు మేలుకొలిపాడు. ఈ రెండు... ముఖ్యంగా కఠోపనిషత్ లోని సూక్తి స్వామి వివేకానందుడికి ఎంతో ఇష్టం. సమాజాన్ని జాగృతపరచాలి. చైతన్యవంతం చేయాలి. ముందుకు నడిపించాలి. వివేకానందుడి అభీష్టం అదే. మరి అందుకు దోహదకారులైన బోధలు చేసేది, మార్గాన్ని చూపించేది, గమ్యానికి చేర్చేది ఎవరు? "గురువు కన్నా వేరెవ్వరూ లేరు" అన్నాయి వేదాలు. అందుకే వారిని ఆచార్యులుగా ఆరాధిస్తున్నాం. ఆర్ష సంస్కృతిని ఆపోశన పట్టినవారు, దాన్ని ఆచరించి, తరించి, ఇతరులను తరింపజేసేవారు, తాను పరమాత్మను లక్ష్యంగా చేసుకొని, సాధన చేసి, దర్శించి, ఇతరులకు బోధించేవారు.. వారే గురువులు. పూర్వం ఎన్నో యుగాల నుంచి ఎందరో ఋషులు తమ తపఃఫలంగా సంపాదించిన జ్ఞానాన్ని క్రోడీకరించి, ఆ అనంతమైన రాశిని నాలుగు వేదాలుగా విభజించి, దాన్ని మనకు అందించినవాడు వ్యాసుడు. అందుకే 'వ్యాసాయ విష్ణురూపాయ' అని ఆయనకు నమస్కరిస్తున్నాం. వ్యాసుడు చెప్పినదాన్నే శంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్వాచార్యులు తమ శిష్యపరంపరకు అందించారు. వ్యాసుని పుట్టినరోజు ఆషాఢ శుద్ధ పౌర్ణమి. అదే 'వ్యాస పౌర్ణమి'గా, 'గురు పౌర్ణమి'గా ప్రసిద్ధికెక్కింది. వేద, పురాణ, ఉపపురాణ, బ్రహ్మసూత్రాల ద్వారా... మానవాళికి జ్ఞాన, భక్తి, కర్మ మార్గాలను వ్యాసుడు ఉపదేశించాడు. ఆయనను, ఆ పరంపరలోని సద్గురువులను స్మరించుకోవడం మన విధి. గురు పరంపరకు ఎంతో విశిష్టత ఉంది. సద్గురువు ఒక పరంపరకు చెందినవాడై ఉండాలి. ఆయన అధ్యయనం చేసి, అనుష్ఠించి, తన అనుభవంలోకి తెచ్చుకొని, దాన్ని శిష్యులకు బోధించాలి. "గురువే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు. అవ్యక్త పరబ్రహ్మం. నారాయణుడైనా, సదాశివుడైనా అతడే. 'నీ గురువు ఎవరు?' అని ప్రశ్నించుకుంటూ పోతే 'పరబ్రహ్మ' అనే సమాధానం వస్తుంది" అని శౌనకాది మహర్షులకు సూతుడు చెప్పిన సమాధానం 'గురుగీత' తొలి అధ్యాయంలో ఉంది.

"నేను చెప్పేది విను అని శిష్యుడితో సద్గురువు అనడు.



నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 | హైదరాబాద్ | శనివారం | 05 | జులై | 2025

# రైలు ఇంజిన్‌లో మంటలు.. తప్పిన పెను ప్రమాదం



**మైసూర్-నవభూమి:** దేశంలో ఘోర రైలు ప్రమాదం తప్పింది. కర్ణాటకలోని మైసూర్ నుంచి బెంగళూరు మీదుగా ఉదయ్‌పూర్ వెళ్తున్న హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన రైల్వే సిబ్బంది సత్వర చర్యల వల్ల పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు మైసూర్ నుంచి ఉదయ్‌పూర్‌కు వెళ్తోంది. గురువారం ఉదయం 11:20 గంటల సమయంలో రైలు కర్ణాటకలోని రామనగర జిల్లాలోగల చన్నపట్న తాలూకా వద్దకు రాగానే ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి వెంటనే అప్రమత్తమైన రైల్వే సిబ్బంది రైలును ఆపి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే చన్నపట్న నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. ఈ ఘటనతో రైలును దాదాపు 30 నిమిషాల పాటూ నిలిపివేయాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రత్యామ్నాయ ఇంజిన్ ఏర్పాటు చేయడంతో.. తిరిగి రైలు తన ప్రయాణాన్ని కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని రైల్వే సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగానే ప్రమాదం సంభవించి ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు ఇంజిన్‌లో మంటలు రావడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## కాలేజ్ వ్యాన్‌కోసం పరిగెడుతున్న బాలుడిని ఢీకొన్న బస్సు..




**బెంగళూరు-నవభూమి:** కర్ణాటక రాజధాని బెంగళూరులో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కాలేజ్ బస్సు కోసం పరిగెడుతున్న 17 ఏళ్ల బాలుడిని ఆర్టీసీ బస్సు వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి.ఇంటర్ సెకెండ్ ఇయర్ చదువుతున్న 17 ఏళ్ల బాలుడు బుధవారం ఉదయం రోడ్డుపైకి వచ్చాడు. ఎదురుగా తను ఎక్కాల్సిన కళాశాల బస్సు వెళ్తుండటం గమనించాడు. దీంతో రోడ్డు ఇరువైపులా వాహనాలను చూసుకోకుండా పరిగెత్తాడు. ఇంతలో ఆర్టీసీ బస్సు వచ్చి బాలుడిని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సదరు బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు స్పందించి అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. విద్యార్థి అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించిన షాకింగ్ వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## నీట్ యూజీ 2025 ఫలితాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్ కొట్టివేసిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** నీట్ యూజీ-2025 ఫలితాలను మళ్లీ రిలీజ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఓ ప్రశ్నలో తప్పు తలెత్తిన నేపథ్యంలో ఆ ఫలితాలను మళ్లీ ప్రచురించాలని కోరుతూ పిటీషన్ దాఖలైంది. జస్టిస్ పీఎస్ నర్సింహా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటీషన్‌పై తీర్పునిచ్చింది. రెండు రోజుల క్రితమే ఇలాంటి పిటీషన్‌ను తిర్కసరించినట్లు ధర్మాసనం తెలిపింది. వ్యక్తిగత పరీక్షలతో డీల్ చేయలేదని కోర్టు చెప్పింది. మల్టిపుల్ కరెక్ట్ ఆన్సర్లు ఉన్న విషయాన్ని అంగీకరిస్తామని, కానీ లక్షల మంది రాసిన పరీక్షల్లో జోక్యం చేసుకోలేమని, ఇదేమీ వ్యక్తిగ కేసు కాదు అని, వేల మంది విద్యార్థులు దీని వల్ల ప్రభావానికి గురయ్యే అవకాశం ఉన్నట్లు సుప్రీంకోర్టు చెప్పింది.నీట్ యూజీ పరీక్ష పత్రంలో తప్పుడు ప్రశ్న వచ్చిందని, ఆ తప్పును సరి చేసి, మళ్లీ ఫలితాలను రిలీజ్ చేయాలని కొందరు అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కౌన్సింగ్ ప్రక్రియను ఆపేందుకు స్టే ఇవ్వాలంటూ కోర్టును కోరారు. నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ ప్రవేశ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## 21 నుంచి రాజ్యసభ 268వ సెషన్



**న్యూదిల్లీ-నవభూమి:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా జూలై 21 నుంచి రాజ్యసభ 268వ సెషన్ ప్రారంభం కానుంది. శుక్రవారం అధికారిక పార్లమెంటరీ బులెటిన్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు సభ్యులకు సమాచారం పంపించారు. రాజ్యసభ షెడ్యూల్, బిజినెస్ డేస్‌కు సంబంధించిన వివరాలను సభ్యులకు తెలియజేశారు.జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు రాజ్యసభ సెషన్ కొనసాగనుంది. అయితే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకుల కోసం సభను ఆగస్టు 12న వాయిదా వేయనున్నారు. ఆగస్టు 18న సెషన్ పునఃప్రారంభం కానుంది. ఎప్పటిలాగే ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

## సీజేఐ బీఆర్ గవాయ్‌ని సన్మానించనున్న మహారాష్ట్ర చట్టసభ్యులు



**ముంబై-నవభూమి:** భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌ని మహారాష్ట్ర చట్టసభ్యులు సన్మానించనున్నారు. ఈ నెల 8న మహారాష్ట్ర విధాన్ భవన్‌లోని సెంట్రల్ హాల్‌లో సన్మాన కార్యక్రమం జరగనుంది. జస్టిస్ బీఆర్ గవాయ్ భారత న్యాయవ్యవస్థలోనే అత్యున్నత పదవిని అధిరోహించి మహారాష్ట్రకు గర్వకారణంగా నిలువడంతో ఆయనను ఘనంగా సన్మానించాలని ఆ రాష్ట్ర చట్టసభ్యులు నిర్ణయించారు.
ఈ విషయాన్ని మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్ సభాముఖంగా ప్రకటించారు. జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ఈ ఏడాది మే 14న భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేశారు. దాంతో ఆయన భారతదేశపు రెండో దళిత ప్రధాన న్యాయమూర్తిగా గుర్తింపు పొందారు. ఆయన కంటే ముందు 2007లో జస్టిస్ కేజీ బాలకృష్ణన్ సీజేఐగా బాధ్యతలు నిర్వహించారు. ఆయన భారత తొలి దళిత సీజేఐగా చరిత్రికెక్కారు.

## మీ తాతగారిలా మీది కంప్యూటర్ మైండ్..

**చెన్నై-నవభూమి:** ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తన తాత, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధిలాగే చురుకైన నేత అని, జ్ఞాపకశక్తి కూడా అధికమని సీనియర్ మంత్రి దురైమురుగన్ ప్రశంసించారు. వేలూరు జిల్లా కాట్పాడి(లో జరిగిన పార్టీ నాయకుడి ఇంటి వివాహ వేడుకల్లో ఇద్దరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఉదయనిధి ప్రసంగిస్తూ.. తన రాజకీయ జీవితానికి పునాది వేసింది కాట్పాడి ప్రాంతమేనని,డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ జన్మించిన భూమి ఇదేనని, అంతటి కీర్తిగడించిన కాట్పాడిలో జరిగిన వివాహవేడుకకు హాజరుకావడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పుడు మొదట ఆశీర్వదించింది దురైమురుగన్ అని, అప్పటిదాకా శాసనసభలో వెనుకవరుసలో కూర్చున్న తాను ఆయన పక్కనే కూర్చున్నానని తెలిపారు.దురైమురుగన్ సలహాలను కూడా పాటిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత దురైమురుగన్ మాట్లాడుతూ ఉదయనిధిని ప్రశంసలవర్షంలో ముంచెత్తారు. కాట్పాడిలో తన కుమారుడు కదిర్ ఆనంద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు ప్రచారం చేసినట్లు ఉదయనిధి గుర్తు చేశారని,ఆ విషయం తాను పూర్తిగా మరచిపోయానన్నారు.అయితే ఆయన మరచిపోకుండా ఆ పాత సంగతులను గుర్తు చేయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఉదయనిధి పార్టీపై పట్టుకలిగి ఉండటానికి ఆయన జ్ఞాపకశక్తే కారణమని, పార్టీలో అందరిని గుర్తుంచుకుని కలుగోపుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

# 'రాధగా మారిన రాధాకృష్ణ'



**షాజాపూర్-నవభూమి:** క్రైమ్ థ్రిల్లర్ స్టోరీలను ఎక్కువగా ఇష్టపడే వారందరికీ తిట్టమ్ ఇరండు సినిమా తెలిసే ఉంటుంది. ముఖ్యంగా ఐశ్వర్యా రాజేశ్ పోలీస్ ఆఫీసర్‌గా నటించి.. తన స్నేహితురాలి జాడ ఏమైందో తెలుసుకునే కథనే ఈ సినిమా. అయితే చివరకు తన ప్రియుడే తన చిన్ననాటి స్నేహితురాలు అని తెలుసుకుని ఐశ్వర్య షాక్ అవుతుంది. తనకోసమే లింగ మార్పిడి చేయించుకుందని తెలిసి ఏం చేయాలో తెలియక మౌనంగా ఉండిపోతుంది. అచ్చంగా అలాంటి కథే మధ్య ప్రదేశ్‌లో మళ్లీ రిపీట్ అయ్యింది. అయితే సినిమాలో అమ్మాయి లింగ మార్పిడి చేయించుకుంటే నిజ జీవితంలో మాత్రం ఓ అబ్బాయి లింగ మార్పిడి చేయించుకున్నాడు. తన స్నేహితుడిని పెళ్లాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాడు. మరి చివరకు ఏమైందంటే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని షాజాపూర్ జిల్లా నర్మదాపురంలో ఈ ఘటన చోటుచేసుకుంది. రాధాకృష్ణ (పేరు మార్చాం) అనే 25 ఏళ్ల యువకుడు గత 10 సంవత్సరాలుగా రమేష్ (పేరు మార్చాం) అనే మరో యువకుడితో స్వలింగ సంపర్కం చేస్తున్నాడు. వీరిద్దరూ ఒకే గదిలో కలిసుంటూ.. శారీరకంగా, మానసికంగా దగ్గరయ్యారు. అయితే మొదటి నుంచి ఒకరంటే ఒకరికి వల్లమాలిన ప్రేమ ఉండగా.. వీరిద్దరూ పెళ్లి కూడా చేసుకోవాలని నిర్ణయించుకున్నారు."నువ్వు అమ్మాయిగా మారితేనే పెళ్లి చేసుకుంటాను" అని రమేష్ షరతు పెట్టాడు. తన ప్రేమని నిజం చేసుకోవాలని, తన భాగస్వామితో జీవితాన్ని పంచుకోవాలని ఆశపడిన రాధాకృష్ణ... తీవ్రమైన మానసిక సంఘర్షణ తర్వాత లింగమార్పిడి చేయించుకోవాలని నిర్ణయించుకున్నాడు.గతేడాది ముంబైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి మరీ లింగమార్పిడి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. సుదీర్ఘమైన, బాధాకరమైన ఆపరేషన్ల తర్వాత రాధాకృష్ణ కాస్త రాధగా (అమ్మాయిగా) మారాడు. ఈ క్రమంలో తీవ్ర ఆర్థిక సమస్యలు, శారీరక నొప్పితో పాటు మానసిక వేదనను కూడా భరించాడు. శస్త్రచికిత్స విజయవంతం కావడంతో.. పూర్తి అమ్మాయిగా మారిన రాధాకృష్ణ ప్రియుడి వద్దకు వెళ్లాడు. తమ కలలు సాకారమయ్యాయని, త్వరలోనే పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభిద్దామని చెప్పాడు.కానీ రాధగా మారిన రాధాకృష్ణ ఆశలను అడియాశలు చేస్తూ.. పెళ్లికి నిరాకరించాడు ప్రియుడు. లింగమార్పిడి ప్రక్రియ మొత్తం పూర్తైన తర్వాత స్త్రీగా మారిన రాధాకృష్ణను పెళ్లి చేసుకోవడానికి నిరాకరించాడు. అంతేకాకుండా ఆమెను తన ఇంటికి వెళ్లిపోమని చెబుతూ.. శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన రాధ.. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పింది. దీంతో రాధను అపహరించిన రమేశ్.. అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాలన్నింటినీ నేరుగా సదరు ట్రాన్స్‌జెండరే పోలీసుల ఫిర్యాదులో వివరించింది.బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి ఇచ్చిన వివరాల ఆధారంగా.. ఆమె ప్రియుడిని పట్టుకుని, కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు. ప్రేమ పేరుతో ఒక వ్యక్తి జీవితాన్ని నాశనం చేసిన ఈ ఘటనపై స్థానికంగా తీవ్ర చర్చ జరుగుతోంది. లింగమార్పిడి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించాలనుకున్న రాధ కలలు కల్లలవడంతో ఆమె కుటుంబ సభ్యులు, స్నేహితులు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆ 45 సెకెన్లే మా తలరాతను నిర్ణయించింది..

### భారత్ బ్రహ్మోస్ దాడిపై పాక్ సంచలన వ్యాఖ్యలు




**న్యూఢిల్లీ-నవభూమి:**పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్‌పై పాకిస్థాన్ ప్రధాన మంత్రి సలహాదారు రాణా సనావుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. బ్రహ్మోస్ క్షిపణులతో పాకిస్థాన్‌పై భారత్ దాడి చేసిన సమయంలో తాము అణు యుద్ధం అంచుకు వెళ్లామని రాణా సనావుల్లా వ్యాఖ్యానించారు. బ్రహ్మోస్ క్షిపణి అణ్వాయుధాలను మోసుకొస్తుందో లేదో తెలుసుకోవడానికి తమకు తక్కువ సమయం మాత్రమే దొరికిందని ఆయన అన్నారు. ఒకవేళ పొరపాటు జరిగి ఉంటే, అది ప్రపంచ అణుయుద్ధానికి దారితీసేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.పసిడి ప్రియులకు అలర్ట్.. వరుసగా తగ్గి మళ్లీ షాకిస్తున్న బంగారం **ధరలు.. తులం ఎంతంటే?**
ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో పర్యాటకులపై దాడిచేసిన ఉగ్రవాదులు 26 మంది ప్రాణాలు తీశారు. దీనికి ప్రతిగా భారత్ మే 7న ' ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద శిబిరాలపై మెరుపు దాడులు నిర్వహించి, ధ్వంసం చేసింది. దీనికి రగిలిపోయిన పాకిస్థాన్.. భారత సరిహద్దుల్లో పౌరుల నివాసాలు, సైనిక స్థావరాలపై దాడుల కు ప్రయత్నించింది. ఈ దాడులకు సమర్థంగా అడ్డుకుని భారత సైన్యం.. తిప్పికొట్టింది. అనంతరం పాక్ వైమానిక స్థావరాలపై దాడులు చేసి, రన్‌వేలు, హ్యాంగర్లను ధ్వంసం చేసింది.భారత్ దాడి చేసినప్పుడు తమకు చాలా తక్కువ సమయం మాత్రమే ఉందని సనావుల్లా చెప్పారు. "భారత్ నూర్ ఖాన్ ఎయిర్‌బేస్‌పై బ్రహ్మోస్ క్షిపణిని ప్రయోగించినప్పుడు, దాన్ని విశ్లేషించడానికి మా సైన్యానికి కేవలం 30-45 సెకన్ల సమయం ఉంది. అంత తక్కువ సమయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవడమైనా అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. ఒకవేళ మా వైపు వారు పొరపాటుగా అర్థం చేసుకుని ఉంటే, అది ప్రపంచ అణుయుద్ధానికి దారితీసేది' అని సనావుల్లా వివరించారు. అంటే, క్షిపణిని చూసి అది ఏమిటో తెలుసుకునేందుకు వారికి దాదాపు అర నిమిషం కూడా లేదు.
నూర్ ఖాన్ ఎయిర్‌బేస్ పాకిస్థాన్ వైమానిక దళానికి చాలా ముఖ్యమైన స్థావరం. ఇది రావల్పిండిలోని చక్లాలాలో ఉంది. భారత్ దాడుల తర్వాత పాకిస్థాన్ సైన్యం కూడా డ్రోన్లు, క్షిపణులతో ప్రతిదాడి చేసింది. కానీ, భారత రక్షణ వ్యవస్థలు వాటిని అడ్డుకున్నాయి. ఆ తర్వాత భారత్ పాకిస్థాన్ భూభాగంలోని సైనిక లక్ష్యాలను ధ్వంసం చేసింది. నాలుగు రోజుల పాటు ఇరు దేశాల మధ్య కొనసాగిన ఘర్షణలు.. మే 10న జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టాయి. తాజాగా, సనావుల్లా చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. అప్పట్లో పరిస్థితులు ఎంత తీవ్రంగా ఉండేవో ఆయన మాటల్లో తెలుస్తోంది.

## ఈ చిన్న ద్వీపదేశంలో 45 శాతం మంది భారత సంతతి



**న్యూఢిల్లీ-నవభూమి:**180 ఏళ్ల కిందట కొంత మంది పేదలను భారత్ నుంచి ఓ ద్వీప దేశానికి తరలించారు. అక్కడి చెరుకు తోటల్లో వారు కూలీలుగా పనిచేశారు. వారిలో కొందరు అక్కడే స్థిరపడ్డారు. ఇప్పుడు వారి సంతతి ఆ దేశ జనాభాలో 45 శాతం ఉంది. అంతేకాదు.. ఆ దేశ ప్రధాని, రాష్ట్రపతి సహా దేశంలోని చాలా మంది ప్రముఖులు భారత సంతతికి చెందినవారే. ఇక్కడ పుట్టినవారిలో వెస్టిండీస్ క్రికెట్ జట్టుతో పాటు భారత జట్టుకు కూడా ఆడిన వారున్నారు. ఆ ద్వీపదేశమే.. కరీబియన్‌లోని ట్రినిడాడ్ అండ్ టొబాగో భారత ప్రధాని నరేంద్ర మోదీ 2 రోజుల పర్యటన నిమిత్తం ఇక్కడికి చేరుకున్నారు. ఒక భారత ప్రధాని ఈ ద్వీపదేశంలో అడుగుపెట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ నేపథ్యంలో ట్రినిడాడ్ అండ్ టొబాగోకు సంబంధించిన ఆసక్తికర వివరాలు..2011 జనాభా లెక్కల ప్రకారం.. ట్రినిడాడ్ అండ్ టొబాగో జనాభాలో భారత సంతతి ప్రజలు 4,68,524 మంది ఉన్నారు. ట్రినిడాడ్ అండ్ టొబాగో మొత్తం జనాభా 1.36 మిలియన్లు కాగా.. వీరిలో సుమారు 40 - 45 శాతం మంది భారత సంతతి వారే. ఈ సంఖ్య ఇప్పుడు మరింత పెరిగినట్లు వివిధ గణాంకాలు చెబుతున్నాయి. భారత్ నుంచి మొట్టమొదటిసారిగా 1845 మే 30న కొంత మంది కార్మికులు ట్రినిడాడ్ అండ్ టొబాగోకు వచ్చారు. బ్రిటన్‌లో నాటి పాలకులు బానిసత్వాన్ని రద్దు చేసిన తర్వాత.. భారత్‌లోని బ్రిటీష్ పాలకులు కొంత మంది భారతీయులను ఒప్పంద కార్మికులుగా ఇక్కడికి తరలించారు. అక్కడ బ్రిటిషర్లకు చెందిన చెరకు తోటల్లో పనిచేసేందుకు వీరిని తీసుకెళ్లారు. 1845 నుంచి 1917 వరకు భారత్ నుంచి సుమారు 1,40,000 మంది ఒప్పంద కార్మికులుగా ట్రినిడాడ్‌కు వచ్చారు. వీరి వారసులు ఇప్పుడు ఆ దేశంలో అతిపెద్ద సమూహంగా ఉన్నారు.ఆ సమయంలో భారత్‌లో తీవ్రమైన కరువు, క్షామం, పేదరికం నెలకొనడంతో పొట్టకూటి కోసం కొంత మంది భారతీయులు తమ భవిష్యత్తు ఏమవుతుందోననే ఆందోళన మధ్య కూడా ట్రినిడాడ్‌కు వెళ్లారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌లోని పలు ప్రాంతాల నుంచి ఎక్కువ మంది వెళ్లారు. నాటి మద్రాస్ రాష్ట్రం నుంచి కూడా కొంత మంది ట్రినిడాడ్‌కు వెళ్లారు. వీరిలో కొంత మంది తెలుగు వారున్నారు.వలస వెళ్లిన కార్మికులు ఒక ఒప్పందంపై సంతకం చేయాల్సి వచ్చేది. సాధారణంగా ఈ ఒప్పందం 5 ఏళ్ల కాలానికి ఉండేది. ఈ సమయంలో వారు చక్కెర, కోకో తోటలలో పనిచేయాలి. ఆ తర్వాత వారికి 1) తిరిగి భారతదేశానికి వెళ్లే అవకాశం లేదా 2) అక్కడ స్థిరపడటానికి కొంత భూమి అనే రెండు ఆప్షన్లు లభించేది.అయితే, ఆచరణలో పరిస్థితులు చాలా దారుణంగా ఉండేవి. వేతనాలు తక్కువగా ఉండేవి. పని గంటలు ఎక్కువగా ఉండేవి. తోటలలో కార్మికుల జీవితం బానిసత్వానికి దగ్గరగా ఉండేది. చాలా మంది అక్కడ నుంచి తిరిగి రాలేకపోయారు. ట్రినిడాడ్ అండ్ టొబాగోతో పాటు మారిషస్, ఫిజి, గయానా, సురినామ్, దక్షిణాఫ్రికా లాంటి దేశాల్లో బ్రిటీష్ కాలనీలకు భారత్ నుంచి చాలా మంది వలస వెళ్లారు. ప్రపంచంలోనే అతిపెద్ద వలసల్లో ఇది ఒకటిగా నిలిచింది.
చైనా మహిళలతో పెళ్లి.. భిన్నమైన వారసత్వం
భారత్ తర్వాత అత్యధికంగా చైనా నుంచి ఎక్కువ మంది ట్రినిడాడ్‌కు వలస వెళ్లారు. భారత్, చైనా సంతతికి చెందినవారితో పాటు ఆఫ్రికన్లు, యూరోపియన్లు, కరీబియన్ దీవులకు చెందిన పలు జాతుల వారు ట్రినిడాడ్ అండ్ టొబాగోలో స్థిరపడ్డారు. భారత సంతతికి చెందిన పురుషులు చైనా మహిళలను, ఆఫ్రికన్ మహిళలను వివాహం చేసుకున్నారు. వీరికి పుట్టిన సంతానం ఎక్కువ శాతం భారత్‌కు చెందిన లక్షణాలున్నా.. కాస్త వైవిధ్యంగా కనిపిస్తారు.ట్రినిడాడ్ అండ్ టొబాగోలో స్థిరపడిన ప్రజలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తున్నారు. దీపావళి, దసరా, వినాయక చవితి, శ్రీకృష్ణాష్టమితో పాటు ఛత్ పూజ, మహా శివరాత్రి లాంటి పండగలను ఘనంగా నిర్వహించుకుంటారు. ముఖ్యంగా దీపావళి పండగ వేళ ఇక్కడ సందడి ఉంటుంది. ఇక్కడి హిందూ ప్రజలు హిందీ, భోజ్‌పురి భాషలకు చెందిన మాండలికాల్లో మాట్లాడుతారు. ఇక భారతీయులు ఇక్కడ అడుగుపెట్టిన రోజును ఏటా ఘనంగా నిర్వహించుకుంటారు.ట్రినిడాడ్ అండ్ టొబాగోలో ఆర్య సమాజ్, చిన్మయా మిషన్, సత్య సాయి బాబా గ్రూపు, ఇస్కాన్, రామకృష్ణ మఠం, ప్రార్థనా సమాజ్, సనాతన ధర్మ మహాసభ లాంటి హిందూ సంస్థలు తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఇక్కడ 150 వరకు హిందూ దేవాలయాలు ఉన్నాయి. కరపిచైమాలోని అతిపెద్ద కార్యసిద్ధి హనుమాన్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.
ముస్లిం జనాభా ఎక్కువే..ట్రినిడాడ్ అండ్ టొబాగోలో హిందువుల (49%) తర్వాత అతిపెద్ద సమూహంగా ముస్లింలు (11.64) ఉన్నారు. ఆ తర్వాత రోమన్ క్యాథలిక్ వర్గానికి చెందిన వారు ఉన్నారు. మతపరమైన ఆచారాలతో పాటు సంగీతం, నృత్యంలోనూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పోలికలు ఉన్నాయి.ట్రినిడాడియన్ సమాజంలో, ముఖ్యంగా ఆహారం, వంటకాలకు సంబంధించిన అనేక హిందీ పదాలు స్థానిక భాషలో కలిసిపోయాయి. ఉదాహరణకు.. 'రోటీ 'కచౌరి 'డబుల్స్ 'సాహేనా 'అంచర్ 'ఫలోరి లాంటి పదాలు అక్కడ వాడుకలో ఉన్నాయి. ఇక్కడి ప్రజల్లో భారతీయ మూలాలున్న పేర్లు, హిందీ పేర్లు కనిపిస్తాయి. హిందీ నుంచి ఉద్భవించిన 'కరీబియన్ హిందుస్తానీ' అనే ఒక మాండలికం కూడా ఇక్కడ వాడుకలో ఉంది.ట్రినిడాడ్ అండ్ టొబాగోలో భారత సంతతి ప్రజలు రాజకీయంగా, సామాజికంగా చాలా శక్తివంతమైన సమూహంగా ఉన్నారు. దేశ అధ్యక్షురాలు క్రిస్టీన్ కార్లా కంగాలూ, ప్రధాన మంత్రి కమ్లా పెర్సాద్-బిస్సేసర్.. ఈ ఇరువురూ భారత సంతతికి చెందిన మహిళలే. దేశ పాలనా వ్యవస్థలో భారత సంతతి తెగ ప్రభావం ఉందో.. దీన్ని బట్టే అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి వారసత్వం నుంచి వచ్చిన నాయకత్వం ఉండటం వల్లే ట్రినిడాడ్ అండ్ టొబాగో.. భారత్‌తో సత్సంబంధాలను కోరుకుంటోంది.ఇక రాజకీయాల్లోనే కాకుండా విద్య, వ్యాపారం, వైద్యం తదితర రంగాల్లోనూ భారత సంతతి ప్రజలు గణనీయమైన పాత్ర పోషిస్తారు. పార్లమెంటు సభ్యులుగా, మంత్రులుగా, న్యాయమూర్తులుగా భారత సంతతి వ్యక్తులు ఉన్నారు.

**ప్రధాని మోదీకి సొహారీ ఆకులో సంప్రదాయ భోజనం**

ప్రధాని మోదీకి సొహారీ ఆకులో సంప్రదాయ భోజనం:భారత ప్రధాని నరేంద్ర మోదీ గౌరవార్థం ట్రినిడాడ్ అండ్ టొబాగో ప్రధాన మంత్రి ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో సొహారీ ఆకులో సంప్రదాయంగా భోజనాన్ని వడ్డించారు.1962లో ట్రినిడాడ్ అండ్ టొబాగో స్వాతంత్ర్యం పొందిన తర్వాత దౌత్య సంబంధాలను ప్రారంభించిన తొలి దేశాల్లో భారత్ ఒకటి. భారతదేశం, ట్రినిడాడ్ అండ్ టొబాగో మధ్య బలమైన దౌత్య, ఆర్థిక సంబంధాలు ఉన్నాయి.

## కొల్హాపురి చెప్పుల ప్రదర్శనతో చిక్కుల్లో పడ్డ ప్రాడా..


### బాంబే హైకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు



**ఇటలీ-నవభూమి:** చెందిన లగ్జరీ బ్రాండ్ ప్రాడాచిక్కుల్లో పడింది. ఇటీవలే ఆ సంస్థ ప్రదర్శించిన చెప్పులు, వాటి ధరలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. స్ప్రింగ్ సమ్మర్ 2026లో భాగంగా ప్రాడా పురుషులకు చెందిన పాదరక్షలను ప్రదర్శించింది. ఇవి అచ్చం భారత్‌లోని కొల్హాపురిలో తయారైన చెప్పులు లాగానే ఉన్నాయి. దీనిపై పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. పలువురు ప్రముఖులు సైతం ప్రాడాపై మండిపడ్డారు. గ్లోబల్ బ్రాండ్లు మన సంస్కృతిని సొమ్ము చేసుకుంటున్నాయంటూ ప్రముఖ పారిశ్రామిక వేత్త హర్ష్ గోయెంక సైతం మండిపడ్డారు. దీంతో చివరికి ప్రాడా తన తప్పును అంగీకరించినప్పటికీ వివాదం మాత్రం ఆగడం లేదు.ఈ వివాదం నేపథ్యంలో ప్రాడాపై న్యాయవాది గణేష్ హింగ్‌మైర్ కోర్టుకెక్కారు. కొల్హాపురి చేతివృత్తుల వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాంబే హైకోర్టు లో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. 'కొల్హాపురి చెప్పులు మహారాష్ట్ర సాంస్కృతిక చిహ్నం. వాటికి ప్రత్యేక గుర్తింపు ఉంది. వాటిని ప్రాడా కాపీ కొట్టింది. మన సంస్కృతిని సొమ్ము చేసుకుంటోంది. దీనిపై వ్యతిరేకత వ్యక్తమవగా.. బ్రాండ్ తన తప్పును అంగీకరించింది. అయితే, అధికారికంగా ఎలాంటి క్షమాపణలూ చెప్పలేదు. నష్టపరిహారం కూడా ప్రకటించలేదు.తాము ప్రదర్శించిన చెప్పులు భారతీయ కళాకారుల నుంచి ప్రేరణ పొందినవని మాత్రమే ప్రకటించింది. విమర్శలను తిప్పికొట్టే ప్రయత్నంలో భాగంగానే ఆ ప్రకటన చేసింది తప్ప.. కళాకారులు, భారత ప్రజలు, ప్రభుత్వానికి క్షమాపణలు చెప్పలేదు' అని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతర్జాతీయ కంపెనీలు భారతీయ ఉత్పత్తులను కాపీ కొట్టకుండా, అనుకరించకుండా నిరోధించాలని కోరారు. చెప్పులే కాకుండా ఇతర భారతీయ సంప్రదాయ డిజైన్లను కాపీ కొట్టినందుకు ప్రాడాపై విమర్శలు చేశారు. కొల్హాపురి చేతివృత్తుల వారికి తగిన పరిహారం చెల్లించేలా ప్రాడాపై చర్యలు తీసుకోవాలని తన పిటిషన్‌లో కోరారు.ప్రాడా స్ప్రింగ్ సమ్మర్ 2026లో భాగంగా ప్రాడా పురుషులకు చెందిన పాదరక్షలను ఇటీవలే ప్రదర్శించింది. ఇవి అచ్చం భారత్‌లోని కొల్హాపురిలో తయారైన చెప్పులు లాగానే ఉన్నాయి. అయితే, వాటి ధర మాత్రం చర్చకు దారితీస్తోంది. సేమ్ డిజైన్‌తో అలాంటి చెప్పులు మన వద్ద రూ.400 వరకు ఉంటాయి. కానీ ప్రాడా మాత్రం ఆ చెప్పుల ధరను ఏకంగా రూ.1.2లక్షలుగా పేర్కొంది. ఈ వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఏంటీ.. ఈ చెప్పులు అంత ఖరీదా అంటూ చర్చించుకుంటున్నారు. ప్రాడాపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. మహారాష్ట్రలోని కొల్హాపురి చేతివృత్తులకు ప్రసిద్ధి. అక్కడ తోలుతో తయారు చేసే చెప్పులు 12వ శతాబ్దానికి చెందినవి. 2019లో ఇవి భౌగోళికంగా గుర్తింపు పొందాయి.

## రూ.5 లక్షల కోసం దారుణం..

### అప్పుకట్టమన్నందుకు బంధువు ఇంటికి నిప్పంటించిన వ్యక్తి



**బెంగళూరు-నవభూమి:** కర్ణాటకలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తీసుకున్న అప్పు కట్టమని అడిగినందుకు బంధువు ఇంటికి ఓ వ్యక్తి నిప్పంటించాడు ఈ ఘటన బెంగళూరు లో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. వెంకటరమణి అనే మహిళ తన ఇద్దరు కుమారులు సతీశ్, మోహన్‌దాస్‌లతో కలిసి బెంగళూరు నగరంలోని వివేక్‌నగర్ లో నివాసం ఉంటోంది. ఏడేళ్ల కిందట బంధువైన పార్వతి తన కుమార్తె వివాహం కోసం వెంకటరమణి వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకుంది. అయితే, ఆ అప్పు ఇప్పటి వరకూ కట్టలేదు. ఎన్నిసార్లు అడిగా.. అప్పు తీర్చలేదు. ఇటీవలే ఓ వివాహ కార్యక్రమంలో పార్వతిని అప్పు కట్టమని వెంకటరమణి మరోసారి అడిగింది. ఈ క్రమంలో అక్కడ రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఈ క్రమంలోనే జులై 1వ తేదీ సాయంత్రం 5:30 గంటల సమయంలో సుబ్రహ్మణి అనే వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో వెంకటరమణి ఇంటికి వెళ్లాడు. అక్కడ మెయిన్ డోర్, చెప్పుల స్టాండ్, కిటికీలకు పెట్రోల్‌పోసి నిప్పంటించి అక్కడినుంచి వెళ్లిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే మంటలు ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఇంటి ముందు భాగం, కిటికీలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో సతీశ్ ఇంట్లో లేడు. విషయం తెలుసుకున్న అతడు హుటాహుటిని ఇంటికి చేరుకున్నాడు. ఈ ఘటనపై వివేక్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్‌ని పరిశీలించగా.. సుబ్రహ్మణి ఇంటికి నిప్పంటిస్తున్నట్లు స్పష్టంగా కనిపించింది. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేపట్టారు.



## ఈ ఆసనాలతో బీపీ నియంత్రణ

**శవాసనం:** ఈ ఆసనం ఒత్తిడిని తగ్గించి, ప్రశాంతతను పెంచుతుంది. దాంతో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఈ ఆసనంతో మెదడు పనితీరు కూడా మెరుగుపడి జ్ఞాపకశక్తి పెరుగుతుంది.ముందుగా నేలమీద వెల్లికిలా పడుకుని కాళ్లను దూరంగా చాచాలి. రెండు చేతులను కూడా శరీరానికి దూరంగా చాపాలి. వెన్నెముక నిటారుగా ఉండేలా చూసుకోవాలి. కళ్లు మూసుకుని శ్వాసమీద మనసు నిమగ్నం చేయాలి. అయిదు నుంచి పది నిమిషాల తరువాత మామూలు స్థితికి రావాలి.ఉత్తానాసనం: ఈ ఆసనం మెదడుకు రక్త ప్రసరణ బాగా జరిగేలా దోహదం చేస్తుంది. ఒత్తిడిని తగ్గించడంలోనూ సహాయపడుతుంది. దాంతో రక్తపోటు తగ్గుతుంది.నేలమీద నిటారుగా నిల్చోవాలి. ముందుకు వంగి తలను పాదాల వరకు తీసుకురావాలి. ఈ క్రమంలో కాళ్లు నిటారుగా ఉండేలా చూసుకోవాలి. నిమిషం నుంచి రెండు మూడు నిమిషాల తరువాత మెల్లిగా సాధారణ స్థితిలోకి వచ్చేయాలి.భుజంగాసనం: ఇది మెదడుతో పాటు శరీరం మొత్తానికీ రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని సమర్థంగా నిర్వహించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది.ముందుగా నేలపై బోర్లా పడుకోవాలి. అరచేతులను నేలకు ఆనించి వాటి ఆధారంతో మెడ, నడుము పైభాగాన్ని ఎత్తాలి. నడుము కింద భాగం మాత్రమే నేలకు ఆనాలి. ఇలా 20–30 సెకన్ల పాటు ఉండి నెమ్మదిగా మామూలు స్థితికి రావాలి.



# పసి ప్రాణాలే ప్రధానంగా..



**పసికందులకు ఎన్ఐసియు వైద్యం అందించలేని పేదలకు ఆర్థికంగా సహాయపడుతూ, ప్రాథమిక వైద్య అవసరతలను తీరుస్తూ అవసరార్థులను ఆదుకుంటోంది హైదరాబాద్‌కు చెందిన పిల్లల వైద్యురాలు డాక్టర్ నిటాషా బగ్గా. 'ఎక్స్‌ట్రామైల్' ఎన్‌జివోను స్థాపించి నిధులను సేకరించడంతో పాటు, తాజాగా ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఒక వినూత్న ప్రయత్నానికి కూడా పూనుకున్నారామె. ఆ వివరాలను ఇలా పంచుకున్నారు.**

పిల్లల వైద్యురాలినీ, న్యూబోర్న్ స్పెషలిస్టను కాబట్టి పసికందులకు మెరుగైన వైద్యం అందించే స్థోమత లేక వాళ్లను పోగొట్టుకునే ఎంతో మంది పేదలను నేను చూస్తూ ఉంటాను. మరీముఖ్యంగా ఎన్ఐసియు ఖరీదైన చికిత్స. పసికందుల ప్రాణాలను నిలపడంలో కీలకంగా మారే ఎన్ఐసియు ఖర్చును భరించే స్థోమత పేదలకు ఉండదు. అలాంటి నిస్సహాయ పరిస్థితిలో ఉన్న పేదలను అప్పటికి ఆదుకోగలిగినా, వేర్వేరు ప్రాంతాల్లో, వేర్వేరు ఆస్పత్రుల్లో అదే దుస్థితిని ఎదుర్కొంటున్న పేదల పరిస్థితేమిటి? అనే ఆలోచన నా మనసును తొలిచేయడం మొదలుపెట్టింది. అలాంటి వారి కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో మూడేళ్ల క్రితం ఎక్స్‌ట్రామైల్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. ఎంతోమంది వైద్యులు, స్నేహితులు, సహృదయులు ఈ సంస్థకు ఆర్థిక సహాయాన్ని అందిస్తూ ఉంటారు. మంత్లీ డొనేషన్ చేసేవాళ్లు కూడా ఉన్నారు. ఈ ఎన్‌జీవోకు అందే డబ్బుతో, అప్పుడే పుట్టిన పిల్లలతో పాటు, నెలలు నిండకుండా పుట్టి ఎన్ఐసియులో ఉంచి చికిత్సను అందించే పరిస్థితిలో ఉండి, ఆ చికిత్సకు తగిన ఆర్థిక స్థోమత లేని నిరుపేదలకు ఆర్థిక సహాయం అందిస్తూ ఉంటాం. ప్రస్తుతం మా ఎన్‌జీవో హైదరాబాద్‌లోని అన్ని ఆస్పత్రులతో పాటు భారతదేశమంతటా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రు లతో అనుసంధానమై సేవలందిస్తోంది.

**ప్రిమెథాన్‌తో నిధులను సేకరిస్తూ...**

నిజమైన అవసరార్థులను నిర్ధారించుకోవడం కోసం ప్రతి ఆస్పత్రిలో ఎమ్ఓయులు ఉంటారు. పిల్లల వైద్య పరిస్థితిని డాక్టరు ధృవీకరించిన తర్వాత, ఎమ్ఓయులు మమ్మల్ని నేరుగా సంప్రతించినప్పుడు, పిల్లల చికిత్సకు అవసరమైన నిధులను మేం అందిస్తూ ఉంటాం. అలాగే అవసరంలో ఉన్నవాళ్లు ఎక్స్‌ట్రా మైల్‌ను కూడా నేరుగా సంప్రతించవచ్చు. ఎక్స్‌ట్రామైల్‌తో పాటు మేం ప్రతి ఏడాదీ 'ప్రిమెథాన్' (ప్రిమెచ్యూర్ బేబీ రన్)ను కూడా చేపడుతూ ఉంటాం. ఈ రన్ ద్వారా కూడా నిధులను సేకరిస్తూ ఉంటాం. ప్రతి ఏటా వరల్డ్ న్యూబోర్న్ వీక్ నాడు రన్‌ను చేపడుతూ ఉంటాం. ఈ ఏడాది నవంబరు 17న మూడోసారి ఈ రన్‌ను చేపట్టబోతున్నాం. ఆ రోజున పోగయిన నిధులను సంవత్సరం మొత్తం వినియోగించుకుంటాం! అలాగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యవసర చికిత్సకు ఉపయోగించే పరికరాలు, వెంటిలేటర్ సర్క్యూట్స్, డిస్పోజబుల్ ఐటమ్స్, మందులను కొనుగోలు చేసుకోలేని వారికి కూడా వాటిని అందిస్తూ ఉంటాం. పసికందుల రోజువారీ అవసరాలకు ఉపయోగపడే వస్తువలన్నిటినీ సమకూర్చి పెడతాం!

**నర్సులుగా తీర్చిదిద్దుతూ..**

12వ తరగతి పూర్తి చేసిన అనాథ ఆడపిల్లలకు నర్సింగ్ శిక్షణ ఇచ్చి, వేర్వేరు ఆస్పత్రుల్లోని ఎన్ఐసియుల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ఉంటాం. ఎక్స్‌ట్రా మైల్ చేపట్టిన మరొక ప్రాజెక్టు ఇది. ఈ ప్రాజెక్టు కోసం ఇన్ఫోసిస్ మాకు నిధులను అందిస్తోంది. ఇప్పటికి రెండేళ్లుగా నర్సింగ్ ట్రైనింగ్ అందిస్తున్నాం. ఇప్పటి వరకూ 20 మంది ఆడపిల్లలు నర్సులుగా ఆస్పత్రుల్లో సేవలందిస్తున్నారు. శిక్షణలో భాగంగా ఆడపిల్లలకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో పాటు స్టైఫండ్‌ను కూడా అందిస్తున్నాం. అర్హత పొందిన నర్సులు నేను పనిచేస్తున్న రెయిన్‌బో ఆస్పత్రిలో ఉద్యోగాలు చేసుకోవచ్చు.

నేను ఢిల్లీలో పుట్టి పెరిగాను. చిన్నప్పటి నుంచీ పేదలకు సహాయపడడం అలవాటు. పెళ్లి తర్వాత 2006లో హైదరాబాద్ వచ్చేశాను. ప్రస్తుతం న్యూబోర్న్ స్పెషలిస్ట్‌గా, రెయిన్‌బో ఆస్పత్రిలో పని చేస్తున్నాను. మా వారు డాక్టర్ భూపేష్ బగ్గా, ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. ఎక్స్‌ట్రామైల్ ద్వారా ఇప్పటివరకూ 197 మంది పసికందులకు సహాయపడ్డాం. వీలైనంత ఎక్కువ మంది పిల్లల ప్రాణాలను కాపాడుతూ, భవిష్యత్తులో ఎన్ఐసియు సేవలను బలపరచాలన్నదే నా లక్ష్యం.

**ఆగష్టు 15న ఉచిత భోజనం**

పేద పిల్లలను ఆదుకోవడం కోసం ఎక్స్‌ట్రామైల్‌తో జతకట్టిన హైదరాబాద్‌లోని అకాన్ రెస్టారెంట్ ఒక వినూత్నమైన ఫండ్ రైజింగ్ కార్యక్రమానికి పూనుకుం ది. ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు గంటల వరకూ విచ్చేసే వారికి ఉచిత భోజనాన్ని అందించ బోతోంది. భోంచేసిన వాళ్లు తోచినంత డబ్బును డొనేట్ చేయవచ్చు. అలా సేకరించిన మొత్తాన్నీ అకాన్, ఎక్స్‌ట్రామైల్‌కు అందిస్తుంది.

# పాడిపరిశ్రమతో కొత్త జీవితం



సమాజంలో తమపట్ల ఉన్న చెడు అభిప్రాయాన్ని తుడిచేయాలనుకున్నారు. అందరిలా గౌరవంగా బతకాలనుకున్నారు. అనుకున్నట్టుగానే ఇప్పుడు వారు సొంతంగా పాల కేంద్రాన్ని నిర్వహిస్తూ తమ కాళ్ల మీద తాము నిలబడ్డారు. దేశంలోనే ట్రాన్స్‌జెండర్ మహిళల ఆధ్వర్యంలో నడుస్తున్న మొట్టమొదటి 'మిల్క్ సొసైటీ'ని విజయవంతంగా నడుపుతున్న తమిళనాడుకు చెందిన ట్రాన్స్‌జెండర్ మహిళల పాడి ప్రయాణమిది...తూతుకూడి జిల్లాకు మూడు కిలోమీటర్ల దూరంలోని మంథితోపు గ్రామంలోని డెయిరీ ఫార్మ్ ఇప్పుడు 85 మంది ట్రాన్స్‌జెండర్ మహిళలకు ఇల్లు, బతుకునిచ్చే చోటు. అప్పటిదాకా చేయి చాచి బతికిన వారు ఇప్పుడు తలెత్తుకొని జీవిస్తున్నారు. "జీవితంలో మొదటిసారి మేము అందరితో సమానం అని అనిపిస్తుంది. అవకాశాలు ప్రతి ఒక్కరిలోని నైపుణ్యం, సత్తాను చాటుతాయడానికి మా సహకార సంఘం నిరూపించింది. మాకు వచ్చిన ఈ అవకాశాన్ని రెండు చేతులా అందిపుచ్చుకొని విజయం సాధిస్తాం. ఎన్ని కష్టాలు వచ్చినా సరే ఎదర్కోగలమనే నమ్మకం, ధైర్యం మాకు ఉన్నాయి" అని గర్వంగా చెబుతారు దేశంలోనే ట్రాన్స్‌జెండర్ మహిళల పేరుతో రిజిస్టర్ అయిన మొట్టమొదటి 'మిల్క్ సొసైటీ'కి అధ్యక్షురాలైన భూమిక. కోవిల్ పట్టిలోని మారుమూల గ్రామానికి చెందిన ఆమె ట్రాన్స్‌జెండర్ అన్న కారణంతో ప్రతి సంవత్సరం అయిదారు ఇళు మారాల్సి వచ్చేది. 'ఎట్టకేలకు మాకు ఇప్పుడు ప్రశాంతత దొరికింది' అంటారు భూమిక.కలెక్టర్ చొరవతో కొత్త జీవితం..కొన్ని జిల్లాల్లో ట్రాన్స్‌జెండర్ మహిళల కోసం ప్రత్యేక కాలనీలు ఏర్పాటు చేశారు. అయితే తుతూకూడిలో అలా కాకుండా తమకు నివాసంతో పాటు జీవనోపాధి మార్గం కూడా చూపాలని తూతుకూడి జిల్లా కలెక్టర్ సందీప్ నందూరిని కలిసి ఏడాది క్రితం తమ గోడు విన్నవించారు ట్రాన్స్‌జెండర్ మహిళల హక్కుల కోసం పోరాడుతున్న గ్రేస్‌బాను. వారు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే నిరంతరం ఉపాధి పొందే ఏర్పాటు చేయాలనుకున్నారాయన. అప్పుడే ఆయనకు డెయిరీ ఫార్మ్‌తో ట్రాన్స్‌జెండర్లకు స్థిరమైన ఉపాధి కల్పించవచ్చనే ఆలోచన వచ్చింది. ట్రాన్స్‌జెండర్ మహిళల పేరుతో 'మిల్క్ సొసైటీ'ని రిజిస్టర్ చేయించారు. మంథతోపెలోని రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు అధికారులు. చీఫ్ మినిస్టర్ సోలార్ పవర్డ్ గ్రీన్‌హౌజెస్ ఫర్ ట్రాన్స్‌జెండర్ల కోటా కింది అందరికీ ఇళ్లు కట్టించారు. మైన్స్ డిపార్ట్‌మెంట్ వాళ్లు రోడ్లు వేశారు. పశుసంరక్షణ అధికారుల సూచనల ప్రకారం ఆవుల కోసం షెడ్లు నిర్మించారు.చీఫ్ మినిస్టర్ గ్రీన్‌హౌజ్ ఇనీషియేటివ్ కింద షెడ్లు, ఇళ్లకు సౌర విద్యుత్ ఏర్పాట్లు చేశారు. రెండు పాడి ఆవులను కొనేందుకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున రుణం ఇప్పించారు. మొదటి విడతగా 30 ఆవులను కొన్నారు. ఆవులను మేపడం, పాలు పితకడం గురించి పది రోజులు శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థ 'ఆవిన్' వీరి కేంద్రం నుంచి ఉదయం, సాయంత్రం పాలు తీసుకెళ్లేందుకు ముందుకు వచ్చింది. రెవెన్యూ, స్కిల్ డెవలప్‌మెంట్, పశుసంరక్షణ, సహకార సంఘం, రూరల్ డెవలప్‌మెంట్ సంస్థల సహకారంతో ఈ ప్రాజెక్ట్ ఆచరణలోకి వచ్చింది. ఈ సెప్టెంబర్ మొదటి వారంలో కలెక్టర్ సందీప్ ట్రాన్స్‌జెండర్ మహిళల ఆధ్వర్యంలో నడిచే 'డెయిరీ ఫార్మ్‌ను ప్రారంభించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపారు. "ట్రాన్స్‌జెండర్లు తమ కాళ్ల మీద తాము నిలబడేలా చేయడం, వారికి స్థిరమైన ఆదాయ మార్గం చూపడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం" అంటారు ప్రాజెక్ట్ డైరెక్టర్ ధనపతి. రాబోయే రోజుల్లో ట్రాన్స్‌జెండర్లకు పేపర్ ప్లేట్స్ తయారీ ద్వారా జీవనోపాధి చూపాలనే ఆలోచనలో ఉన్నామని కలెక్టర్ తెలిపారు. తమకు బతుకు దారి చూపిన కలెక్టర్ మీద అభిమానంతో తమ కాలనీకి 'సందీప్ నగర్' అని పేరు పెట్టారు. రోల్‌మోడల్‌గా నిలుస్తాం

"ఇది ఆరంభం మాత్రమే. మేము కూడా ఇతర కమ్యూనిటీలకు రోల్‌మోడల్ అవుతాం. మాది దేశంలోనే ట్రాన్స్‌జెండర్ మహిళలు నడుపుతున్న మొట్టమొదటి మిల్క్ సొసైటీ. మా సొసైటీ 'ద మంథతోపె ట్రాన్స్‌జెండర్ మిల్క్ ప్రొడ్యూసర్ సొసైటీ' ద్వారా రోజుకు 250 నుంచి 280 లీటర్ల పాలను సరఫరా చేస్తున్నాం. మా 85 మందిలో 30 మంది వద్దే సరైన పత్రాలు ఉన్నాయి. ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు వారే. వీరిలో కొందరు డిగ్రీ చదివిన వారు, తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్, తమిళనాడు యూనిఫార్మ్‌డ్ రిజర్వ్ బోర్డులో ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్న వారు ఉన్నారు. వారికి ఏ లోటు లేకుండా చూడడమే కాకుండా, వారు తిరిగి చదువు కొనసాగించాలని అందరం కోరుకుంటున్నాం" అని వివరిస్తారు బాను.

# మహిళా సర్వోదయంస్త్రీ శక్తి



సాధారణంగా స్వయం సహాయ సంఘాల మహిళలంటే తాము పొదుపు చేసుకున్న మొత్తానికి తోడు, బ్యాంకు లింకేజీ కింద వచ్చే రుణాలతో కిరాణాషాపులు.. పాడి పశువుల పెంపకం వంటి పనులకు పరిమితమవుతుంటారు. అయితే సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం గంగ్లూర్ గ్రామానికి చెందిన మహిళలు ఓ అడుగు ముందుకేశారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గ్రామంలోని 126 మంది మహిళలు సంఘటితమై మూడు కుటీర పరిశ్రమలను స్థాపించారు. సర్వోదయ ఉమెన్ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో కంపెనీని రిజిస్ట్రేషన్ చేయించారు. త్వరలోనే స్వయం సహాయక బృంగాల మహిళలు కాస్తా మహిళా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు.

'సర్వోదయ మంజీరా' బ్రాండ్ పేరుతో చేతితో చేసిన 15 రకాల సబ్బులు తయారు చేస్తున్నారు. 20కిపైగా రసాయనాలతో తయారయ్యే సాధారణ సబ్బులకు భిన్నంగా ఇవన్నీ బొప్పాయి, టమాట వంటి సహజ వనరులతో తయారు చేసినవే కావడం గమనార్హం. ఈ పరిశ్రమల్లో కోల్డ్‌ప్రెస్ వంటనూనెలను కూడా ఉత్పత్తి చేస్తున్నారు. పల్లి, పొద్దుతిరుగుడు, నువ్వుల నూనె, కొబ్బరినూనెలను తయారు చేస్తున్నారు. ఆహార ఉత్పత్తుల ప్రాసెసింగ్ కూడా చేస్తున్నారు. స్థానికంగా పండే పప్పుదినుసుల ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేస్తున్నారు.

**జాతీయ స్థాయి నాణ్యత ప్రమాణాలు..**

బహుళ జాతి సంస్థల ఉత్పత్తులకు ఏమాత్రం తీసిపోని విధంగా నాణ్యత విషయంలో రాజీ పడటం లేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), జీఎంపీ (గుడ్ మాన్యుఫాక్చరింగ్ ప్రొడక్ట్) వంటి జాతీయ సంస్థల లైసెన్సులు తీసుకున్నారు. హ్యాండ్‌మేడ్ సబ్బులు వంటి కాస్మోటిక్స్ ఉత్పత్తుల కోసం ఆయుష్ విభాగం నుంచి అనుమతి పొందారు.

**త్వరలో మార్కెట్‌లోకి ఉత్పత్తులు..**

సర్వోదయ ఉత్పత్తులు మార్కెట్‌లోకి తెచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. 2022 జనవరిలోనే ఈ ఉత్పత్తుల మార్కెటింగ్ ప్రారంభించాలని భావించినప్పటికీ కరోనా థర్డ్‌వేవ్ ప్రభావం కారణంగా మరో పక్షం రోజులు వాయిదా వేయాలని నిర్ణయించారు. ఇప్పటికే ఈ ఉత్పత్తుల కోసం వినియోగదారుల అభిరుచుల సేకరణ ప్రక్రియను కూడా చేపట్టారు. వారి అభిరుచుల మేరకు తమ ఉత్పత్తుల్లో మార్పు చేర్పులు కూడా చేసినట్లు మహిళలు చెబుతున్నారు. బాధ్యతగా పనిచేస్తున్నాం...

'సర్వోదయ'లో పనిచేసే మేము అందరం ఈ పరిశ్రమలకు ఓనర్లమే. అందరికీ యాజమాన్య వాటా ఉంది. వచ్చే లాభాల్లో డివిడెండ్ వస్తుంది. అందువల్ల బాధ్యతగా పనిచేస్తున్నాం. ఇప్పుడు మేమందరం పప్పుల ప్రాసెసింగ్, నూనెలు తయారు చేయడం నేర్చుకుంటున్నాము. గ్రామంలోనే మా సొంత పరిశ్రమ లో పని చేయడం చాలా ఆనందంగా ఉంది.

**అంకమ్మగారి చిట్టెమ్మ, 'సర్వోదయ' సభ్యురాలు**

**సొంతూరులోనే పని దొరుకుతోంది...**

ఇప్పటివరకు ఇంటిపనికే పరిమితమైన మాకు ఈ పరిశ్రమ వల్ల సొంత ఊరిలోనే పని దొరుకుతోంది. ఈ పరిశ్రమలో మా కుటుంబం పెట్టుబడి ఉండటంతో అందులో పనిచేస్తున్న నేను కార్మికురాలిగా కాకుండా యజమానురాలిగా భావిస్తున్నాను. ప్రస్తుతం నేను సబ్బుల తయారీలో పనిచేస్తున్నాను.

**జంగం శిరీష, 'సర్వోదయ' సభ్యురాలు**

**గ్రామీణాభివృద్ధి సేవలందిస్తున్నాం...**

సర్వోదయ సంస్థ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు విద్యా, వైద్యం, ఉపాధి, పర్యావరణం వంటి విషయాల్లో ముందుకు సాగేలా ప్రోత్సహిస్తున్నాము. ఐఆర్ఎస్ అధికారులం కలిసి ఇప్పటి వరకు జిల్లాలో ఆరు గ్రామాల్లో కార్యకలాపాలను ప్రారంభించాం. కరస్‌గుత్తి, ఎద్దుమైలారం, మునిపల్లి, మైనంపల్లి, హన్మంతరావుపేట్‌లలో కూడా సంస్థ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అందరూ బాగుంటేనే మనం బాగుంటాము.. అనే నినాదం తో ముందుకెళుతున్నాం.

**డాక్టర్ సుధాకర్ నాయక్, సర్వోదయ సంస్థ**

**ఐఆర్ఎస్ అధికారుల సహకారం..**

ఆదాయపు పన్ను శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన ఆర్‌కే పాలివాల్ అనే ఉన్నతాధికారి ఈ గంగ్లూర్ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ఆయన స్ఫూర్తితో మరికొందరు ఐఆర్ఎస్ ఉన్నతాధికారులు సర్వోదయ సంస్థను స్థాపించి ఈ గ్రామంలోని మహిళలను సంఘటితం చేస్తున్నారు. ప్రతిష్ఠాత్మక ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి సంయుక్తంగా మహిళలకు పారిశ్రామిక ఉత్పత్తిలో ఉన్నత స్థాయి శిక్షణ ఇప్పించారు. ఈ సంస్థ సహకారంతో మహిళలు ముందడుగు వేస్తున్నారు.

# వృద్ధుల్లో గుండె సర్జరీ - అద్భుత విజయం



మృదుస్వభావులుగా, సున్నితంగా కనిపించే వైద్యులు కొన్ని సందర్భాల్లో యుద్ధ సైనికుల్లా మారిపోక తప్పదు. రోగి ప్రాణాలు కాపాడడం కోసం చురుగ్గా స్పందించి, యుద్ధప్రాతిపదికన సర్జరీలకు సిద్ధపడే పరిస్థితులను కూడా వైద్యులు ఎదుర్కొంటూ ఉంటారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా అలాంటి కొన్ని జీవితానుభావాలను వైద్యులు ఇలా పంచుకున్నారు.

**82 ఏళ్ల మహిళకు గుండె సర్జరీ**

వృద్ధుల్లో గుండె జబ్బుల చికిత్సలు క్లిష్టతరం. సర్జరీకి వాళ్ల శరీరాలు సహకరించవు. కాబట్టి సాధ్యమైనంత మేరకు ఇన్వేసివ్ చికిత్సలనే ఎంచుకుంటూ ఉంటాం! కానీ కొన్ని సందర్భాల్లో అది కూడా సాధ్యపడకపోవచ్చు. కొంత కాలం క్రితం అలాంటి ఒక క్లిష్టమైన పరిస్థితి ఎదురైంది. ఆమెకు 82 ఏళ్లు. కళ్లు తిరిగి పడిపోతున్న ఆమెను స్థానిక వైద్యులకు చూపిస్తే, వాళ్లు గుండె జబ్బుగా నిర్థారించారు. పెద్ద వయస్కుల్లో గుండె దగ్గర బృహద్ధమని సన్నబడిపోతూ ఉంటుంది. దాంతో మెదడుకు సరిపడా రక్తం అందక కళ్లు తిరిగి పడిపోతూ ఉందామె. అయితే ఆమెది పెద్ద వయసు కాబట్టి క్యాథెటర్ ద్వారా రక్తనాళం గుండా బృహద్ధమనికి చేరుకుని దాన్ని మార్చే పద్ధతిని అనుసరిస్తూ ఉంటారు. అయితే ఈ ప్రక్రియకు ముందు రక్తనాళాల్లో అడ్డంకులను కనిపెట్టడం కోసం కరొనరీ యాంజియోగ్రామ్ కూడా చేయవలసి ఉంటుంది. ఈ పరీక్షలో ఆమె మూడు రక్తనాళాల్లో అడ్డంకులు ఉన్నట్టు తెలిసింది. అయితే ఆవిడది పెద్ద వయసు కాబట్టి క్యాథెటర్ ద్వారా కవాటాన్ని మార్చడానికి వైద్యులు వెనకాడారు. అలాగని ఓపెన్ హార్ట్ సర్జరీ చేసే ధైర్యం కూడా చేయలేకపోయారు. అలా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో నా దగ్గరకు వచ్చిన ఆ వృద్ధురాలికి అత్యవసరంగా 3 బైపాసలతో పాటు ఓపెన్ హార్ట్ సర్జరీ ద్వారా విజయవంతంగా కవాటాన్ని కూడా మార్చగలిగాను. సర్జరీ జరిగిన ఐదో రోజునే డిశ్చార్జ్ అయిపోయిందామె. ఏడాది తర్వాత వచ్చి నన్ను కలిసి, పనులన్నీ స్వయంగా చేసుకోగలుగుతున్నట్టు చెప్పినప్పుడు నాకెంతో సంతృప్తి కలిగింది.

ఇప్పటివరకూ దాదాపు 20 వేల గుండె సర్జరీలు చేశాను. కాబట్టి నేను తీసుకున్న శిక్షణ, సుదీర్ఘ అనుభవాలు ఈ సర్జరీకి అక్కరకొచ్చాయని అనుకోవచ్చు. పి.వి నరసింహా రావు, ఎన్‌టి రామారావు, జైల్ సింగ్ లాంటి ప్రముఖులకు గుండె సర్జరీలు చేసిన అమెరికాలోని టెక్సాస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్‌లోనే నేను కూడా శిక్షణ పొందాను. అక్కడ 90, 100 ఏళ్ల రోగులకు కూడా గుండె సర్జరీలు చేసిన సందర్భాలున్నాయి. అలాగే మన దేశం లో గుండె సర్జరీలకు సంబంధించి కొన్ని ప్రొటోకాల్స్ ఉంటాయి. వాటిని నేనే రూపొందించాను. రక్తం పలచబడే మందులను జీవితాంతం వాడుకోవలసిన అవసరం లేని కృత్రిమ గుండె కవాటాన్ని కూడా రూపొందించాను. ప్రస్తుతం అది ప్రయోగ దశలో ఉంది. ఇలా గుండె సమస్యలు, చికిత్సల పట్ల నాకున్న లోతైన పరిజ్ఞానంతో క్లిష్టమైన సర్జరీలను సవాలుగా తీసుకుని, విజయవంతంగా పూర్తి చేయగలుగుతున్నాను.

రోగులకే కాదు కొన్ని సందర్భాల్లో వైద్యుల చేతిలో కూడా సమయం ఉండదు. మరీ ముఖ్యంగా అత్యవసరంగా రోగి ప్రాణాలు కాపాడవలసిన సందర్భాల్లో వైద్యులు చురుగ్గా ఆలోచించి, చకచకా నిర్ణయాలు తీసుకోవలసి వస్తూ ఉంటుంది. అలాంటి ఒక సందర్భం కొవిడ్‌కు ముందు ఎదురైంది. ఒక రోజు ఉదయాన్నే 32 ఏళ్ల మహిళను వాళ్ల కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికే కామెర్లతో కాలేయం పూర్తిగా దెబ్బతిని, కోమాలోకి వెళ్లిపోయిందామె. వాళ్లు మార్వాడీలు. వ్యాపారస్తులు. పెద్దగా చదువు లేదు కాబట్టి ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి వాళ్లకెలాంటి అవగాహనా లేదు. దాంతో పరిస్థితి తీవ్రతను అంచనా వేయలేకపోయారు. ఆమెను పరీక్షించిన వెంటనే అత్యవసరంగా కాలేయ మార్పిడి చేయకపోతే, ప్రాణాలు దక్కవనే విషయాన్ని నేను అర్థం చేసుకున్నాను. అందుకు ఎక్కువ సమయం లేదు. 24 గంటల్లో కాలేయ మార్పిడి జరిగిపోవాలి. ఓ పక్క పరిస్థితిని తీవ్రతను కుటుంబ సభ్యులకు వివరించడంతో పాటు, మరోపక్క సర్జరీకి అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలి. అంతా యుద్ధప్రాతికపదికన జరిగిపోవాలి. ఆ సమయంలో ప్రతి క్షణం విలువైనదే! మొదట కుటుంబ సభ్యులకు అర్థమయ్యేలా చెప్పి, కాలేయ మార్పిడికి ఒప్పించిన తర్వాత, రోగి తమ్ముడి నుంచి కాలేయాన్ని సేకరించాలని నిర్ణయించుకున్నాం. ఆ తర్వాత అతనికి పరీక్షలన్నీ చేసి కాలేయాన్ని దానం చేయడానికి అన్ని విధాలా అర్హుడని నిర్థారించుకున్నాం. తర్వాత అనుమతులన్నీ తీసుకుని, సర్జరీకి సిద్ధపడ్డాం. అలా రోగి ఆస్పత్రికి చేరుకున్న 24 గంటల్లోపే తెల్లవారుఝామును 3 గంటలకు సర్జరీ మొదలుపెట్టాం. రెండు ఆపరేషన్ టేబుళ్ల మీద అక్కా తమ్ముళ్లకు ఏకకాలంలో సర్జరీ చేసి, తమ్ముడి నుంచి సేకరించిన 60% కాలేయాన్ని అక్కకు అమర్చాం.

సర్జరీ నూరు శాతం విజయవంతమైంది. ఆరు వారాలకు ఇద్దరి కాలేయాలూ పూర్తి పరిమాణం మేరకు పెరుగుతాయి కాబట్టి అప్పటికి వాళ్లిద్దరూ పూర్తిగా కోలుకున్నారు. తర్వాత కొంత కాలానికి ఆమె గర్భం దాల్చిందని తెలిసింది. ఇప్పటికీ అప్పుడప్పుడూ ఆమె ఆస్పత్రికి వచ్చి నన్ను కలుస్తూ ఉంటుంది. మరణం అంచుల వరకూ వెళ్లి, కాలేయ మార్పిడితో ప్రాణాలు దక్కించుకుని, పూర్తి ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని గడుపుతున్న ఆమెను చూసిన ప్రతిసారీ నాకెంతో సంతృప్తి కలుగుతూ ఉంటుంది.

ప్రతి సర్జరీలో ముప్పులు ఉన్నట్టే, కాలేయ మార్పిడి సర్జరీలో కూడా కొన్ని ముప్పులుంటాయి. సర్జరీ కచ్చితంగా విజయవంతమవుతుందని చెప్పలేం! విషలమయ్యే అవకాశాలు 30శాతం ఉంటాయి. కాబట్టి కుటుంబానికి కౌన్సిలింగ్ ఇవ్వడం ఇక్కడెంతో కీలకంగా మారుతూ ఉంటుంది. సర్జరీ సమయంలో తలెత్తే సమస్యలు, సర్జరీ తదనంతర పరిణామాలను కుటుంబానికి వివరించడం ఒక ఎత్తైతే, సర్జరీ విఫలమై రోగి ప్రాణాలు కోల్పోయే అవకాశం కూడా ఉంటుందని వాళ్లకు అర్థమయ్యేలా చెప్పడం మరొక ఎత్తు. అలా కౌన్సెలింగ్ ముగించుకుని, మిగతా లాంఛనాలన్నీ పూర్తి చేసుకుని, తెల్లవారుఝామున 3 గంటలకు, తమ్ముడికీ, అక్కకూ ఏకకాలంలో సర్జరీలు మొదలుపెట్టాం. అవి ఉదయం పది గంటల వరకూ కొనసాగాయి. నిజానికి ఇలాంటి సందర్భాల్లో వైద్యులమైన మాలో కూడా ఎంతో కొంత ఆందోళన ఉంటూ ఉంటుంది. అలాగే సర్జరీ ఎలాగైనా సక్సెస్ కావాలనే బలమైన కోరిక కూడా ఉంటుంది. కాబట్టే సర్జరీ పూర్తి చేసి ఇంటికెళ్లిపోయినా, మా ఆలోచలన్నీ ఆస్పత్రి చుట్టూరా, రోగి ఆరోగ్యం చుట్టూరా తిరుగుతూ ఉంటాయి. ఇక్కడ ఇంకొక విషయం కూడా చెప్పాలి. వైద్యులు భావోద్వేగపరంగా రోగులతో, పరిస్థితులతో కొంత డిటాచ్డ్‌గా ఉండక తప్పదు. ఒకవేళ సర్జరీ విఫలమై, రోగి ప్రాణాలు కోల్పోవడం లాంటిది జరిగితే, బాధపడుతూ, నిరాశలో కూరుకుపోతే మేం మా వృత్తికి న్యాయం చేయలేం! కాబట్టి సాధ్యమైనంత మెరుగైన చికిత్సను అందించడం, సత్ఫలితాన్ని సాధించడం కోసం శాయశక్తులా కృషి చేయడమే లక్ష్యంగా పని చేస్తాం! ఇలా సర్జరీ నుంచి పూర్తిగా కోలుకుని నిండు ఆరోగ్యంతో కొత్త జీవితాన్ని గడుపుతున్న వాళ్లను చూసినప్పుడు ఎంతో ఆనందాన్ని పొందుతూ ఉంటాం!

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
హైదరాబాద్
11
శనివారం
05 । జులై । 2025




# ఆఖరి గంటలో అమ్మకాలు



**ముంబై-నవభూమి:** స్టాక్ మార్కెట్ మదుపరులు ఆఖరి గంట ట్రేడింగ్‌లో ఆర్థిక సేవలు, లోహ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు గురువారం నష్టాల్లో ముగిశాయి. ఆరంభంలో లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్.. ఒకదశలో 440 పాయింట్ల వరకు ఎగబాకి 83,850 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. కానీ, మదుపరులు చివర్లో లాభాల స్వీకరణకు మొగ్గు చూపటంతో సూచీ తిరోగమన బాటలో పయనించింది. 170.22 పాయింట్ల నష్టంతో 83,239.47 వద్ద ముగిసింది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సెన్సెక్స్ 610 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ విషయానికొస్తే, 48.10 పాయింట్ల నష్టంతో 25,405.30 వద్ద స్థిరపడింది.వాతావరణ డెరివేటివ్‌లు..ప్రారంభించేందుకు ఐఎండీతో ఎన్‌సీడీఈఎక్స్ ఒప్పందం దేశంలో తొలిసారిగా వాతావరణ (వెదర్) డెరివేటివ్ కాంట్రాక్టులను ప్రవేశపెట్టేందుకు భారత వాతావరణ శాఖ(ఐఎండీ)తో నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ లిమిటెడ్ (ఎన్‌సీడీఈఎక్స్) అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. రైతులు, వ్యవసాయ రంగ సంబంధిత వర్గాలు లోటు వర్షపాతం, వడగాల్పులు, అకాల వాతావరణ పరిస్థితులతో ఎదురయ్యే నష్టాల నుంచి రక్షణ పొందేందుకు ఈ డెరివేటివ్ కాంట్రాక్టులు తోడ్పడగలవని ఎన్‌సీడీఈఎక్స్ పేర్కొంది. ఐఎండీతో భాగస్వామ్యంలో వర్షపాత ఆధారిత డెరివేటివ్‌లతోపాటు ఇతర కాంట్రాక్టులను అభివృద్ధి చేయనున్నట్లు, ఇందుకోసం ఐఎండీ గత, రియల్‌టైం డేటాను వినియోగించుకోనున్నట్లు తెలిపింది.

# అంబానీ స్టాక్ అదుర్స్.. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు




**ముంబై-నవభూమి:** దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్ ధర.. ఇటీవల నెలల్లో స్థిరంగా పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలోనే ఏప్రిల్ కనిష్ట స్థాయి రూ. 1,114 నుంచి 37.5 శాతానికిపైగా పుంజుకుంది. గత సెషన్‌లో రూ. 1,531.90 వద్ద 9 నెలల గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇది జూన్ 2024లో నమోదైన రూ. 1,608 ఆల్-టైమ్ గరిష్ట స్థాయికి చేరువలో ఉంది. రిలయన్స్ షేర్లు బలమైన పురోగతిని కనబరుస్తూ, బ్రోకరేజ్‌లు టార్గెట్ ప్రైస్ పెంచడంతో, రిటైల్ వ్యాపారంలో పుంజుకోవడం, టెలికాం రంగంలో టారిఫ్ పునరుద్ధరణ కారణంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, కంపెనీ తన న్యూ ఎనర్జీ వ్యాపారాన్ని పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది.చమురు-రిటైల్ సంస్థ అయిన రిలయన్స్ స్టాక్ 2025 మొదటి అర్ధభాగాన్ని 23.5 శాతం లాభంతో ముగించింది, ఇది 2017 తర్వాత అత్యుత్తమ అర్ధ-సంవత్సర పనితీరుగా నిలిచింది. ఈ ర్యాలీ కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను తిరిగి రూ. 20 లక్షల కోట్ల పైనికి తీసుకెళ్లింది, తద్వారా రూ. 21 లక్షల కోట్ల మార్కుకు చేరువ చేసింది. ప్రస్తుతం శుక్రవారం సెషన్లో కూడా ఈ స్టాక్ ధర స్వల్పంగా పెరిగి రూ. 1523 స్థాయిలో ఉంది. ప్రస్తుతం మార్కెట్ విలువ రూ. 20.60 లక్షల కోట్లుగా ఉంది.రిలయన్స్ షేర్లలో ఈ మార్పునకు గల కారణాలను విశ్లేషిస్తే, బ్రోకరేజ్ సంస్థలు టార్గెట్ ప్రైస్ పెంచడం ఒక కారణంగా తెలుస్తోంది. రిటైల్ వ్యాపారంలో వృద్ధి, టెలికాం రంగంలో టారిఫ్ పునరుద్ధరణ కారణంగా రాబడి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా, రిలయన్స్ తన హెచ్‌జేటీ (హెటెరోజంక్షన్) సోలార్ మాడ్యూల్స్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించడం, సమీప భవిష్యత్తులో కొత్త విద్యుత్ ఉత్పత్తి వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం కూడా మార్కెట్‌లో సానుకూల దృక్పథాన్ని కలిగించాయి.ఈ రెండు కార్యక్రమాలు రిలయన్స్ న్యూ ఎనర్జీ వ్యాపారాన్ని గణనీయంగా పెంచేందుకు ఉద్దేశించి తెచ్చినవ. రాబోయే ఐదు నుంచి ఏడు సంవత్సరాలలో (ఆయిల్-టు-కెమికల్స్) విభాగం లాభదాయకతకు సమానంగా దీనిని అభివృద్ధి చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.రిలయన్స్ తన రిటైల్ విభాగంపై కూడా దృష్టి సారిస్తోంది. అదనంగా, రిలయన్స్ తన వినియోగదారు ఉత్పత్తుల విభాగాన్ని రిటైల్ విభాగం నుంచి వేరు చేసి, న్యూ రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్‌గా ప్రత్యక్ష అనుబంధ సంస్థగా మార్చేందుకు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (%చీజూు%) నుంచి అనుమతి పొందినట్లు సమాచారం. దేశీయ బ్రోకరేజ్ సంస్థ నువామా ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ సహా సిటీ, గోల్డ్‌మన్ సాక్స్, బెర్న్‌స్టెయిన్, జెపి మోర్గాన్ వంటివి స్టాక్ టార్గెట్ ప్రైస్ పెంచాయి.గమనిక: ఈ కథనంలోని అభిప్రాయాలు, సిఫార్సులు వ్యక్తిగత విశ్లేషకులవి. ఇవి టైమ్స్ ఆఫ్ ఇండియా (సమయం తెలుగు) అభిప్రాయాలను ప్రతిబింబించవు. పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు ధ్రువీకరణ పొందిన నిపుణుల్ని సంప్రదించడం ఉత్తమం.

## పసిడి ప్రియులకు షాక్.. మళ్లీ పెరిగిన బంగారం ధరలు..



**న్యూఢిల్లీ-నవభూమి:**గత నెలలో 93 వేల రూపాయల దగ్గర ట్రేడ్ అయిన స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఇప్పుడు మళ్లీ లక్ష దగ్గరకు చేరుకుంది. 18, 22 క్యారెట్ల బంగారం ధరలు కూడా మళ్లీ షాకులు మీద షాకులు ఇస్తున్నాయి. ప్రతీ రోజూ పెరుగుతూ పోతున్నాయి. ఈ సారి మాత్రం 24 క్యారెట్ల బంగారం లక్ష దాటే అవకాశం కనిపిస్తోంది.హైదరాబాద్‌లో బంగారం ధరలు ఇలా..హైదరాబాద్ మహా నగరంలో నిన్న 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,050 రూపాయల దగ్గర..10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,330 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర 74,500 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. నిన్నటితో పోల్చుకుంటే పది గ్రాముల బంగారంపై.. గ్రాముకు ఒక రూపాయి చొప్పున 10 రూపాయలు పెరిగింది. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 99,340 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 91,060 రూపాయల దగ్గర.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం ధర .. 74,510 రూపాయల దగ్గర ట్రేడ్ అవుతోంది.

వెండి ధరలు ఇలా ..బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు మొన్నటి వరకు తగ్గుతూ వచ్చాయి. కానీ, ఈ రోజు వెండి ధరలు కూడా అనుకోని షాక్ ఇచ్చాయి. నిన్న హైదరాబాద్ నగరంలో 100 గ్రాముల వెండి ధర 12,100 దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,21,000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాముల వెండిపై 10 రూపాయలు, కేజీ వెండిపై 100 రూపాయలు పెరిగింది. 100 గ్రాముల వెండి ధర నేడు 12,110 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ వెండి ధర 1,21,100 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## హెల్త్‌కేర్ రంగం కోసం నియంత్రణ మండలి



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రైవేట్ ఆస్పత్రుల దందాలకు చెక్ పెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం మార్కెట్ నియంత్రణ మండలి సెబీ, బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి ఐఆర్‌డీఏఐ, టెలికాం నియంత్రణ మండలి ట్రాయ్ తరహాలోనే హెల్త్‌కేర్ రంగం కోసం స్వతంత్రంగా పనిచేసే ఒక రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేసేందుకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ (జీఐసీ), ఐఆర్‌డీఏఐ.. ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ రామస్వామి నారాయణన్ వెల్లడించారు. ఈ రెగ్యులేటరీ సంస్థ అమల్లోకి వస్తే ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య బీమా ఉన్న పేషెంట్ల నుంచి వసూలు చేసే విచక్షణాపూరిత భారీ బిల్లులకు చెక్ పడుతుందని భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరైనా ఏదైనా అనారోగ్య సమస్యతో హాస్పిటల్‌కు వెళితే, ఆస్పత్రి ఉద్యోగులు అడిగే మొదటి ప్రశ్న 'మీకు ఆరోగ్య బీమా పాలసీ ఉందా? అని.. ఉంది అంటే ఇక వారి పంట పండినట్టే. సమస్య చిన్నదైనా వారి నుంచి నగదు చెల్లింపు రోగి కంటే రెండు మూడు రెట్లు ఎక్కువ బిల్లు చేసి పంపిస్తున్నారని రామస్వామి అన్నారు. అన్ని ఆస్పత్రులు కాకపోయినా, ఎక్కువ ఆస్పత్రుల్లో జరుగుతున్న దందా ఇదే. ఈ క్లెయిమ్‌లు చెల్లించలేక బీమా కంపెనీలు కిందా మీద పడుతున్నాయి. దీంతో ఆ భారాన్ని తట్టుకునేందుకు ప్రీమియం రేట్లు పెంచేసి, ఆ మొత్తాన్ని పాలసీదారుడి నుంచే బీమా కంపెనీలు వసూలు చేస్తున్నాయి. ఇది అటు బీమా కంపెనీలకు, ఇటు పాలసీదారులకు ఇద్దరికీ భారంగానే మారుతోంది. స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేసే హెల్త్‌కేర్ రెగ్యులేటరీ సంస్థను ఏర్పాటు చేయడం ద్వారా ఈ దందాను అడ్డుకోవాలని బీమా సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

## మూడంచెల జీ ఎస్ టీ రేట్లు వాంఛనీయం




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో సరళమైన మూడంచెల జీఎస్టీ విధానం అమలు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నూతన అధ్యక్షుడు రాజీవ్ మెమానీ సూచించారు. నిత్యావసర వస్తువులకు 5%, విలాసవంతమైన వస్తువులకు 28% కనిష్ఠ, గరిష్ఠ రేటు, మిగతా వస్తువులన్నింటికీ మధ్యేమార్గంగా 12-18% రేటు ఉండాలన్న అభిప్రాయం ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశంలో నాలుగంచెల జీఎసటీ విధానం (5, 12, 18, 28 శాతం) అమలులో ఉంది. సీఐఐ అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వస్తు సేవల పన్నును (జీ ఎస్ టీ) హేతుబద్ధం చేయాల్సిన అవసం ఉన్నదని నొక్కి చెప్పారు. ప్రధానంగా అల్పాదాయ వర్గాల ప్రజలు అధికంగా ఉపయోగించే వస్తువులపై పన్ను రేటు తగ్గించాలని ఆయన సూచించారు. అలాగే సిమెంట్ సహా అధిక శాతం ఉత్పత్తులపై ప్రస్తుతం 28% జీఎసటీ అమలులో ఉన్నదని, ఆ రేటును కూడా హేతుబద్ధీకరించడం వల్ల ఆర్థిక కార్యకలాపాలు జోరందుకుంటాయని అన్నారు. పెట్రోలియం, విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆల్కహాల్ ఉత్పత్తులను కూడా జీ ఎస్ టీ పరిధిలోకి తెచ్చే విషయంలో జాతీయ స్థాయి ఏకాభిప్రాయ సాధన అవసరమని రాజీవ్ సూచించారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.4 శాతం నుంచి 6.7 శాతం మధ్యలో ఉండవచ్చని భారత రాజీవ్ అంచనా వేశారు.మన దేశ వృద్ధి రేటుకు రిస్కులు, బలాలు కూడా సమతూకంగా ఉన్నాయన్నారు. భౌగోళిక, రాజకీయ అస్థిరతలు వృద్ధిని క్షీణింప చేసే ప్రమాదం ఉన్నప్పటికీ వస్తు, సేవలకు దేశీయ డిమాండు బలంగా ఉండడం వృద్ధిని ఉద్దీపింప చేసే అంశమని ఆయన వివరించారు.

## ఇళ్ల అమ్మకాలు కిందికి

**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ఇళ్ల అమ్మకాలు నేలచూపులు చూస్తున్నాయి. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో 1,70,201 ఇళ్లు, ఫ్లాట్లు అమ్ముడయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే అమ్మకాలు 2 శాతం తగ్గాయని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో తెలిపింది. అమ్మకాలు తగ్గినా ఇళ్ల ధరలు మాత్రం సగటున 2 నుంచి 14 శాతం వరకు పెరిగాయి. ఇదే సమయంలో ఈ ఎనిమిది నగరాల్లో కంపెనీలు లీజుకు తీసుకున్న ఆఫీస్ స్పేస్ విస్తీర్ణం 41౹ పెరిగి 489 లక్షల ఎస్‌ఎఫ్‌టీ చేరింది.హైదరాబాద్ రియల్టీలో జోరు: గత ఆరు నెలల్లో హైదరాబాద్ రియల్టీలో మాత్రం మంచి వృద్ధి రేటు కనిపించింది. గత ఆరు నెలల్లో నగరం, దాని చుట్టుపక్కల 19,048

## ఉద్యోగులకు భారీగా పెరగనున్న జీతాలు.. డీఏ 4 శాతం పెంపు..




**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రభుత్వ ఉద్యోగులకు త్వరలోనే అదిరే శుభవార్త అందనుంది. ఈసారి కూడా జీతాలు భారీగానే పెరగనున్నాయి. ఎందుకంటే ఈసారి మరో 4 శాతం మేర డీయర్‌నెస్ అలవెన్స్ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రీయల్ వర్కర్స్ గత మే, 2025 నెలలో 0.5 పాయింట్ల మేర పెరిగి 144కు చేరింది. మార్చి నెల నుంచి 3 నెలలుగా వరుసగా పెరుగుతూనే వస్తోంది. మార్చి నెలలో 143 వద్ద ఉండగా, అది ఏప్రిల్‌లో 0.5 పాయింట్లు పెరిగి 143.5కు చేరింది. ఆ తర్వా మేలో 144కు పెరిగింది.ఈ క్రమంలో ఉద్యోగులకు జూలై 2025 నుంచి అమలు కావాల్సిన డియర్‌నెస్ అలవెన్స్ ) అనేది మరో 3 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగనుంది. ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 55 శాతంగా ఉంది. జూన్-2025 వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా డీఏ పెంపు నిర్ణయం ఉండనుంది. ఒక వేళ కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఏఐసీపీఐ-ఐడబ్ల్యూ గనక జూన్ నెలలో 0.5 పాయింట్లు పెరిగితే అది 144.5 పాయింట్లకు చేరుకుంది. దీంతో 12 నెలల సగటు కన్స్యూమర్ ప్రైస్ 144.17 పాయింట్లకు చేరుకుంది. 7వ వేతన సంఘం ఫార్ములా ప్రకారం సగటు కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ అనేది 58.85 శాతంగా ఉంటుంది.ఈ విలువను రౌండ్ ఆఫ్ చేస్తే అంటే డీఏ 59 శాతంగా ఉండనుంది. ప్రస్తుతం ఉన్న 55 శాతం నుంచి 59 శాతానికి చేరుతుంది. అంటే జూలై-25 నుంచి అమలయ్యే డీఏ 4 శాతం పెరుగుతుందని అర్థమవుతోంది. జూన్-25 నెలలోని కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ ఆధారంగా డీఏ పెంపు ఉంటుంది. గడిచిన 12 నెలల సగటు ఏఐసీపీఐ ఆధారంగా డీఏను లెక్కిస్తారు. ఇప్పటికే జనవరి- మే 2025 లెక్కలు వచ్చేశాయి. వాటి ఆధారంగా చూసుకుంటే డీఏ 3 శాతం పెరగనుంది. అయితే జూన్ లెక్కలు వస్తే క్లారిటీ వస్తుంది. ఫార్ములాతో లెక్కిస్తారు. ఇందులో 261.42 అనేది కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ బేస్ వాల్యూ.

**డీఏ పెంపు ప్రకటన ఎప్పుడు?**

సాధారణంగా డీఏ పెంపు జూలై నుంచి అమలులోకి వస్తుంది. అయితే, ప్రభుత్వం డీఏ పెంపు నిర్ణయం సెప్టెంబర్- అక్టోబర్ సమయాల్లో తీసుకుంటుంది. అప్పుడు పండగల సీజన్ కొనసాగుతుంది. డీఏ పెంపుతో కలిపి ఉద్యోగులకు పెద్ద మొత్తంలో జీతాలు అందుతాయి. ఈసారి కూడా అదే జరిగే అవకాశం ఉంది. అంచనా ప్రకారం దీపావళి సమయంలోనే డీఏ పెంపు ప్రకటన వెలువడే సూచనలు కనిపిస్తున్నాయి.

## ఈపీఎఫ్ఓ శుభవార్త.. మీ పీఎఫ్ ఖాతాల్లో వడ్డీ జమ.. ఇలా ఈజీగా చెక్ చేసుకోండి!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరికీ 'పీఎఫ్' (ప్రావిడెంట్ ఫండ్)అనే పదం సుపరిచితమే. ఇది కేవలం మీ జీతంలో నుంచి కట్ అయ్యే చిన్న మొత్తం కాదు, మీ భవిష్యత్తుకు ఆర్థికంగా అండగా నిలిచే ఒక గొప్ప పొదుపు పథకం! ఉద్యోగ విరమణ తర్వాత లేదా ఆర్థికంగా అవసరమైన సమయంలో ఈ నిధి మీకు పెద్ద దిక్కుగా నిలుస్తుంది.ప్రావిడెంట్ ఫండ్, అంటే భవిష్య నిధి, అనేది ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఒక రక్షణ కవచం. ఇది ఉద్యోగులు, వారి యజమానులు ఇద్దరూ క్రమం తప్పకుండా ఒక నిధికి డబ్బు జమ చేసే పథకం. ఈ నిధికి ప్రభుత్వం వడ్డీని కూడా చెల్లిస్తుంది, తద్వారా మీ డబ్బు కాలక్రమేణా వృద్ధి చెందుతుంది.ప్రతి నెలా మీ జీతంలో నుంచి (బేసిక్ జీతం ం డీఏ) 12% చొప్పున పీఎఫ్‌కు జమ అవుతుంది. ఈ మొత్తం నేరుగా మీ జీతం నుంచే కట్ అవుతుంది. మీరు ఎంతైతే జమ చేస్తారో, మీ యజమాని (కంపెనీ) కూడా అదే మొత్తాన్ని, అంటే మీ బేసిక్ జీతం ం డీఏలో 12% చొప్పున పీఎఫ్‌కు జమ చేయాలి. అయితే, యజమాని జమ చేసే ఈ 12% మొత్తంలో 8.33% ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ ఖాతాకు వెళ్తుంది. మిగిలిన 3.67% మాత్రమే మీ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాకు జమ అవుతుంది. దీని ద్వారా మీరు పదవీ విరమణ తర్వాత పెన్షన్ పొందడానికి అర్హత సాధిస్తారు.పీఎఫ్ ఖాతాలో జమ అయిన మొత్తంపై ప్రభుత్వం వార్షికంగా వడ్డీని చెల్లిస్తుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి, ఈ వడ్డీ రేటు 8.25 శాతంగా నిర్ణయించింది. ఈ వడ్డీని మీ ఖాతాలో జమ చేస్తారు, తద్వారా మీరు జమ చేసిన అసలు మొత్తంపై మాత్రమే కాకుండా, అప్పటికే జమ అయిన వడ్డీపై కూడా వడ్డీ వస్తుంది (కాంపౌండింగ్). ఇది దీర్ఘకాలంలో మీ పీఎఫ్ నిధిని గణనీయంగా పెంచుతుంది.ఇక ఇప్పుడు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి.. పీఎఫ్ ఖాతాలో వడ్డీ డబ్బులు జమ కావడం మొదలైంది. మీ ఖాతాలో డబ్బులు జమ అయ్యాయో లేదో తెలుసుకోవడానికి కొన్ని సులువైన పద్ధతులు ఉన్నాయి. ఉమాంగ్ యాప్, ఈపీఎఫ్ఓ పోర్టల్, మిస్డ్ కాల్ లేదా ఎస్సెమ్మెస్ ద్వారా మీ బ్యాలెన్స్ తెలుసుకోవచ్చు. చాలా మంది తమ ఖాతాలో వడ్డీ ఎప్పుడు జమ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. కొంతమందికి వడ్డీ జమ అయినట్లు పాస్‌బుక్‌లో చూపిస్తోంది. మరికొందరికి ఇంకా జమ కావాల్సి ఉంది.1. ఉమాంగ్ యాప్ ద్వారా: ఉమాంగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి. మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వండి. ఈపీఎఫ్ఓ సర్వీసెస్‌కు వెళ్లండి. మీ యూఏఎన్, ఓటీపీ ఎంటర్ చేయండి. మీ బ్యాలెన్స్ వివరాలు కనిపిస్తాయి.2. ఈపీఎఫ్ఓ పోర్టల్ ద్వారా: ఈపీఎఫ్ఓ వెబ్‌సైట్‌ను సందర్శించండి. మీ యూఏఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేసి లాగిన్ అవ్వండి. 'మెంబర్ పాస్‌బుక్' ఎంచుకుని మీ వివరాలు చూడొచ్చు.3. మిస్డ్ కాల్ ద్వారా: మీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్ నుంచి 99660 44425 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వండి. మీకు ఎస్సెమ్మెస్ ద్వారా బ్యాలెన్స్ వివరాలు వస్తాయి.

## టెక్ కంపెనీల్లో ఏం జరుగుతోంది? ఇంత దారుణమా



**న్యూఢిల్లీ-నవభూమి:**2025లోనూ ఐటీ, టెక్ రంగంలో ఉద్యోగాల కోతలు కొనసాగుతున్నాయి. ఆర్థిక ఒత్తిడులు, పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలు, AI యుగంలో మారుతున్న ప్రాధాన్యతల కారణంగా గూగుల్, మెటా, ఇంటెల్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలు ఉద్యోగులను తొలగిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్ తాజాగా 9,100 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. అమెజాన్, ఐబీఎం, ఇన్ఫోసిస్ వంటి ఇతర సంస్థలు కూడా ఉద్యోగులను తొలగించాయి. గడిచిన ఆరు నెలల కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా 100,000 కంటే ఎక్కువ ఉద్యోగాలు కోల్పోయారు. ఈ 2025 సైతం ఐటీ ఉద్యోగులకు గడ్డుకాలంగానే చెప్పాలి. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో చెప్పలేని పరిస్థితుల్లో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు.టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ ఈ సంవత్సరం భారీ ఉద్యోగాల కోతను ప్రకటించింది. దాదాపు 9,100 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు తెలిపింది. ఇది వారి మొత్తం ఉద్యోగులలో దాదాపు 4 శాతం. ఈ తొలగింపులు ముఖ్యంగా ఎక్స్ బాక్స్, గేమింగ్ విభాగాలపై ప్రభావం చూపుతున్నాయి. ఎక్స్ బాంక్స్ హెడ్ ఫిల్ స్పెన్సర్ మాట్లాడుతూ.. వ్యూహాత్మక వృద్ధిపై దృష్టి పెట్టడానికి కొన్ని ప్రాంతాలలో పనిని తగ్గిస్తున్నామని లేదా ముగిస్తున్నామని తెలిపారు. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, క్యాండీ క్రష్ కింగ్ స్టూడియో కూడా దాదాపు 200 ఉద్యోగాలను తగ్గించనుంది.ఈ ఏడాదిలో మైక్రోసాఫ్ట్ ఇప్పటికే 6,000 మందికి పైగా ఉద్యోగులను తొలగించింది.జూన్‌లో 305 మంది ఉద్యోగులను తొలగించడంతో పాటు, పనితీరు ఆధారంగా కోతలు విధించింది. బిజినెస్ ఇన్సైడర్ నివేదిక ప్రకారం, ఉద్యోగులకు సిస్టమ్ యాక్సెస్ వెంటనే రద్దు చేశారు. ఆరోగ్య సంరక్షణ ప్రోత్సహకాలు సైతం తీసేశారు. కొంతమంది ఉద్యోగులకు నష్టపరిహారం కూడా అందలేదని ఆరోపణలు ఉన్నాయి. గత సంవత్సరం మైక్రోసాఫ్ట్‌లో 1,900 యాక్టివిజన్ బ్లిజార్డ్ ఉద్యోగులను తొలగించారు. క్లౌడ్, హోలోలెన్స్ బృందాలకు కోతలు విధించారు.ఇక.. ఇంటెల్ కొత్త సీఈఓ లిప్-బు టాన్ ఆధ్వర్యంలో భారీ పునర్వ్యవస్థీకరణ జరుగుతోంది. జూలైలో శాంటా క్లారా ప్రధాన కార్యాలయంలోని 107 మంది ఉద్యోగులను తొలగించనున్నారు. జర్మనీలోని ఆటోమోటివ్ చిప్ యూనిట్‌ను మూసివేసి, దాదాపు మొత్తం బృందాన్ని తొలగించనుంది. మరిన్ని ఉద్యోగాల కోతలు ఉండవచ్చని సమాచారం. ఇవి ఇంటెల్ గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో 20 శాతం వరకు ప్రభావితం చేయవచ్చు. చిప్ డిజైన్, క్లౌడ్ ఆర్కిటెక్చర్, ఎగ్జిక్యూటివ్ పాత్రల్లో పనిచేసే సీనియర్ ఇంజనీర్లు కూడా ఇందులో ఉన్నారు. చిప్ తయారీ సిబ్బందిపై ఎక్కువ ప్రభావం ఉంటుందని అంతర్గత మెమోలు సూచిస్తున్నాయి.అమెజాన్ 2025లో నాలుగు రౌండ్ల తొలగింపులు చేసింది. అమెజాన్ తన బుక్స్ విభాగంలో ఉద్యోగాలను తగ్గించింది. ఇది సంస్థ ప్రారంభమైన మొదటి విభాగం. %ఖఱఅస్త్రీవ, +శీశీఎతీఘుం% బృందాలలో ఉద్యోగులపై ప్రభావం పడింది. తక్కువ మంది ఉద్యోగులు ప్రభావితమైనప్పటికీ, ఇది టెక్ దిగ్గజంలో ఉద్యోగాల కోతలలో భాగం. మా బృందాలు, ప్రోగ్రామ్‌లను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి, మా వ్యాపార ప్రణాళికకు అనుగుణంగా ఉండటానికి ఈ చర్య తీసుకుంటున్నామని అమెజాన్ ప్రతినిధి రాయిటర్స్‌తో అన్నట్లు పేర్కొంది. పుస్తకాల విభాగం మాత్రమే కాదు, ఇతర విభాగాల్లో కూడా కోతలు ఉన్నాయి. పరికరాలు, సేవలు, వందరీ పాడ్‌కాస్ట్ విభాగం, కమ్యూనికేషన్స్ యూనిట్‌తో సహా అనేక బృందాలలో ఉద్యోగాలను తగ్గించింది. ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ ప్రకారం, అమెజాన్ ప్రపంచవ్యాప్తంగా 14,000 మంది మేనేజర్ల ఉద్యోగాలను తగ్గించాలని యోచిస్తోంది. ఇది వారి నాయకత్వ సిబ్బందిలో దాదాపు 13 శాతం. ఈ కోత పూర్తయితే, కంపెనీలో మేనేజర్ల సంఖ్య 92,000 కంటే తక్కువకు పడిపోవచ్చు.ఇక దాదాపు 8,000 మంది ఉద్యోగులను తొలగించింది.

## మేక్ ఇన్ ఇండియాకు షాక్.. భారత్ లక్ష్యాలకు చైనా గండి



**న్యూఢిల్లీ-నవభూమి:** కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కారు గొప్పగా ప్రకటించుకున్న 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యానికి చైనా వ్యూహాత్మకంగా గండి కొడుతున్నది. అమెరికాతో వాణిజ్య యుద్ధం నేపథ్యంలో డ్రాగన్ కంట్రీ నుంచి భారత్‌కు మకాం మార్చాలనుకుంటున్న విదేశీ సంస్థలకు జిన్‌పింగ్ ప్రభుత్వం తెలివిగా చెక్ పెడుతున్నది. ఇన్నాళ్లూ ఐఫోన్ల తయారీకి పొరుగు దేశంపై ఆధారపడిన యాపిల్.. కొంతకాలం నుంచి భారత్‌పై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇక్కడి ఫాక్స్‌కాన్ ప్లాంట్‌లో ఐఫోన్ల తయారీ ఊపందుకున్నది. అయితే ఇప్పుడు ఫాక్స్‌కాన్ యూనిట్ నుంచి ఏకంగా 300 మందికిపైగా చైనా ఇంజినీర్లు వెళ్లిపోతున్నారు. ఇది ఎప్పుడూ జరిగే మార్పు కంటే చాలా ఎక్కువగా ఉండటం ఇప్పుడు మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.ఓవైపు అమెరికాతో ట్రేడ్ వార్.. మరోవైపు భారత్‌తో సరిహద్దు సమస్యలున్న తరుణంలో చైనా వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నది. ఈ క్రమంలోనే ఇప్పటికే అరుదైన ఖనిజాల ఎగుమతిపై నిషేధాజ్ఞలు విధించిన జిన్‌పింగ్ ప్రభుత్వం.. అక్కడి నిపుణులు భారత్, వియత్నాం తదితర దేశాల్లో పనిచేస్తుంటే వెనక్కి పిలవాలని కూడా ఆ దేశ కంపెనీలను, రెగ్యులేటర్లకు స్పష్టం చేసింది. తద్వారా తమకు పోటీగా వచ్చే దేశాల్లో నైపుణ్యాభివృద్ధిని అడ్డుకోవాలని భావిస్తున్నది. నిజానికి అమెరికాకు చెందిన యాపిల్.. భారత్‌కు తరలిపోతే, ఆ తర్వాత చైనాలోని ఎన్నో అమెరికన్ టెక్నాలజీ కంపెనీలూ అదే దారిలో క్యూ కడుతాయి. అందుకే పరిస్థితి చేయి దాటకముందే చైనా అప్రమత్తమైందన్న అభిప్రాయాలు ఇప్పుడు అంతటా వినిపిస్తున్నాయి. అయితే ఇదిప్పుడు మేక్ ఇన్ ఇండియాకు శరాఘాతమవుతున్నది.

**ఇతర రంగాల్లో..**

టెక్నాలజీ, ఫార్మా, రక్షణ, ఆటో తదితర రంగాల్లో భారత్ పెట్టుకున్న అభివృద్ధి ఆశల్ని చైనా చిదిమేస్తున్నది. భారత్‌కు వద్దామనుకున్న అక్కడి విదేశీ సంస్థల ప్లాన్లకు ఒక్కసారిగా చైనా వ్యూహాలు బ్రేకులు వేశాయనే చెప్పవచ్చు మరి. ఇక అమెరికా-చైనా మధ్య కుదురుకుంటున్న పరిస్థితులు సైతం అక్కడి విదేశీ సంస్థల్లో భారత్‌పట్ల ఇంతకుముందున్న ఆసక్తిని తగ్గించేస్తున్నాయి.

**భారత్‌కు చెక్**

2026కల్లా భారత్‌లో ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని అమెరికాకు చెందిన యాపిల్ భావిస్తున్నది. ట్రంప్ హయాంలో చైనాను నమ్ముకుంటే ఎప్పటికైనా ఏ రకంగానైనా ఇబ్బందేనని భావిస్తున్న యాపిల్.. భారత్‌ను ప్రత్యామ్నాయంగా ఎంచుకున్నది. ఈ క్రమంలోనే తమ ప్రధాన భాగస్వామి ఫాక్స్‌కాన్‌కు చెందిన భారతీయ ప్లాంట్లలో ఐఫోన్ల అసెంబ్లింగ్‌ని వేగవంతం చేస్తున్నది. అయితే ఈ ప్లాంట్ల నుంచి ఒక్కసారిగా 300 మందికిపైగా చైనా ఇంజినీర్లు, టెక్నీషియన్లను ఆ దేశం వెనక్కి పిలిచింది.దీని వెనుక జిన్‌పింగ్ సర్కారు ఆదేశాలున్నట్టు సమాచారం. భారత్‌లో ఐఫోన్ల తయారీకి చైనా ఇంజినీర్లు, ఇతర సాంకేతిక నిపుణులే కీలకం. పైగా భారత్‌లో ఉద్యోగాల్లోకి తీసుకున్న స్థానికుల్లో నైపుణ్యాల పెంపునకు అవసరమైన శిక్షణ ఇచ్చేది కూడా చైనా నిపుణులే. దీంతో ఉత్పత్తితోపాటు ఇక్కడి ఉద్యోగావకాశాలకూ బ్రేక్ పడ్డట్టు అవుతున్నది. నిజానికి రెండు నెలల క్రితం నుంచే భారత్ నుంచి చైనాకు ఎక్స్‌పర్ట్స్ తరలిపోతున్నట్టు బ్లూంబర్గ్ చెప్తున్నది. వీరిలో తైవాన్‌కు చెందినవారే పెద్ద ఎత్తున ఉండటంతో అసలుసిసలైన నైపుణ్యం వీడుతున్నదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్న యాపిల్ ఐఫోన్లలో దాదాపు 20 శాతం భారత్‌లోనే ఉత్పత్తి.

చైనాలో ఇప్పటికీ పెద్ద ఎత్తున ఐఫోన్లను తయారుచేస్తున్న ఫాక్స్‌కాన్ కంపెనీ.. గత నాలుగేండ్లుగా భారత్‌లోనూ ఉత్పత్తిని క్రమేణా పెంచుతూపోతున్నది.

గత ఏడాది రికార్డు స్థాయిలో దేశీయంగా 10 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఐఫోన్ల అసెంబ్లింగ్. వీటిలో సుమారు 7 బిలియన్ డాలర్ల విలువైనవి విదేశాలకు ఎగుమతి.

ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్ భాగస్వామ్యంలో మార్కెట్‌లోకి ఇటీవల విడుదలైన ఐఫోన్ 17 మాడళ్లనూ భారత్‌లోనే భారీగా తయారు **చేయాలని చూస్తున్న యాపిల్.**

వెనక్కిపోతున్న చైనా ఇంజినీర్లు, టెక్నీషియన్లతో భారత్‌లో తగ్గనున్న ఉద్యోగ నియామకాలు. నైపుణ్య శిక్షణపైనా తీవ్ర ప్రభావం.

అరుదైన ఖనిజాలపై చైనా ఆంక్షలతో ఆటో, రక్షణ, చిప్, మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో కలవరం.

**అంతటా యుద్ధ వాతావరణం**

నెలకొంటున్న నేపథ్యంలో దేశీయం గా తయారవుతున్న డ్రోన్లు, యాంటీ-డ్రోన్ సిస్టమ్స్, యుద్ధ విమాన విడిభాగాలు తదితర ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ ఉత్పత్తికీ చైనాతో అడ్డంకులు.

ఆధునిక ప్రపంచంలో యుద్ధాలన్నీ సాంకేతిక పరిజ్ఞానంతోనే నడుస్తుండటంతో స్వదేశీ పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు.

దశాబ్దాల కాలంగా రక్షణ రంగ అవసరాల కోసం రష్యా, అమెరికా, ఫ్రాన్స్ దేశాలపైనే అధికంగా ఆధారపడుతున్న భారత్.

విదేశీ పెట్టుబడులపైనే ఆధారపడకుండా బడ్జెట్‌లో రక్షణ రంగ కేటాయింపులను పెంచితేనే మేక్ ఇన్ ఇండియా లక్ష్యాలు నెరవేరుతాయన్న అభిప్రాయాలు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 | హైదరాబాద్ శనివారం 05 । జులై । 2025

## ఇద్దరు కొడుకులతో పవన్ కళ్యాణ్.. క్యూట్ ఫొటో లీక్!

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన ఇద్దరు కుమారులతో కలిసి దిగిన ఫొటో ఒకటి ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పవన్ కళ్యాణ్ ఈరోజు ఉదయం మంగళగిరిలోని తన నివాసంకి చేరుకోగా.. ఆయనతో పాటు తన పెద్ద కుమారుడు అకీరా నందన్ చిన్న కుమారుడు మార్క్ శంకర్ ఉన్నారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటో ప్రస్తుతం వైరలవుతుంది. మరోవైపు తన నివాసం నుంచి పార్టీ ఆఫీస్‌కి వెళ్లిన పవన్ అధికారులతో, పార్టీ ప్రతినిధులతో ముఖ్యమైన



అంశాలపై చర్చించారు.
అనంతరం మార్కాపురం నియోజకవర్గ పర్యటనకు బయలుదేరారు. అక్కడ జలజీవన్ మిషన్ కింద రూ. 1,290 కోట్లతో చేపట్టనున్న తాగునీటి పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. పర్యటన అనంతరం, మధ్యాహ్నం 1:45 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి తిరిగి బయలుదేరతారని అధికార వర్గాలు తెలిపాయి.

నవచిత్ర





## తల్లి ముందే స్మోక్ చేసిన హీరోయిన్

నితిన్ హీరోగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా తమ్ముడు. దిల్ రాజు నిర్మాణంలో రూపొందిన ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్లు నటించగా, ఆ ముగ్గురు హీరోయిన్లూ తమ్ముడు సినిమా కోసం ఒక్కో ప్రత్యేక టాలెంట్ ను కొత్తగా నేర్చుకున్నారు. తమ్ముడు సినిమా కోసం వర్ష బొల్లమ్మ కిక్ బాక్సింగ్ నేర్చుకోగా, మరో హీరోయిన్ సప్తమి గౌడ తన క్యారెక్టర్ కోసం గుర్రపు స్వారీ నేర్చుకున్నారు. కానీ మరో కీలక పాత్రలో నటించిన స్వసిక విజయ్ మాత్రం తమ్ముడు సినిమా కోసం ఓ స్పెషల్ సవాల్‌ను స్వీకరించారు. తమ్ముడు సినిమాలోని తన పాత్ర కోసం ఆమె స్మోకింగ్ ను అలవాటు చేసుకున్నారట. తన క్యారెక్టర్ ప్రిపరేషన్ లో భాగంగా తాను స్మోక్ చేయడం నేర్చుకోవాలని డైరెక్టర్ శ్రీరామ్ వేణు తనకు చెప్పారని స్వసిక వెల్లడించారు. దాని కోసం తాను ప్రతీరోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేశానని, ఆఖరికి తన తల్లి ముందు కూడా తాను స్మోక్ చేశానని, ఇదంతా తన జాబ్ లో భాగమని తన తల్లికి చెప్పానని స్వసిక తెలిపారు. సినిమాలో మీరు చూసేది నిజమైన సిగార్లేనని, సినిమా మొత్తమ్మీద ఓ ఐదు సీన్లు మినహాయించి ప్రతీ సీన్ లోనూ తాను స్మోక్ చేస్తూనే కనిపిస్తానని, ఆ వాసనకు వాంతులు, తలనొప్పి కూడా వచ్చాయని ఆమె పేర్కొన్నారు. మొత్తానికి తమ్ముడు సినిమా కోసం శ్రీరామ్ వేణు ప్రతీ హీరోయిన్ కీ ఓ స్పెషల్ మ్యానరిజంను ఇచ్చినట్టు అర్థమవుతుంది. ఇదిలా ఉంటే ఈ సినిమాలో నితిన్ కు అక్కగా లయ నటిస్తుండగా, ఆమె కూడా సినిమాలో చెప్పు లేకుండా నటించాల్సి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే.

## కన్నప్ప కోసం.. శారీరకంగా ఎంతో కష్టపడ్డా




శ్రీ విష్ణు ఓం భీం భుష్ సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి తెలుగు ప్రేక్షకులను అలరించింది తమిళ ముద్దుగమ్మ ప్రీతి ముకుందన్ ఆపై కెవిన్‌తో స్టార్ చిత్రంతో నటి గాను గుర్తింపు తెచ్చుకున్న ఈ అమ్మడు ఇటీవల కన్నప్ప సినిమాతో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. ఆ సినిమాలో ఫుల్ లెంగ్త్ క్యారెక్టర్‌లో చివరకి వరకు కనిపించిన ఈ భామ నటనతో మెస్మరైజ్ చేసింది. ముఖ్యంగా మూవీలోని పాటలు అందులోని డ్రెస్సింగ్‌తో టాక్ ఆఫ్ ది టౌన్ అయింది. చాలాకాలం సోషల్ మీడియాను షేక్ చేసింది కూడా.
ఇదిలాఉంటే.. సినిమా టీజర్ రిలీజ్ సమయంలో ఏడాది క్రితం కనిపించిన ఈ చెన్నై చిన్నది ఆపై మళ్లీ ఇంతవరకు కనిపించిన దాఖాలాలు లేవు. దేశమంతా నిర్వహించిన సినిమా ఈవెంట్లలో ప్రధానంగా హైదరాబాద్ ప్రీ రిలీజ్‌లోనూ హీరో, పలువురు నటులు సందడి చేసినప్పటికీ హీరోయిన్ దర్శణం ఇవ్వలేదు. దాంతో మేకర్స్‌తో ఏదో ఇష్యూలు వచ్చాయని న్యూస్ వైరల్ అయింది. ఈ నేపథ్యంలోనే సినిమా విడుదల కావడం మంచి విజయం సాధించడం చకచకా జరిగిపోయాయి. ఈ సందర్భంగా అనేక మంది ప్రీతి నటనను మెచ్చుకుంటూ ప్రశంసలతో ముంచెత్తుతుండడంతో అమ్మడి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. దాంతో ప్రీతి అందరికీ థ్యాంక్స్ చెబుతూ తన అనుభవాలను చెబుతూ ఓ పోస్ట్ పెట్టింది. ఆరు నెలలు ఆ పాత్ర కోసం శారీరకంగా ఎంతో కష్టపడ్డానని, ఇప్పుడు వచ్చిన ఫలితం ఎతో గొప్పగా ఉందని తెలిపింది. అయితే అందులో కన్నప్ప సినిమాను, నటుల పేర్లను ఎక్కడా ప్రస్తావించకుండా తన గురించి మాత్రమే చెప్పడంతో ఆ యూనిట్‌కు, ప్రీతి మధ్య సమ్‌థింగ్ ఏదో జరిగిందనే వార్తలకు బలం చేకూరిన్నట్లైంది. అయితే.. ఇప్పుడు ఈ ముద్దుగుమ్మ కన్నప్పసినిమా తరహా దుస్తులను ధరించి రకారకాల భంగిమలతో హొయలు పోతూ హంగామా చేసింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో ట్రెండింగ్‌లో ఉండగా టాలీవుడ్, బాలీవుడ్ ఈ అమ్మడికి మరిన్ని ఛాన్సలు ఇవ్వాలంటూ రిక్వెస్ట్ చేస్తున్నారు. ప్రీతి కొత్త ఫొటోలపై మీరూ ఓ లుక్కేయండి.

## 'విశ్వంభర'లో ఊహించని ట్విస్ట్..
### చిరు పాటనే రీమిక్స్ చేయబోతున్న మేకర్స్?



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం విశ్వంభర సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. సోషియో-ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమాకి సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ వైరల్‌గా మారింది. ఈ సినిమాలో ఓ రీమిక్స్ సాంగ్ ఉండబోతోందని ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, చిరంజీవి నటించిన సూపర్ హిట్ సినిమాలోని ఏదైన ఒక పాటను 'విశ్వంభర' సినిమాలో రీమిక్స్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ సోషల్ మీడియాలో దీనిపై పెద్ద చర్చ జరుగుతోంది. బాలీవుడ్ నటి మౌని రాయ్ ఈ స్పెషల్ సాంగ్ లో చిరంజీవితో కలిసి స్టెప్పులు వేయనున్నారని కూడా సమాచారం. 'విశ్వంభర' సినిమాకు ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

## అతనితో ఎంగేజ్‌మెంట్ జరుపుకున్న జాన్వీ కపూర్ సిస్టర్



బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ సోదరి అన్షులా కపూర్ గుడ్ న్యూస్ పంచుకుంది. ఆమె తన లాంగ్ టర్మ్ బాయ్ ఫ్రెండ్‌తో ఎంగేజ్‌మెంట్ జరుపుకున్నట్టు తెలియజేసి అందుకు సంబంధించిన పిక్స్ కూడా షేర్ చేసింది. ఇవి ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ జంటకి ప్రతి ఒక్కరు కూడా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. న్యూయార్క్ నగరంలోని ప్రఖ్యాత సెంట్రల్ పార్క్‌లోని బెల్వెడేర్ క్యాసిల్ ముందు అన్షులాకి ప్రపోజ్ చేస్తూ రింగ్ తొడిగాడు రోహన్. యాప్ ద్వారా ఇద్దరి మధ్య ప్రేమ చిగురించిందని అన్షులా చెప్పుకొచ్చింది. మాది మూడేళ్ల ప్రేమ అని తన లవ్ స్టోరీ తెలియజేసింది. మై బెస్ట్ ఫ్రెండ్.. మై సేఫ్ ప్లేస్.. మై పర్సన్ అంటూ ఎమోషనల్‌గా కామెంట్ చేసింది. ఈ జంటకి అర్జున్, జాహ్నవీ, ఖుషి కపూర్‌లతో సహా సినీ ప్రముఖులు అభినందిస్తున్నారు. అన్షులా జాన్వీ కపూర్‌కి కజిన్ సిస్టర్ అవుతుంది.

## ఓటీటీకి వచ్చిన.. నార్నే నితిన్ మొట్టమొదటి చిత్రం



జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా ఎంట్రీ ఇస్తూ నటించిన మొట్ట మొటి చిత్రం శ్రీశ్రీశ్రీ రాజ వారు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండానే డిటిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. గత నెల జూన్6న థియేటర్లకు వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందనను రాబట్టుకుంది. అయితే సుమారు మూడేండ్ల క్రితమే నిర్మితమైన ఈ సినిమా విడుదలకు అవాంతరాలు వచ్చి ఆగిపోగా ఆ తర్వాత నార్నే నితిన్ హీరోగా మ్యాడ్, ఆయ్, మ్యాడ్ 2 వంటి చిత్రాలు రిలీజ్ అయి మంచి విజయం సాధించాయి. ఈక్రమంలోనే మ్యా 2 రిలీజై వెళ్లిన వెంటనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. 'శతమానం భవతి'తో నేషనల్ అవార్డ్ సొంతం చేసుకున్న సతీశ్ వేగేశ్న ఈ చిత్రానికి దర్శకత్వం వహించడం విశేషం. సంపద హీరోయిన్‌గా నటించగా, రావు రమేశ్, నరేశ్ విజయ కృష్ణ, ప్రవీణ్ లక్కరాజు కీలక పాత్రల్లో నటించారు.
కథ విషయానికి వస్తే.. రాజా (నార్నే నితిన్) పుట్టుకతోనే సిగరెట్‌కు బానిస. ఆ అలవాటు వల్లే ఊర్లో వాళ్లంతా తనని వెటకారంగా 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు' అని పిలుస్తుంటారు. రాజాకి చిన్నప్పటి నుంచి కృష్ణమూర్తి (రావు రమేశ్) కూతురు నిత్య (సంపద) అంటే ఇష్టం. వారి నిశ్చితార్థం రోజు రాజా చేసిన ఓ తప్పు వల్ల పెళ్లి ఆగిపోతుంది. ఆ తర్వాత కొన్ని అనుకోని పరిణామాల వల్ల రాజా తండ్రి సుబ్బరాజు (నరేశ్), కృష్ణమూర్తికి ఓ ఛాలెంజ్ విసురుతాడు. ఊర్లో ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు తన కొడుకు మళ్లీ సిగరెట్ ముట్టడని, ఈ పందెంలో గెలిస్తే నిత్యను తన కొడుక్కి ఇచ్చి పెళ్లి చేయాలని, ఎంపీటీసీ బరి నుంచి తప్పుకోవాలని షరతు పెడతాడు. అందుకు కృష్ణమూర్తి కూడా ఓకే అంటాడు.
తండ్రి చేసిన ఛాలెంజ్.. తన ప్రేమను గెలిపించుకోవడం కోసం రాజా సిగరెట్ అలవాటు వదులుకున్నాడా? ఈ క్రమంలో అతనికి ఎదురైన సవాళ్లేంటి? రాజాతో సిగరెట్ కాల్పించేందుకు కృష్ణమూర్తి చేసిన ప్రయత్నాలు వర్కవుట్ అయ్యాయా? తదుపరి ఏమైంది? అన్నది కథ. ఓ మలయాళ సినిమా ఆధారంగా అక్కడి నేపథ్యాన్ని మార్చి తెలుగుకు అనుగుణంగా దర్శకుడు సతీశ్ వేగేశ్న ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. అయితే రొటీన్ కథకథనాలు కావడంతో చూసే వారికి పాత సినిమానే చూస్తున్న ఫీల్ వస్తుంది. ఇంతవరకు థియేటర్‌లో చూడని వారు ఓ సారి ఈ చిత్రాన్ని చూసేయవచ్చు. ఇప్పుడీ శ్రీశ్రీశ్రీ రాజ వారు సినిమా ఆహా అమెజాన్ ప్రైమ్ వీడియో రెండు ఓటీటీ ల్లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే సిగరెట్ కాల్చే సన్నివేశాలు, క్లైమాక్స్ లో హీరో హీరోయిన్ల దీర్ఘ చుంబనం దృశ్యాలు కాస్త ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. ఫ్యామిలీతో కలిసి చూసే వారు కాస్త జాగ్రత్త వహించడం ఉత్తమం.

## రికార్డులు చెరిపేస్తున్న హరిహర వీరమల్లు ట్రైలర్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ మూవీ జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. నిన్న ఈ మూవీ ట్రైలర్ విడుదల కాగా, ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కేవలం 24 గంటల్లోనే తెలుగు ట్రైలర్‌కు 48 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇది ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. అంతేకాదు, అన్ని భాషల్లో కలిపి ట్రైలర్‌కు 61.7 మిలియన్ల వ్యూస్ వచ్చాయని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ గణాంకాల నేపథ్యంలో చిత్ర బృందం ఒక ఆసక్తి కర కామెంట్ చేసింది. "ఇది సాధారణ రికార్డ్ కాదు, భవిష్యత్తులో వచ్చే సినిమాలన్నింటికీ ఇది ఒక హెచ్చరిక. అంటూ రాసుకొచ్చారు. మరోవైపు ఇది పుష్ప2 రికార్డ్ కూడా బ్రేక్ చేసిందని అంటున్నారు. ఇప్పటి వరకు సౌత్ ఇండియాలో విడుదలైన 24 గంటలలో 44.67 మిలియన్ వ్యూస్ సాధించిన పుష్ప 2 సాధించింది. ఇప్పుడు దానిని హరిహర వీరమల్లు బ్రేక్ చేసింది. 23 గంటల్లోనే 47 మిలియన్స్ వ్యూస్ సాధించి పుష్ప2 రికార్డ్ బ్రేక్ చేసిందని అంటున్నారు.

## అక్కడ గెలిచిన మానుషి ఇక్కడ ఓటమి



ఇండియన్ ముద్దుగుమ్మలు అంతా కోరుకునే అందాల తార కిరీటంను హర్యానా రాష్ట్రంకు చెందిన మానుషి చిల్లర్ 2017లో దక్కించుకుంది. ఫెమినా మిస్ ఇండియా 2017 పోటీల్లో హర్యానా రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన మానుషి చిల్లర్ అదే ఏడాది మిస్ ఇండియా వరల్డ్ 2017 టైటిల్‌ను గెలుచుకుంది. ఇండియాకు 17 ఏళ్ల తర్వాత మిస్ వరల్డ్ కిరీటాన్ని అందించిన ముద్దుగుమ్మగా మానుషి చిల్లర్ నిలిచింది. ఈ అరుదైన గౌరవం, అందాల కిరీటం దక్కించుకున్న ఆరవ భారతీయురాలుగా మానుషి చరిత్రలో నిలిచింది. సాధారణంగా అందాల పోటీల్లో విజయం సాధించిన వారు ఎక్కువగా సినిమాల్లో అడుగు పెడుతూ ఉంటారు, చాలా మంది అదే విధంగా సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టారు. వీరమల్లు వేట మొదలు మానుషి సైతం బాలీవుడ్‌లో అడుగు పెట్టింది. అందాల కిరీటం వచ్చిన తర్వాత కొంత గ్యాప్ తీసుకుని మానుషి చిల్లర్ సినిమా ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వడం జరిగింది. 2022లో సామ్రాట్ పృథ్వీరాజ్ అనే పౌరాణిక సినిమాలో మానుషి నటించింది. తక్కువ సమయంలోనే మానుషికి హీరోయిన్‌గా మంచి గుర్తింపు లభించింది. మానుషి హీరోయిన్‌గా మొదటి ప్రయత్నం విఫలం అయింది. మానుషి చిల్లర్ మొదటి సినిమా అట్టర్ ఫ్లాప్ కావడంతో మళ్లీ ఆఫర్లు వచ్చేనా అనే అనుమానాలు వ్యక్తం అయ్యాయి. కానీ మానుషి చిల్లర్‌కి అదృష్టం కలిసి వచ్చింది. ఆ వెంటనే ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ అనే సినిమాలో నటించింది. ఆ సినిమా సైతం ఈమెకు ఆశించిన స్థాయిలో హిట్ తెచ్చి పెట్టలేదు. వరుసగా రెండు సినిమాలు ఫ్లాప్ కావడంతో మానుషి చిల్లర్ కెరీర్ సందిగ్ధంలో పడ్డట్లు అయింది. ఆఫర్ల కోసం ఎదురు చూస్తున్న సమయంలో తెలుగు నుంచి ఆపరేషన్ వాలెంటైన్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. వరుణ్ తేజ్‌కి జోడీగా ఆ సినిమాలో మానుషి నటించింది. ఆ సినిమా గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఆ సినిమా అక్కడ, ఇక్కడ రెండు చోట్ల నిరాశ పరిచింది. గత ఏడాదిలోనే బడే మియాన్ చోటే మియాన్ సినిమాలోనూ ముఖ్య పాత్రలో నటించింది. ఆ సినిమా సైతం మానుషికి నటిగా పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. ప్రస్తుతం ఈ అమ్మడు 'మాలిక్' సినిమాపై సర్వం ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది.

## గెలిపించాల్సింది అతడే.. ఈ లాజిక్ వర్కౌట్ అవుతుందా?



**న్యూఢిల్లీ-నవభూమి:** పీడకలగా చెప్పుకునే ఎడ్జ్‌బాస్టన్‌లో తొలి గెలుపును రుచి చూడాలని అనుకుంటోంది టీమిండియా. ఈ దిశగా భారీ అడుగులు పడ్డాయి. ఇక్కడ ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్.. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 587 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ గిల్ డబుల్ సెంచరీతో చెలరేగాడు. ఇతర బ్యాటర్లు కూడా రాణించడంతో కొండంత స్కోరు చేసింది మెన్ ఇన్ బ్లూ. అలాగే తర్వాత బ్యాటింగ్ మొదలుపెట్టిన ఆతిథ్య జట్టును తీవ్రంగా ఇబ్బందులు పెట్టింది. తొలి రోజు ముగిసేసరికి 3 వికెట్లకు 77 పరుగులతో ఉంది ఇంగ్లండ్. దీంతో మూడో రోజు ఏం అవుతుంది? మన బౌలర్లు మరింత చెలరేగుతారా? అని అంతా ఆలోచనల్లో పడ్డారు. ముఖ్యంగా ఆ ఒక్కడి మీదే అంతా ఫోకస్ చేస్తున్నారు. ముంచినా.. తేల్చినా అతడే అంటున్నారు. రెండో రోజు సాయంత్రం ఆకాశ్‌దీప్, మహ్మద్ సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఇద్దరూ కట్టుదిట్టంగా బంతులు వేసి 3 వికెట్లు పడగొట్టారు. మరో పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ బ్రేక్‌త్రూ ఇవ్వలేకపోయాడు. అయితే మూడో రోజు అతడి చుట్టూనే ఆట నడిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. లీడ్స్ టెస్ట్‌లో ప్రసిద్ధ్ వికెట్లు తీసినా భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. అది జట్టుకు బిగ్ మైనస్‌గా మారింది. ఇవాళ కూడా అతడ్నే రూట్, స్టోక్స్, బ్రూక్ లక్ష్యంగా చేసుకొని భారీ షాట్లు ఆడే చాన్సులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రసిద్ధ్ గానీ చెలరేగకపోతే టీమిండియాకు కష్టమేననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ కోచ్ రవిశాస్త్రి కూడా ఇదే అంటున్నాడు. ప్రసిద్ధ్‌తో దూకుడుగా బౌలింగ్ చేయించాలని ఎక్స్‌పర్ట్స్ అంటున్నారు. మిగతా పేసర్లతో కట్టుదిట్టంగా స్పెల్స్ వేయిస్తూ.. మరోవైపు నుంచి అతడితో అటాక్ చేయించాలని అంటున్నారు.

## చిన్ననాటి స్టయిల్‌లో బ్యాటింగ్ చేశా: శుభమన్ గిల్



**బర్మింగ్‌హామ్-నవభూమి:** టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో డబుల్ సెంచరీ చేసిన విషయం తెలిసిందే. అతను 387 బంతుల్లో 269 రన్స్ చేశాడు. అయితే చిన్నప్పుడు ఎలా బ్యాటింగ్ చేశానో, ఆ తరహాలోనే ఆడేందుకు ప్రయత్నించినట్లు అతను చెప్పాడు. టెక్నిక్‌పై ఏమైనా ఫోకస్ పెట్టారా అని అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఐపీఎల్ ముగిసిన తర్వాత.. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు, దీనిపై చాలా వర్క్ చేసినట్లు గిల్ తెలిపాడు. బాడీ మూమెంట్‌పై ప్రధానంగా వర్క్ చేశానని, బ్యాటింగ్ బాగానే సాగుతుందని అనుకున్నానని, టెస్టుల్లో 30, 40 రన్స్ ఈజీగా చేస్తున్నాని, కానీ కీలక సమయంలో ఏకాగ్రత మిస్ అవుతున్నాని అర్థమైందని, కొన్ని సార్లు ఎక్కువ ఫోకస్ చేస్తే కూడా నష్టం జరిగే అవకాశం ఉందని గ్రహించానని, అందుకే బేసిక్ ఆటకు ప్రాధాన్యం ఇచ్చానని, చిన్నప్పుడు ఆడిన స్టయిల్‌లో ఆడానని, లాంగ్ ఇన్నింగ్స్‌పై దృష్టి పెట్టకుండా, బ్యాటింగ్‌ను ఎంజాయ్ చేసినట్లు చెప్పాడు.

నవక్రీడ

## బీసీసీఐకి కేంద్రం నో.. ఇక ఆ సిరీస్ గురించి మర్చిపోవాల్సిందే!



**న్యూఢిల్లీ-నవభూమి:** టెస్టులకు గుడ్‌బై చెప్పేసిన దిగ్గజ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీని తిరిగి బ్లూ జెర్సీలో చూసేందుకు అభిమానులు ఎంతగానో ఎదురు చూస్తున్నారు. త్వరలో బంగ్లాదేశ్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీళు దుమ్మురేపుతుంటే చూసి ఎంజాయ్ చేయాలని అనుకున్నారు. కానీ ఫ్యాన్స్ ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. ఎందుకంటే ఆగస్టులో జరిగే ఇండో-బంగ్లా సిరీస్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని తెలుస్తోంది. బంగ్లాదేశ్‌లో నెలకొన్న అనిశ్చిత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఆ దేశంలో పర్యటించడానికి మోదీ సర్కారు నో చెప్పిందని సమాచారం.
బంగ్లాతో 3 వన్డేలు, 3 టీ20లు ఆడాల్సి ఉంది భారత్. ఆగస్ట్ 17 నుంచి జరిగే వన్డే సిరీస్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తప్పక ఆడతారని అభిమానులు ఎదురు చూస్తున్నారు. అయితే బంగ్లాదేశ్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, స్థానిక సర్కారు సిచ్యువేషన్ ఇబ్బందికరంగా ఉండటంతో అక్కడికి టీమిండియాను పంపేందుకు కేంద్ర ప్రభుత్వం నో చెప్పిందని తెలుస్తోంది. ప్లేయర్ల సేఫ్టీ విషయంలో రాజీ పడబోమని కేంద్రం స్పష్టం చేసిందట. దీంతో ఈ సిరీస్‌లను వాయిదా వేస్తారా? లేదా రద్దు చేస్తారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పాకిస్థాన్‌తో మ్యాచుల మాదిరిగా తటస్థ వేదికల్లో నిర్వహించే దిశగా ఆలోచనలు చేస్తారా అనేది కూడా క్లారిటీ లేదు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**